www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
23-11-2024
సంపుటి : 01 | సంచిక : 201 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిన
# పెండింగ్ కేసులు

**కోర్టుల భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వ కేంద్రాలు అవసరం**

**సామాన్య ప్రజలకు, చిన్న సంస్థలకూ అవి ఉపయోగపడాలి**

**మీడియేషన్, ఆర్బిట్రేషన్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

**భారత్‌లో పూర్వకాలం నుంచే మధ్యవర్తిత్వం ఉంది: జస్టిస్ అలోక్ అరాధే**

**విశ్వంభర, హైదరాబాద్:** కేసులు భారీగా పెండింగ్‌లో ఉండటం న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కోర్టులపై ఈ భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వం, వివాదాల పరిష్కార కేంద్రాల అవసరం ఎంతో ఉందని సీఎం అన్నారు. వాటి ద్వారా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమవుతాయని.. వివాదంలో చిక్కుకున్న ఇరు వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గచ్చిబౌలిలో నిర్వహించిన కామన్‌వెల్త్ మీడియేషన్, ఆర్బిట్రేషన్ కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, మిగతా2లో...



## దండకారణ్యంలో భారీ
# ఎన్‌కౌంటర్

- మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు
- 10 మంది మావోయిస్టులు మృతి
- ఘటనాస్థలంలో మూడు ఆటోమేటిక్ రైఫిల్స్ సహా పలు ఆయుధాలను స్వాధీనం

3

## ములుగు జిల్లాలో మావోయిస్టుల
# దుశ్చర్య

పంచాయతీ కార్యదర్శి సహా మరొకరి హత్య

3




## మనమంతా
# ఒక్కటే

వనవాసి అయినా
నగరవాసి అయినా
మొదట మనం
భారత వాసులం

సమాజాన్ని చీల్చడానికి నలుమూలలా కుట్రలు

అయినా భారతీయమే మనను కలిపి ఉంచుతోంది

లోక్‌మంథన్ ప్రారంభోపన్యాసంలో రాష్ట్రపతి ముర్ము



**విశ్వంభర, హైదరాబాద్:** వనవాసి అయినా, గ్రామ వాసి అయినా, నగర వాసి అయినా.. మనమందరం భారతవాసులమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈ ఏకతా సూత్రమే అందరినీ కలిపి ఉంచుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మకమైన లోకమంథన్ భాగ్యనగర్ 2024'' కార్యక్రమాన్ని శుక్రవారం జ్యోతిప్రజ్వలన చేసి రాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మిగతా2లో...

## నేడే మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల ఫలితాలు


- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం..
- ఫలితాలపై ఉత్కంఠ!



2

మూడు బ్యారేజీలపై మరిన్ని
# డాక్యుమెంట్లు ఇవ్వండి

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆదేశం
- సోమవారం నుంచి తదుపరి విచారణ
- క్షేత్రస్థాయి వివరాల సేకరణ అనంతరం ఆర్థిక అంశాలపై ఆరా



2



2

## 6 కంపెనీలు.. రూ.5260 కోట్ల
# పెట్టుబడులు

- ముందుకొచ్చిన ప్రముఖ ఫార్మా సంస్థలు
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులతో సంప్రదింపులు
- రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు

## అదానీని తక్షణమే అరెస్టు చేయాలి

- ప్రధాని మోదీ అండతోనే అవినీతి సామ్రాజ్యం
- ఆరోపణలపై విచారణకు జేపీసీ ఏర్పాటుచేయాలి
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

2



## తగిన సమయంలో స్పీకర్
# నిర్ణయం తీసుకోవాలి

- ఐదేళ్ల గడువును దృష్టిలో ఉంచుకోవాలి
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పు
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల కొట్టివేత

**విశ్వంభర, హైదరాబాద్:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి మిగతా2లో...

## విప్లవాత్మక పథకాలపై
# విస్తృత కార్యక్రమాలు

- ఏడాదిపై పాలన ఫలితాలు ఇంటింటికీ చేరాలి
- ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో రైతు దినోత్సవ సభ
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో
- రాష్ట్రస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సమావేశానికి హాజరైన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు

2



మరిన్ని తాజా వార్తల కోసం
**స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 107 | ₹ 129 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 187 | ₹ 213 |

## స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

- రీజినబుల్ పీరియడ్ అంటే మూడెనెలలని సుప్రీం తీర్పు ఉంది
- హైకోర్టు తీర్పుపై కేటీఆర్ స్పందన



**విశ్వంభర, హైదరాబాద్:** ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభాపతి నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. అనర్హత పిటిషన్ల విషయమై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మిగతా2లో...

## ప్రజా భాగస్వామ్యంతోనే చెరువుల పునరుద్ధరణ

- నిర్మాణాలు కూల్చి వాటిని కాపాడటం హైడ్రా ఉద్దేశం కాదు
- చెరువుల పరిధిలో కొత్త నిర్మాణాలను అడ్డుకోవడమే లక్ష్యం: కమిషనర్ రంగనాథ్




2

## 'మూడో ప్రపంచ యుద్ధం మొదలైనట్లే'

- ఉత్తర కొరియా దళాలు, చైనా ఆయుధాలు ఈ యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి
- ఉక్రెయిన్ మాజీ జనరల్ వ్యాఖ్యలు

2



# విప్లవాత్మక పథకాలపై విస్తృత కార్యక్రమాలు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా సందర్భంగా, ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చేరవేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం సచివాలయంలో సమావేశమైంది. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ- సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

**పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు**

ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం సందర్భంగా ప్రజా విజయోత్సవాలు ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్ లోని ఎల్.బీ స్టేడియంలో పాఠశాల విద్యార్థుల దినోత్సవం, వరంగల్ లో మహిళా దినోత్సవం కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, అదేవిధంగా ఈనెల 30 వ తేదీన మహబూబ్ నగర్ లో రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వివరించారు. అదేవిధంగా డిసెంబర్ 7, 8, 9 తేదీలలో హైదరాబాద్ ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాలలో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల ఉత్సవాలలో మహిళలు, పిల్లలు, పౌరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

**పండగ వాతావరణంలో ఉత్సవాలు**

ఇప్పటికే, ప్రతీ జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా జరుగుతున్నాయని, అదేవిధంగా ప్రతీ గ్రామ స్థాయి నుండి, మండలాలు, జిల్లా స్థాయి వరకు ఈ ప్రజా విజయోత్సవాలు పండగ వాతావరణంలో నిర్వహించాలని తెలియచేశారు. ప్రతీ శాఖలో ఈ సంవత్సర కాలంలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలపై అంతర్గతంగా వేడుకలు నిర్వహించుకోవాలని డిప్యూటీ సి.ఎం ఆదేశించారు. ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విజయాలను ప్రతీ వ్యక్తికీ చేరవేసేలా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ బడులలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో సాధించిన విజయాలను సక్సెస్ స్టోరీలను తమ వెబ్సైట్లో, సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు.

**సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం**

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 లక్షల స్వయం సహాయక మహిళలకు సున్నా వడ్డీ పథకం, బ్యాంకు లింకేజీలు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ తదితర మహిళా సాధికారత పథకాల వివరాలన్నీ వారికి చేరవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన హోర్డింగులు, షార్ట్ ఫిలిం లు, తదితర ప్రచార అంశాలను హోర్డింగులు, ప్రకటనలు, సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్న దాదాపు 25 వేల ఆర్టీసీ బస్సుల పై ఈ హోర్డింగులు ఏర్పాటు చేయాలను అన్నారు. ప్రధానంగా ప్రభుత్వ గ్యారెంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500 లేక్ గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ కవరేజి పెంపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ విషయా సంస్థల ఏర్పాటు తదితర పథకాలపై పాఠశాల విద్యార్థులు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, శ్రీధర్, క్రిస్టినా జోంగ్తు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవీ గుప్తా, హైదరాబాద్, సైబరాబాద్ నగర పోలీస్ కమీషనర్లు సి.వీ ఆనంద్, మొహంతి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్, ఫైర్సర్వీసుల డీజీ నాగి రెడ్డి, సి.ఎం. ఓ అధికారులు షా నవాజ్ కాసీం, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, శ్రీరామ్ కర్రీ వివిధ శాఖల కార్యదర్శులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు .

## స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

**(మొదటి పేజీ తరువాయి)**

నేతృత్వంలోని బెంచ్ తీర్పుపై ఆయన స్పందించారు. మొన్నటి వరకు సభాపతిని ఆదేశించే అధికారం కోర్టుకు లేదని వాదించారని కేటీఆర్ గుర్తు చేశారు. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సీజే స్పష్టం చేశారని, రీజనబుల్ పీరియడ్ అంటే మూడు నెలలు అని మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో స్పష్టంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

**అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలి**

అంతర్జాతీయంగా మళ్లీ అదానీ వ్యవహారం బయటపడిందని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమెరికా నుంచి ఆఫ్రికా వరకు ఇది వెలుగు చూసిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అదానీ వ్యాపార సామ్రాజ్యం విస్తరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ''మా పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అదానీ తెలంగాణకు రాలేదు. కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలియకుండా రేవంత్‌రెడ్డి ఆయనకు రెడ్‌కార్పెట్ పరిచారా? రూ.12,400 కోట్లతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. విద్యుత్‌కు సంబంధించి ప్రాజెక్టులు అదానీకి అప్పగిచేందుకు సీఎం ప్రయత్నించారు. స్కిల్ యూనివర్సిటీకి ఆయన రూ.100 కోట్ల విరాళం ఇచ్చారు. వ్యాపారవేత్తలు రూ.40వేల కోట్ల విరాళాలు ఉచితంగా ఇవ్వరని రాహుల్‌గాంధీ అన్నారు. జాతీయ పార్టీకి ఓ జాతీయ విధానం ఉండాలి. అదానీతో చేసుకున్న ఒప్పందాలను కెన్యా రద్దు చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఎందుకు ఆ నిర్ణయం తీసుకోవడం లేదు?రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలి'' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిన పెండింగ్ కేసులు

**(మొదటి పేజీ తరువాయి)**

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో పాటు ఇతర న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామికవేత్తలకు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు, చిన్న సంస్థలకు కూడా ఆర్బిట్రేషన్ కేంద్రాలు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచే భారత్‌లో మధ్యవర్తిత్వం ఉందన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. పలు అంతర్జాతీయంగా కొన్ని దేశాల్లో మధ్యవర్తిత్వంపై చట్టాలున్నాయన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ.. వివాదాల పరిష్కారం ద్వారా శత్రుత్వం తగ్గి స్నేహభావం పెరుగుతుందన్నారు. న్యాయ వ్యవస్థ కూడా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## మూడు బ్యారేజీలపై మరిన్ని డాక్యుమెంట్లు ఇవ్వండి

**విశ్వంభర, హైదరాబాద్:** మూడు బ్యారేజీలకు సంబంధించి మరికొన్ని డాక్యుమెంట్లు ఇవ్వాలని నీటిపారుదల శాఖను జస్టిస్ పీసీఘోష్కమిషన్ ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన పలు అంశాలపై కమిషన్ ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చింది. ఎక్కడ ఏం జరిగింది.. లోపాలు ఏమున్నాయి... ఎవరి ప్రమేయం ఉంది... తదితర అంశాలకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు సమాచారం. వాటన్నింటి ఆధారంగా జస్టిస్ పీసీఘోష్ కమిషన్ నివేదిక సిద్ధం చేయనుంది. కాగా కాళేశ్వరం కమిషన్ తదుపరి విచారణ సోమవారం నుంచి జరగనుంది. ఆ రోజు నుంచి రోజుకు 14 మంది చొప్పున క్షేత్రస్థాయి ఇంజినీర్లను కమిషన్ విచారించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టల నిర్మాణంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన ఇంజినీర్లను జస్టిస్ పీసీ ఘోష్ విచారణ చేయనున్నారు. అనంతరం ఐఏఎస్ అధికారులు, విశ్రాంత అధికారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు. వారితోపాటు గుత్తేదార్లు, కమిషన్ ముందు అఫిడవిట్ దాఖలు చేసిన ఇతర వ్యక్తులను కూడా విచారించనున్నారు. బ్యారేజీల పనుల్లో సబ్ కాంట్రాక్టర్ల వ్యవస్థపై కమిషన్ దృష్టి సారించింది. అందులో భాగంగా క్షేత్రస్థాయి ఇంజినీర్ల నుంచి అవసరమైన సమాచారాన్ని రాబట్టనుంది. ఇంజినీరింగ్ అంశాలన్నీ పూర్తయిన తర్వాత ఆర్థిక అంశాలు, నిధులకు సంబంధించిన వాటిపై దృష్టి సారిస్తారు. కాగ్ , విజిలెన్స్ నివేదికలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అకౌంట్స్ సంబంధిత అధికారులను కూడా విచారణ చేయనున్నారు.

## అదానీని తక్షణమే అరెస్టు చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్:** అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేశారని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ''అదానీ దాదాపు రూ.2వేల కోట్ల మేర లంచాలు పంచారు. ఆయన అవినీతిపై రాహుల్‌గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదు. అర్హత లేకపోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారు. ప్రధాని మోదీ అండతో అనేక విమానాశ్రయ కాంట్రాక్టులు చేజిక్కించుకుని అవినీతి సామ్రాజ్యం స్థాపించారు. 2014 తర్వాత అదానీ సంపద ఎలా పెరిగిందో చూశాం. రూ.100 కోట్ల అవినీతి జరిగిందని చెప్పి సీఎంలను జైల్లో వేశారు. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీపై చర్యలేవి?'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.

## తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. బీఆర్ ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్‌లను స్పీకర్ స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబరు 9న దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలని తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీళ్లపై ఇటీవల వాదనలు ముగియగా తీర్పును వాయిదా వేసింది. తాజాగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ శుక్రవారం ఉన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించింది.

# 6 కంపెనీలు.. రూ.5260 కోట్ల పెట్టుబడులు

**విశ్వంభర, హైదరాబాద్:** దేశంలో పేరొందిన ఫార్మా కంపెనీలు హైదరాబాద్ లో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. తమ కంపెనీల కార్యకలాపాల విస్తరణతో పాటు కాలుష్య రహితంగా ఏర్పాటు చేసే గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో సంప్రదింపులు జరిపారు. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీల ప్రతినిధులు, టీఎస్ఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మా కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ.5260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించనుంది. ఎంవోయూల ఒప్పందాల ప్రకారం ఎంఎస్ఎన్ లాబోరేటరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ నెలకొల్పనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ పార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్ స్టెన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో ల్యాబ్స్ ఫినిషిడ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమ నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ డైరెక్టర్ సతీష్ రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఈడీ వివి రవికుమార్, గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్, ఎంఎస్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి, అరబిందో డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండీ బి.వంశీకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## 'మూడో ప్రపంచ యుద్ధం మొదలైనట్లే'

ఉక్రెయిన్-రష్యా మధ్య క్షిపణి ప్రయోగాలతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అటు ఉక్రెయిన్‌కు మద్దతిస్తోన్న అమెరికా, ఇటు రష్యా దూకుడు చర్యలతో సంక్షోభం మరింత ముదిరే ప్రమాదం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ మాజీ కమాండర్-ఇన్-చీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజా పరిణామాలను చూస్తుంటే మూడో ప్రపంచ యుద్ధం ఇప్పటికే మొదలైనట్లు భావిస్తున్నానని అన్నారు. తాజా సంక్షోభంలో రష్యా మిత్రదేశాలు పాల్గొనడం ఇదే విషయాన్ని సూచిస్తోందన్నారు. ''ఉత్తర కొరియాకు చెందిన సైనికులు ఉక్రెయిన్‌పై పోరాడుతున్నారు. ఇరాన్ రూపొందించిన ఆయుధ సామగ్రితో (డ్రోన్లతో) ఉక్రెయిన్‌లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఉత్తర కొరియా దళాలు, చైనా ఆయుధాలు ఈ యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి'' అని ఉక్రెయిన్ మాజీ కమాండర్-ఇన్- చీఫ్ వాలెరీ జలుజ్నీ పేర్కొన్నారు. బ్రిటన్‌లో ఉక్రెయిన్ రాయబారిగా ఉన్న ఆయన.. ఓ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ విధంగా మాట్లాడారు. ఇటువంటి తరుణంలో 2024లో మూడో ప్రపంచ యుద్ధం మొదలైందనే మనం విశ్వసించవచ్చని జలుజ్నీ అభిప్రాయపడ్డారు. తాజా సంక్షోభం మరింత విస్తరించకుండా నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని ఉక్రెయిన్ మిత్రదేశాలకు విజ్ఞప్తి చేశారు. దీన్ని ఇక్కడితో ఆపడం సాధ్యమేనని, కానీ..కొన్ని కారణాల వల్ల తమ భాగస్వామ్యపక్షాలు దీనిని అర్థం చేసుకోవడం లేదన్నారు. ఉక్రెయిన్‌కు ఇప్పటికే అనేక మంది శత్రువులు ఉన్నారన్న మాట వాస్తవమన్నారు.

## ప్రజా భాగస్వామ్యంతోనే చెరువుల పునరుద్ధరణ



**విశ్వంభర, హైదరాబాద్:** నిర్మాణాలు కూల్చి చెరువులు కాపాడటం హైడ్రా ఉద్దేశం కాదని, చెరువుల పరిధిలో కొత్త నిర్మాణాలను అడ్డుకోవడం తమ లక్ష్యమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. చెరువులను పునరుద్ధరించాలంటే ఇళ్లను కూల్చాల్సిన పని లేదని అన్నారు. చెరువులో నీటి విస్తీర్ణం, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లు, విలేజ్ మ్యాప్‌లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం హైడ్రా కార్యాలయంలోని విశ్రాంత ఇంజినీర్లు, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో రంగనాథ్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. అక్రమ నిర్మాణాల విషయంలో మానవత్వంతో ఆలోచిస్తే సమాజమంతా బాధపడాల్సి వస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు. కొన్నిసార్లు మనుసును చంపుకొని పని చేయాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. అమీన్‌పూర్ తూములు మూయడంతోనే లేఔట్లు మునిగాయని తెలిపారు. తప్పుడు అనుమతులు ఇచ్చినవి, అనుమతులు రద్దు చేసిన ఇళ్లను మాత్రమే కూల్చివేశామని వెల్లడించారు. కొంతమందిపై చర్యలతో హైడ్రా పని అందరికీ తెలిసిందని అన్నారు. ప్రజల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అవగాహన వస్తోందని, ఆక్రమణల నియంత్రణకు ఆధునిక సాంకేతికతను వాడుతున్నామని వివరించారు. నిపుణులు ఇచ్చిన సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ప్రతి చెరువు పునరుద్ధరణకు ప్రజలను భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణ కోసం హైడ్రా కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. 'చెరువులను ఎలా కాపాడుకోవాలని అని పలు అంశాలపై చర్చించాం. చర్చించిన విషయాలను ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్తాం. చెరువుల పునరుద్ధరణ, ఎఫ్‌టీఎల్ పరిధికి సంబంధించిన విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా ప్రయత్నిస్తాం' అని రంగనాథ్ తెలిపారు.

**వాతావరణ శాఖతో కలిసి పని చేస్తాం :** మరోవైపు ప్రకృతి విపత్తుల నుంచి హైదరాబాద్ ప్రజలను అప్రమత్తం చేసేందుకు వాతావరణశాఖతో కలిసి పని చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. పెరుగుతున్న పట్టణీకరణ వల్ల వాతావరణశాఖ నుంచి వచ్చే అప్రమత్త సందేశాలు కచ్చితత్వంతో ఉండేలా చూసుకోవాలని సూచించారు. భారత వాతావరణ శాఖ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇవాళ అమీర్‌పేట్‌లోని సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఎండీ అలర్ట్ సందేశాన్ని ఆయన ఆవిష్కరించారు. వాతావరణ మార్పులను అంచనా వేయడంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మహాపాత్ర తెలిపారు. బెంగళూరు తరహాలో ప్రతి 15 నిమిషాలకు డేటా సేకరించి విశ్లేషించాలని రంగనాథ్ అభిప్రాయపడ్డారు.

# మనమంతా ఒక్కటే

**(మొదటి పేజీ తరువాయి)**

మాట్లాడుతూ... భారత సమాజాన్ని చీల్చడానికి అన్ని మూలలా కుట్రలు జరుగుతున్నాయని, భారతీయ సమాజంలోనే అత్యంత సహజంగా ఉన్న ఏకత్వ లక్షణాన్ని విచ్ఛిన్నం చేయడానికి, మరి కొందరు భారతీయుల్లో కృత్రిమ భేద భావాలను సృష్టిస్తున్నారన్నారు. అయినా సరే.. భారతీయత అనే ధర్మం ఆధారంగా ప్రజలందరూ కలిసికట్టుగానే ఉన్నారన్నారు. చాలా కాలం పాటు భారత దేశాన్ని విదేశీయులు పాలించారని, ఈ సమయంలో ఆ సామ్రాజ్యవాద శక్తులు భారత ఆర్థిక వ్యవస్థను కొల్లగొట్టడంతో పాటు ఇక్కడి సామాజిక స్థితిగతులను కూడా ఛిన్నాభిన్నం చేశారన్నారు. మన సంస్కృతిని ఆంగ్లేయులు ఏహ్యాభావంతో చూసేవారని, అలాగే మనలో కూడా మన సంస్కృతిపై ఏహ్య భావం వచ్చేలా కుట్రలు చేశారన్నారు. విదేశీయులు చాలా సంవత్సరాలు పరిపాలించడంతో మెదళ్లలో వలసవాద బుద్ధే ఆక్రమించిందన్నారు. భారత్‌ను శ్రేష్ఠమైన దేశంగా నిర్మాణం చేయడానికి, భారతీయుల మానసిక ప్రవర్తనను మార్చి, వారిని ఏకత్వం, శ్రేష్ఠత్వం వైపు తీసుకెళ్లాల్సిన కర్తవ్యం అందరిపై వుందని సూచించారు.

**వలసవాద మనస్తత్వం నుంచి బయటికొస్తున్నాం**

కొన్ని సంవత్సరాలుగా వలసవాద, బానిసత్వ మనస్తత్వం నుంచి బయటపడడానికి భారత్ లో కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఇందులో భాగంగా భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలను తీసుకొచ్చారన్నారు. అలాగే ఢిల్లీలో రాజ్ పథ్ పేరును తొలగించి, కర్తవ్య పథ్ గా నామకరణం చేశారని గుర్తు చేశారు. ఈ అంశాలతో పాటు రాష్ట్రపతి భవన్ లో ఉండే దర్బార్ హాలు పేరును కూడా గణతంత్ర మండపంగా మార్చుకున్నామన్నారు. మరోవైపు న్యాయ వ్యవస్థలో న్యాయదేవత విగ్రహానికి సంబంధించి, న్యాయదేవత కళ్లకు వుండే వస్త్రాన్ని తొలగించి, మార్పులు చేశారన్నారు. ఈ మార్పులన్నీ భారతీయ ప్రాచీన పరంపర మాధ్యమంగా వచ్చినవేనని, ఈ మార్పులన్నీ వలసవాద, బానిసత్వ మనస్తత్వం నుంచి బయటపడ్డామని కనిపించే ఉదాహరణలేనని రాష్ట్రపతి వివరించారు.

**విశ్వవ్యాప్తమైన భారతీయత**

భారతీయ ఆధ్యాత్మికత, పరంపర, కళలు, సాహిత్యం, సంగీతం, చికిత్సా పద్ధతి, భాష ప్రపంచమంతా విస్తరించాయని, ప్రజలు ఆదర్శవంతంగా జీవించడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ పరంపరను మరింత పరిపుష్టం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రాచీన కాలం నుంచే భారతీయ ఆలోచాన పరంపర విదేశాలను బాగా ప్రభావితం చేసిందని, ఇప్పుడు మరింత విస్తరించిందన్నారు. ఈ ప్రభావాలు వారి ఆధ్యాత్మికతలో, సంస్కృతిలో ప్రస్ఫుటంగా ద్యోతకమవుతూనే వున్నాయని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతి అని, అయితే అందులో ఏకత్వం ముఖ్యమైన సారమని రాష్ట్రపతి పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అన్న సారాంశంలో ఏకత్వమే మూలాధారమని, ఇది ఇంద్రధనస్సు లాంటిదని, అదే సుందరత్వాన్ని చేకూరుస్తుందని అభివర్ణించారు. ఈ లోక్ మంథన్ ను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందని రాష్ట్రపతి ప్రకటించారు. 2018 లో రాంచీ వేదికగా జరిగిన లోక్ మంథన్ లో కూడా తాను పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. భారత సంస్కృతిలోని ఏకత్వాన్ని మరింత సుదృఢం చేయడానికి ఈ మంథన్ ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రయత్నం అద్భుతమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా దేశ ప్రజల్లోని స్వాభిమానం, సాంస్కృతిక భావనలకు మరింత పుష్టి చేకూరుతుందన్నారు. భారత సంస్కృతి, సంప్రదాయాలను అర్థం చేసుకోవడంలో, మన పరంపరను ఎప్పటికప్పుడు మరింత పరిపుష్టం చేయడంలో అందరూ తమ వంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. ఈ లోక్ మంథన్ లో అహల్యాబాయి హోల్కర్, రుద్రమ దేవి లాంటి వీరనారీమణుల జీవిత గాథలను ఆధారంగా చేసుకొని నాటకాలు కూడా ఉన్నాయని తెలిసి చాలా ఆనందం వేసిందని, వీటి ద్వారా శౌర్య పరంపర, నారీశక్తిని బయటికి తీసినట్లవుతుందని తెలిపారు. ఈ ప్రయత్నం ముఖ్యంగా యువతకు ఎంతో ప్రేరణనిస్తుందని తెలిపారు. భారతీయ కళలు, కళాకారులు జాతిని ఐక్యంగా వుంచడంలో ఉపయోగపడతాయని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్,కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, లోక్ మంథన్ రిసెప్షన్ కమిటీ ఛైర్మన్ జి.కిషన్ రెడ్డి, ప్రజ్ఞా ప్రవాహ ప్రధాన కార్యదర్శి నంద కుమార్, ప్రజ్ఞాభారతి ఛైర్మన్ హనుమాన్ చౌదరి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడే మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల ఫలితాలు

**ముంబయి:** మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం 8 గంటలకు రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానుంది. వీటితోపాటు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లోని 46 అసెంబ్లీ స్థానాలకు, నాందేడ్, వయనాడ్ లోక్‌సభ స్థానాల (ఉపఎన్నికల) ఓట్లను లెక్కించనున్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ పోరు హోరాహోరీగా సాగగా.. సీఎం ఎవరు కానున్నారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**రికార్డుస్థాయి పోలింగ్..**

మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలతోపాటు నాందేడ్ లోక్‌సభకు ఇటీవల ఓటింగ్ జరిగింది. రాష్ట్రంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 61.1శాతం పోలింగ్ నమోదు కాగా.. తాజా ఎన్నికల్లో 66.05శాతం పోలింగ్ నమోదైంది. ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం మూడు దశాబ్దాల్లో ఇదే తొలిసారి కావడం విశేషం. గతంలో 1991లో మహారాష్ట్రలో అత్యధికంగా 71.7శాతం నమోదైంది.

**ఉదయం 8గంటలకు కౌంటింగ్..**

శనివారం ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా.. 9 గంటల నుంచి ఫలితాల సరళి తెలిసే అవకాశం ఉంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు చొప్పున 288 మంది అబ్జర్వర్లతో పర్యవేక్షణ కొనసాగనుంది. నాందేడ్ లోక్‌సభ లెక్కింపును ప్రత్యేకంగా ఇద్దరు అబ్జర్వర్లు పర్యవేక్షించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 1732 టేబుళ్లు, ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ (ఈటీపీబీఎస్)ల కోసం 592 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మహారాష్ట్రలో విజయంపై అధికార మహాయుతి, విపక్ష ఎంవీఏలు కూటములు ధీమాగా ఉన్నాయి.

**ఝార్ఖండ్‌లో 81 స్థానాలకు..**

ఝార్ఖండ్‌లో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగగా.. తొలిసారిగా 67.74శాతం పోలింగ్ నమోదయ్యింది. నవంబర్ 15, 2000లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈస్థాయిలో పోలింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక్కడ నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. అధికార జేఎంఎం మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా, విపక్ష ఎన్డీయే కూడా తమదే విజయం ఖాయమని చెబుతోంది. ఇటీవల వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ ఝార్ఖండ్‌లో ఎన్డీయేవైపు మొగ్గు చూపాయి. ఈ రెండు రాష్ట్రాలతోపాటు కేరళలోని వయనాడ్ లోక్‌సభ సహా 13 రాష్ట్రాల్లో 46 అసెంబ్లీ స్థానాల (ఉప ఎన్నికల) ఓట్ల లెక్కింపు కూడా శనివారం జరగనుంది.

# త్వరలో కులగణన ప్రత్యేక కమిషన్‌కు నివేదిక

- తెలంగాణ జాగృతి నిర్ణయం
- గతంలో అన్ని జిల్లాల్లో సమావేశాలు
- అభిప్రాయాలను క్రోడీకరించి నివేదిక తయారీ
- వెల్లడించిన ఎమ్మెల్సీ కవిత



**విశ్వంభర, హైదరాబాద్ :** కుల సర్వే, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంపుపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కులగణన డెడికేటెడ్ కమిషన్‌కు నివేదిక అందించాలని తెలంగాణ జాగృతి సంస్థ నిర్ణయించింది. తెలంగాణ జాగృతి నాయకులతో కలిసి త్వరలో కులగణన డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ బూసాని వెంకటేశ్వర రావుకు జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివేదికను అందించనున్నారు.

ఈ మేరకు శుక్రవారం నాడు తన నివాసంలో కల్వకుంట్ల కవిత తెలంగాణ జాగృతి నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కులగణన, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపుపై కొన్ని నెలల క్రితం జాగృతి అధ్వర్యంలో అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించిన సంగతి విదితమే. ఆ సమావేశాల్లో తెలంగాణ జాగృతి నాయకులు, బీసీ సంఘాల నేతలు, మేధావులు, జర్నలిస్టులు, ఇతర ప్రముఖులు పాల్గొని తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. వాటిని క్రోడీకరించి తెలంగాణ జాగృతి నివేదికను రూపొందించింది.

జిల్లాల వారీగా పూర్తి వివరాలు, బీసీల లెక్కలతో తెలంగాణ జాగృతి సమగ్ర నివేదికను రూపొందించింది. తెలంగాణ సామాజిక స్వరూపాన్ని ఆవిష్కరించే విధంగా పకడ్బందీగా నివేదికను తయారు చేశారు. నివేదిక రూపకల్పనతో బీసీ నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, ఇతర నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శ్రీకృష్ణ కమిటీకి కూడా ఇదే తరహాలో నివేదిక సమర్పించడం గమనార్హం.

ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో సరైన ప్రాధాన్యత దక్కడం లేదని తెలిపారు. సమాజంలో అంతరాలను రూపుమాపడానికి, బలహీనవర్గాలను మరింత పైకి తీసుకురావడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బీసీలకు రాజకీయ రంగంలో రిజర్వేషన్లు పెంచాల్సిందేనని తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల సర్వేను నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా చేసి రిజర్వేషన్లు పెంచి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

మరోవైపు, గత 17 సంవత్సరాలుగా అనేక అంశాల్లో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో క్రియాశీకలంగా వ్యవహరించింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం కల్వకుంట్ల కవిత గారి నాయకత్వంలో తెలంగాణ జాగృతి అవిశ్రాంతంగా పోరాటం చేసింది.

# ములుగు జిల్లాలో మావోయిస్టుల దుశ్చర్య

## పంచాయతీ కార్యదర్శి సహా మరొకరి హత్య

**విశ్వంభర, వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని గొడ్డలితో నరికి చంపారు. వాజేడులో పెనుగోలు కాలనీలో పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయికా రమేశ్, స్థానికుడు ఉయికా అర్జున్‌ను గురువారం అర్ధరాత్రి హతమార్చారు. వెంకటాపురంవాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట మావోయిస్టులు రెండు లేఖలను మృతదేహాల వద్ద వదిలి వెళ్లారు. రమేశ్‌ను గొడ్డలితో నరికిన సమయంలో ఆయన భార్య గట్టిగా కేకలు వేయడంతో మావోయిస్టులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను ఏటూరు నాగారం ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు.తమ కదలికలపై పోలీసులకు సమాచారమివ్వడం మానుకోవాలని పలుమార్లు చెప్పినా వినకపోవడంతో ఈ ఘటనకు పాల్పడినట్లు వాజేడు, వెంకటాపురం వాజేడు కమిటీ కార్యదర్శిశాంత పేరిట ఘటనాస్థలిలో వదిలి వెళ్లిన లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు. కాగా తమ ఉనికిని చాటుకోవడం కోసమే నక్సల్స్ ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారని జిల్లా ఎస్పీ శబరీష్ వెల్లడించారు. సాయుధులైన ఆరుగురు మావోయిస్టులు రెండు గ్రూపులుగా విడిపోయి ఇద్దరిని నరికి చంపినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరినీ దారుణంగా చంపడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక గిరిపుత్రులు ఆందోళన చెందుతున్నారు.

# దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్..



**సుక్మా:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మళ్లీ తుపాకుల మోతతో దద్దరిల్లింది. సుక్మా జిల్లాలో మావోయిస్టులు, భద్రతా సిబ్బంది మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 10 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు.ఒడిశా సరిహద్దులు దాటి ఛత్తీస్‌గఢ్ లోకి మావోయిస్టులు ప్రవేశించినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో దక్షిణ సుక్మా ప్రాంతంలో డీఆర్‌జీ బృందం శుక్రవారం తెల్లవారుజామున గాలింపు చేపట్టింది. దండకారణ్యంలో మావోయిస్టులు ఉన్న నక్కిన ప్రాంతాన్ని గుర్తించి చుట్టుముట్టింది. భద్రతా బలగాలను చూసి నక్సల్స్ వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఇప్పటివరకు 10 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనాస్థలంలో మూడు ఆటోమేటిక్ రైఫిల్స్ సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో మావోయిస్టుల అగ్రనాయకులు ఉన్నట్లు తెలుస్తోంది.






# సీఎం సోదరుల అరాచకాలతోనే మనస్తాపం

- మాజీ సర్పంచి సాయిరెడ్డిది ఆత్మహత్య కాదు.. హత్యే
- సూసైడ్ నోట్ ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేయాలి
- బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుల అరాచకాలు తట్టుకోలేక సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాముకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది ఆత్మహత్య కానే కాదు.. సీఎం సోదరులు చేసిన హత్య అన్నారు. నెలల క్రితం ఒక యూట్యూబ్ ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చారనే కక్షతో.. 40 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇంటి ముందు పశువుల దవాఖానాను కట్టడమే కాకుండా.. సీఎం ఆదేశాలతో ఇంటికి దారి కూడా లేకుండా అడ్డంగా గోడ కట్టేందుకు పూనుకోవడంతోనే తీవ్ర మనస్థాపానికి గురై సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. పోలీసులు సూసైడ్ నోట్ ఆధారంగా అనుముల బ్రదర్స్ పై కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండుసార్లు కొండారెడ్డిపల్లికి సర్పంచ్‌గా ఎన్నో సేవలందించిన వ్యక్తిని గౌరవించాల్సింది పోయి, 85 ఏళ్ల వయస్సున్న పెద్దాయన అని కూడా చూడకుండా గత కొన్ని నెలలుగా వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేకే చివరికి పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ లో చాలా స్పష్టంగా ముఖ్యమంత్రి బ్రదర్స్ తనపై కక్ష కట్టడం వల్లే చనిపోతున్నానని సాయిరెడ్డి స్పష్టంచేసిన నేపథ్యంలో.. దీనికి సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలి. పోలీసులు సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజన ఆడబిడ్డలపై దమనకాండను దేశం మరిచిపోకముందే.. సీఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చూస్తుంటే.. రాష్ట్రంలో సీఎం, ఆయన సోదరుల ఆరచకాలకు అంతేలేకుండా పోయిందని స్పష్టమవుతోంది. ఇది ప్రజాపాలన కాదు.. అరాచక పాలన, నియంత పాలన, దుర్మార్గపు పాలన అని కేటీఆర్ మండిపడ్డారు.

# అదానీతో రేవంత్ లోపాయికారి ఒప్పందం

* కాంగ్రెస్‌ది ఢిల్లీలో ఓమాట..గల్లీలో ఓ మాట
* మాజీ మంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర, ఖమ్మం :** అదానీపై కాంగ్రెస్ పార్టీది ఢిల్లీలో ఓమాట.. గల్లీలో మరో మాట అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. "రాహుల్ గాంధీ ఏమో అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాడు. అదానీ నుండి రూ. 100కోట్ల చెక్కు తీసుకున్న రేవంత్ రెడ్డిని ఏం చేయాలో రాహుల్ గాంధీ చెప్పాలి. అంతర్గత ఒప్పందాలతో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తోంది. కేసీఆర్ ఉన్నప్పుడు అదానీ తెలంగాణకు రాగలిగాడా? ఒక రూపాయి అయినా తెలంగాణలో పెట్టుబడి పెట్టగలిగాడా? అవినీతి ఆరోపణలతో అమెరికాలో అదానీని అరెస్టు చేయాలని చూస్తున్నారు. అలాంటి అదానీతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నది రేవంత్ రెడ్డే" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రం ఉందని చెప్పిన తలకాయ లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడడం.. అబద్దాలు చెప్పడం ముఖ్యమంత్రికి అలవాటు అయిపోయిందని ఆయన మండిపడ్డారు.

"గ్యారెంటీలు అమలు చేయనందుకు ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. కరోనా కష్టకాలంలో కూడా మంత్రుల ఎమ్మెల్యేల జీతాలు బందు పెట్టి రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. రూ. 15000 రైతుబంధు ఇస్తామని చెప్పి ఉన్న రూ. 10000 కూడా ఎగ్గొట్టిండు రేవంత్ రెడ్డి. ఇది ఏంటి అని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం.

ప్రతిపక్షాల గొంతు నొక్కడం వంటివి చేస్తున్నాడు. ఇగురం లేనోడు వ్యవసాయం చేస్తే వడ్లు వాగులో గడ్డి గాళ్ళలో కొట్టుకుపోయింది అంట. ఈ రేవంత్ రెడ్డి పాలన ఇట్లనే ఉన్నది. అందుకే నువ్వు ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి "అని హరీశ్‌రావు విమర్శించారు.

# ముప్పు ముంచుకొస్తోంది..

* ఉత్తర భారదేశంలో ఆందోళన కలిగిస్తోన్న వాయుకాలుష్యం
* విమర్శలకు ఇది సమయం కాదు
* పరిష్కార మార్గాలను కనుగొనాలి
* లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ



**ఢిల్లీ:** ఉత్తర భారతదేశంలో ఆందోళన కలిగిస్తోన్న వాయుకాలుష్యం.. జాతీయ అత్యవసర పరిస్థితేనని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై కూలంకషంగా చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనాలని సహచర ఎంపీలకు పిలుపునిచ్చారు. వాయు కాలుష్యం రూపంలో ముప్పు ముంచుకొస్తోందని, దానిని ఎదుర్కొనేందుకు సమష్టిగా స్పందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు ఇండియా గేట్ వద్ద పర్యావరణవేత్త ఝూతో కలిసి మాట్లాడిన వీడియోను రాహుల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.''వాయు కాలుష్యానికి సామాన్య ప్రజలే ఎక్కువగా ప్రభావితులవుతున్నారు. చాలా మంది చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఉత్తరభారతంలో నెలకొన్న తాజా పరిస్థితుల వల్ల పర్యాటకం బాగా పడిపోయింది. విషపూరితంగా మారుతున్న వాతావరణాన్ని శుభ్రం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని రాహుల్ పేర్కొన్నారు. కాలుష్య మేఘాలు వందలాది కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్నాయన్న రాహుల్.. వాటిని తొలగించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం ప్రభుత్వంతోపాటు పలు సంస్థలు, ప్రజలు, నిపుణులు అందరూ కలిసి ముందడుగు వేయాలన్నారు. రాజకీయ విమర్శలు చేసుకునేందుకు ఇది తగిన సమయం కాదన్న ఆయన.. అందరూ కలిసి పరిష్కార మార్గాలను కనుక్కోవాలని సూచించారు. దీని కోసం పార్లమెంట్ సమావేశాలను వేదికగా మలచుకోవాలన్నారు. శీతాకాల సమావేశాలు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 వరకు జరగనున్న సంగతి తెలిసిందే.

# ఇంటర్ స్టేట్ కౌన్సిల్ శాశ్వత ఆహ్వానితుడిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




## ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఛైర్మన్‌గా ఇంటర్ స్టేట్ కౌన్సిల్ ఏర్పాటైంది. స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా కేంద్ర మంత్రి అమిత్ షా, శాశ్వత ఆహ్వానితుడిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నియమితులయ్యారు. భారతదేశ సమాఖ్య నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో, కేంద్ర.. రాష్ట్రాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడంలో ఇంటర్ స్టేట్ కౌన్సిల్ కీలకపాత్ర పోషించనుంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ కమిటీలో శాశ్వత ఆహ్వానితుడిగా నియమించడం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణలో 13 కొత్త నర్సింగ్ కాలేజీలకు పరిపాలన అనుమతులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 13 కొత్త నర్సింగ్ కాలేజీలకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రూ.338 కోట్లతో కాలేజీలు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో నర్సింగ్ కాలేజీలో 60 సీట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.



# తెలంగాణ సాహితీ శిఖరం సురవరం

**రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెలంగాణను మేల్కొల్పిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణలోనే కాదు తెలుగులోనే ఒక ధృవతార సురవరం. తేజోమూర్తులలో ముందు వరుసలో ఉంటారు. ఆయన జీవిత చరిత్ర అంటే తెలంగాణ చరిత్ర. అపూర్వ పాండిత్యం సురవరం సొంతం. తక్కువ కాలం జీవించినా అనేక చరితలను రాసి చూపించిన ప్రతిభామూర్తి. తెలంగాణ ఆధునికత వైపు పయనించటానికి పలు సంస్థలను స్థాపించి, విద్య, సామాజిక రంగాల్లో విశేష సేవలందించిన సురవరం సేవానిరతి వేనోళ్ల పొగడదగినది.తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి కృషి చేసిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి. సురవరం అంటేనే ఒక వెలుగు. ఆయన తెలంగాణకు ఒక వరం. చరిత్ర ఉన్నంతకాలం వీరి పేరు ప్రతి ఒక్కరి మదిలో మార్మోగుతూనే ఉంటుంది. తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యానికి మారు పేరైన సురవరం ప్రతాపరెడ్డి గురించి విశ్వంభర ప్రత్యేక కథనం..**

తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యమంటే వెంటనే గుర్తుకువచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి. సాహితీవేత్తగా, పత్రికా సంపాదకుడిగా, సామాజిక పరిశోధకుడిగా, పండితుడిగా, రచయితగా, ప్రేరకుడిగా, క్రియాశీల ఉద్యమకారుడిగా సారస్వత పరిషత్ అధ్యక్షులుగా, గ్రంథాలయోద్యమకారులుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనది.

సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న మహబూబ్ నగర్ జిల్లాలోని ఇటిక్యాలపాడులో రంగమ్మ, నారాయణరెడ్డి దంపతులకు జన్మించాడు. ప్రతాపరెడ్డి తండ్రి చిన్నతనంలోనే మరణించారు. ఆయన చిన్నాన్న రామకృష్ణారెడ్డి వద్ద పెరిగి మిషనరీ పాఠశాలలో ప్రాథమిక విద్యను హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంటర్మీడియట్, మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో బీఏ చదివాడు. తిరువాన్‌కూరులో బి.ఎల్ చదివాడు. కొంతకాలం పాటు న్యాయవాద వృత్తి నిర్వహించాడు. అనేక భాషలు అభ్యసించాడు.1916లో వివాహం చేసుకున్నాడు. సంతానం పదిమంది కాగా, ఇద్దరు కుమారులు విగతజీవులు. నలుగురు కుమారులు, నలుగురు పుత్రికల సంతానం. సురవరం ప్రతాపరెడ్డి తన చదువు పూర్తికాగానే హైదరాబాద్ కొత్వాల్‌గా ఉన్న రాజబహదూర్ వేంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలోని రెడ్డి హాస్టల్‌కు అతను కోరికపై వచ్చాడు. ఇక్కడ అతను పనిచేసిన దశాబ్ది కాలంలో రెడ్డి హాస్టల్ నిర్వహణను ఒక విద్యాలయంగా తీర్చిదిద్దాడు. ఆ విధంగా హైదరాబాద్‌లో సాంఘిక సేవాజీవితం పునాదులు వేసింది. మద్రాస్ కళాశాలలో చదువుతున్నప్పుడే నాటి జాతీయ ఉద్యమ ప్రభావం ఆయనపై పడింది.

**తెలంగాణ సమాజం కోసం శ్రమించినవారిలో సురవరం చిరస్మరణీయులు..**

తెలుగు భాష సంస్కృతి, సంప్రదాయాలు హిందూ పండుగలు కోసం తెలంగాణ సమాజం కోసం శ్రమించిన వారిలో చిరస్మరణీయులు సురవరం ప్రతాపరెడ్డి. నిజాం పాలనలో నలిగిపోతున్న భాషా సంస్కృతులకు దిశా నిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి. నిద్రాణమైన తెలంగాణ సమాజాన్ని తన కలంతో మేల్కొల్పి జాగరూకం చేసిన తెలంగాణ వైతాళికులు సురవరం. తన కలంతో నిజాం రాజు పైన నిప్పుల వర్షం కురిపించాడు. జోగిపేటలో జరిగిన ప్రథమ ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా చేసిన ప్రసంగం మరపురానటువంటిది.

**గోల్కొండ పత్రిక ఓ మైలురాయి.**

సురవరంమంచి పండితుడు. 1926లో ఆయన నెలకొల్పిన 'గోలకొండ పత్రిక' తెలంగాణ సాంస్కృతిక గమనంలో మైలురాయి. పాతికేళ్ళ వయసులో గోల్కొండ పత్రిక సంపాదకుడుగా ఎన్నో కథలు వ్యాసాలు, సమీక్షలు, వ్యాసాలు, కవితలు, కథలు, మొదలగునవి ప్రచురించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల బాధలను, గోసను చెప్పడానికి గోల్కొండ పత్రికను ఆయుధంగా మలిచి, కృత కృత్యుడయ్యాడనటంలో సందేహం లేదు. గోలకొండ పత్రిక సంపాదకీయాలు నిజాం ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించాయి. నిజాం ఆగ్రహించి సంపాదకీయాలు సమాచార శాఖ అనుమతితోనే ప్రచురించాలని నిబంధన పెట్టాడు. దాన్ని తిప్పికొడుతూ ప్రతాపరెడ్డి ప్రపంచ మేధావుల సూక్తులను సేకరించి సంపాదకీయానికి బదులుగా ప్రచురించాడు. తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి. పత్రికా సంపాదకుడుగా, పరిశోధకుడుగా, పండితుడుగా, రచయితగా, ప్రేరకుడుగా, క్రియాశీల ఉద్యమకారుడుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. స్థానిక చరిత్రల గురించి, స్థానిక ప్రజల కడగండ్ల గురించి అతను పడిన నిరంతర తపనకు ప్రతి అక్షరం ప్రత్యక్ష సాక్ష్యం

**ప్రజలను చైతన్యం చేస్తూ..**

తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి ఒక అధ్యాయం. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి సంపాదకుడిగా, పత్రికా రచయితగా ప్రసిద్ధి చెందాడు. నైజాం నిరంకుశ పాలనలో, తెలుగు వారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషిచేశాడు.

**సురవరం రచనలు**

సురవరం ప్రతాపరెడ్డి రచనలు అన్నీ విశిష్టమైనవే. సుమారు 40 వరకు వీరి రచనలు ఉన్నట్లు తెలుస్తుంది. ఒక్కో రచనకు ఒక్కో ప్రత్యేకత ఉంది. వీరి రచనల్లో ఇతిహాస పురాణాలకు సంబంధించినవి, మన ధర్మానికి సంబంధించినవి, సమకాలీన సామాజిక స్థితిగతులకు అద్దం పట్టేవి ఉన్నాయి. పద్యం, కవిత్వం, కథలు, నాటకాలు, వ్యాసాలు ఆయా ప్రక్రియల్లో ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. ఆయన రచనల్లో ముఖ్యమైన వాటిలో ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషాలు, సురవరం కథలు, మొగలాయి కథలు, హైందవ ధర్మవీరులు, సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు, సురవరం కవిత్వం, ఉచ్ఛల విషాదము (నాటకం), శుద్ధాంతకాంత (నవల, అముద్రితం), భక్త తుకారాం (నాటకం), గోలకొండ కవుల సంచిక (సంపాదకత్వం), ప్రజాధికారములు, యువజన విజ్ఞానం.

**గోలకొండ కవుల సంచిక**


తెలంగాణ ప్రాంతంలో కవులు పూజ్యమన్న ఒక పండితుని వాక్యాలకు చాలా బాధపడి సురవరం వారు ఇక్కడి ప్రాంత అస్తిత్వాన్ని సాహిత్యలోకంలో నిరూపించే క్రమంలో చేసిన సాహసోపేతమైన కార్యానికి ప్రతిరూపమే గోలకొండ కవుల సంచిక. ఈ సంచిక ద్వారా తెలంగాణ ప్రాంతంలో వెలుగుచూడని ప్రతిభామూర్తులను, భిన్న కోణాల్లో వారి ఆలోచనలను వెలుగులోకి తెచ్చారు. 354 మంది రచనలు 11 శాఖలుగా విభజించుకుని మొత్తం 1418 పద్యాలను ఇందులో ముద్రించారు. ఇంకా చాలామంది కవుల పద్యాలు, కవితలు ఇందులో గడువు లోపల రాలేనందున ప్రచురించలేకపోయారు.. తెలంగాణలో కవులే లేరనే నిందావ్యాఖ్యలను సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన 'గోల్కొండ కవుల సంచిక' గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి.

**1952లో శాసనసభకు..**

సురవరానికి రాజకీయాల పట్ల ఆసక్తి లేకపోయినా సన్నిహితుల ప్రోద్బలంతో 1952లో హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు జరిగిన తొలి ఎన్నికల్లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ప్రముఖ న్యాయవాది వీ రామచంద్రారెడ్డిపై పోటీచేసిన ఆయన విజయం సాధించి శాసనసభకు ఎన్నికయ్యారు. సురవరం మొదటినుంచి గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండేవారు. దానితో అదే జిల్లాకు చెందిన బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ సురవరానికి మంత్రిపదవి లభించలేదు. తాను చెప్పాలనుకున్నది ఏదైనా నిర్మొహమాటంగా ఎదురుగానే కుండబద్దలు కొట్టినట్లు చెప్పగల ధైర్యం ఆయన సొంతం.

**కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన తొలి తెలుగు రచయిత...**

ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకుగాను సురవరానికి 1955లోనే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన తొలి తెలుగు రచయితగా ఇది విశేషకీర్తిని ఆర్జించింది. నైజాం నిరంకుశ పాలనలో, తెలుగువారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషిచేశాడు.



**గ్రంథాలయోద్యమంలో కీలక పాత్ర**

**రెడ్డి హాస్టల్ కార్యదర్శిగా వచ్చాక, వేయి గ్రంథాలున్న హాస్టల్ లైబ్రరీని 11వేల గ్రంథాల వరకు పెంచి విద్యార్థులలో భాషాభివృద్ధికి కృషి చేశాడు. అనేక భాషలు అభ్యసించిండు. మంచి పండితుడు. 1926లో అతను నెలకొల్పిన గోలకొండ పత్రిక తెలంగాణ సాంస్కృతిక గమనంలో మైలురాయి. గోలకొండ పత్రిక సంపాదకీయాలు నిజాం ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించినాయి. నిజాం ఆగ్రహించి సంపాదకీయాలు సమాచార శాఖ అనుమతితోనే ప్రచురించాలని నిబంధన పెట్టిండు. దాన్ని తిప్పికొడుతూ ప్రతాప రెడ్డి ప్రపంచ మేధావుల సూక్తులను సేకరించి సంపాదకీయానికి బదులుగా ప్రచురించిండు. అది మరింత సమస్యగా ఆనాటి ప్రభుత్వం భావించింది.1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన మొట్టమొదటి ఆం ధ్ర మహాసభ'కు అధ్యక్షత వహించారు. ఆంధ్ర మహాసభ కార్యాకలాపాలన్నీ తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు. గ్రంథాలయోద్యమంలో ప్రతాపరెడ్డి కీలక పాత్ర వహించాడు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించాడు.1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు ఆయనే అధ్యక్షుడు. 1951లో ప్రజావాణి అనే పత్రికను ప్రారంభించాడు.**

**తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషి..**

నైజాం నిరంకుశ పాలనలో.. తెలుగువారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి ఎనలేని కృషి చేశాడు. న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించి, రచయితగా, కార్యకర్తగా, సంపాదకుడుగా జీవితం సాగించి తెలంగాణ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నాడు. సురవరం ఆగస్టు25, 1953లో మరణించాడు. తెలుగుజాతికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం కూడా స్థానం పొందింది.

# బహుభాషావేత్త, రచయిత, ధర్మశాస్త్ర పండితుడు గుండేరావు హర్కారే

బహుభాషలలోను, బహుశాస్త్రాలలోను ఉత్తమశ్రేణికి చెందిన పండితుడు గుండేరావు హర్కారే. ఎంత పాండిత్యముంటే, అంత ఒదిగి ఉండాలని నిరూపించిన శాంతమూర్తి ఆయన. త్రికరణ శుద్ధికి మారుపేరుగా నిలిచిన హర్కారే జీవితంలో అంచెలంచెలుగా ఎదుగుతూ త్రివిక్రమణ్ణి తలపించాడు.గుండేరావు న్యాయశాస్త్రంలో ఎంత దిట్టనో, వ్యాకరణ శాస్త్రంలోను అంతే దిట్ట. పాణిని రచించిన అష్టాధ్యాయికి, ఆధునిక విజ్ఞానాన్ని అనుసరించి, విద్యార్థుల సౌకర్యార్థం'Sanskrit Grammar Made Easy' పేరుతో ఒక యంత్రాన్ని తయారు చేశాడు. ఇది ఆయనకు గొప్ప కీర్తిని తెచ్చిపెట్టింది.

తెలుగుతో పాటు దేశవిదేశ భాషలలో సంపాదించిన పాండిత్యం ఒక ఎత్తైతే, సంస్కృతంలో గుండేరావు సంపాదించిన పాండిత్యం ఒక ఎత్తు. ద్వాదశ భాషా పండితుడు. ఆయన నా దృష్టిలో ఒక భాషా పండితుడే కాదు, ఒక విజ్ఞాన సర్వస్వం.

గుండేరావు సీతాబాయి. రామారావులకు 1887 మార్చి 13వ తేదీన హైదరాబాదు నగరంలో జన్మించాడు. వీరి ఇంటి పేరు హర్కారే. బహుశా ఇది వీరి వంశీయుల పనితనాన్ని బట్టి వచ్చిన బిరుదనామం. గుండేరావు పూర్వీకులది మహారాష్ట్ర. వివిధ జిల్లాల నుండి, పరగణాల నుండి ప్రభుత్వానికి అధికారికంగా వార్తలను చేరవేసే నమ్మకమైన దూతలకే హర్కారులని పేరు. బహుశా ఈ పేరుగల వారు దేశంలో ఎక్కడున్నా వారు ప్రభుత్వానికి నమ్మకంగా పనిజేస్తూ పేరు తెచ్చుకున్నవారే.గుండేవారు హర్కారే జీవిత చరిత్రను అధ్యయనం చేస్తే ఈ విషయం స్పష్టంగా మన కర్థమవుతుంది. హర్కారే పండితుడు. దేశకాల పరిస్థితులననుసరించి బాల్యంలో నిజాం రాష్ట్రవాసి కావడం వల్ల పర్షియన్, అరబిక్ భాషలు నేర్చుకోవలసి వచ్చింది. ఆ తర్వాతనే తెలుగు, మరాఠీ భాషలు నేర్చుకొన్నాడు. ఈ రెండు భాషలను ప్రైవేట్‌గా నేర్చుకోవలసి వచ్చింది. ఇక్కడ గమనించివలసిన అంశాలు మూడున్నాయి. వారు నేర్చుకున్న భాషలలో ఒకటి మాతృభాష, రెండు స్థానిక భాష, మూడు రాజభాష ఉండడం విశేషం. ఆ తర్వాత హర్కారే ఆంగ్లపాఠశాలలో తన 12వ ఏట చేరి, 1906 ప్రాంతంలో మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరయ్యాడు. ఆ తర్వాత కుటుంబపరిస్థితుల కారణంగా చదువుకు దూరమయ్యాడు. ఉద్యోగానికి చేరువయ్యాడు. 1908లో నగరంలోని న్యాయస్థానంలో గుమస్తాగా ప్రవేశించాడు.

అనువాదకులకు వివిధ భాషలలో పరిచయం ఉండడమేగాక, అనువాద కౌశల్యం కూడా ఉండాలి. హర్కారే ఒక గుమస్తాగా ఉండి, శ్రద్ధాభక్తులతో భాషారాధ్య చేసినాడు. అందుకే న్యాయస్థానం ఆయనకు 1908లో ఒకేసారి పదోన్నతిని పెంచి, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టుకి బదిలీ చేశారు. అక్కడ హర్కారే మంచి అనువాదకుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత ఆయన పనితనాన్ని గుర్తించి నిజాం ప్రభుత్వం ఆయనను 1914లో ఉన్నత న్యాయస్థానానికి (Highcourt) బదిలీ చేసింది. అప్పుడు హర్కారే ప్రధాన న్యాయమూర్తికి అంతరంగిక కార్యదర్శిగా నియుక్తుడయ్యాడు.

భాషా పండితునిగా, సాహితీవేత్తగా ఒకవైపు గుర్తింపు తెచ్చుకున్న హర్కారే – హైకోర్టులో తన సేవలకుగాను గద్వాల సంస్థానంలో 1919లో మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా నియమింపబడినాడు. 1948 దాకా ఆయన అక్కడ పనిచేశాడు. సుమారు అక్కడి 30 ఏండ్ల ఉద్యోగకాలంలో ఆయన జిల్లా న్యాయాధీశుడుగా, కలెక్టర్‌గా, సెషన్స్ జడ్జిగా ఉన్నత పదవులను అధిరోహించాడు.

గద్వాలలో ఉన్న రోజుల్లో గుండేరావు న్యాయాధీశుడుగానే కాక గొప్ప పండితునిగా వెలుగొందాడు. గద్వాల సంస్థానాధీశురాలైన రాణి మహలక్ష్మమ్మ ఆదరాభిమానాలు చూరగొన్న హర్కారే తరుచుగా ఆస్థానానికి వెళ్లేవాడు. ఆస్థానానికి వచ్చే పండితుల ప్రేమకు, గౌరవానికి గుండేరావు ఆలవాలమయ్యాడు. ఆస్థానంలో జరిగే సాహితీచర్చలకు, అవధానాలకు సాక్షిగా నిలబడ్డాడు. గద్వాల సంస్థానానికి కొప్పెరపు కవులు



వచ్చిన సందర్భంలో హర్కారే రాణిగారి ఆస్థానంలో ఉండడం విశేషం.గుండేరావు తర్కన్యాయ వేదాంత శాస్త్రాలతోనేగాక గణితశాస్త్రంలోను నేర్పరి అనటానికి ఈ సందర్భంగా ఒక సంఘటనను వివరించక తప్పదు (స్వయంగా హర్కారే నాకు చెప్పిన విషయాన్ని ఇక్కడ పొందు పరుస్తున్నాను).

గద్వాల సంస్థానానికి, నిజాం సర్కారుకి పన్నుల బాకీ విషయంలోపేచీ ఏర్పడింది. ముప్పైవేల రూపాయల పన్ను కట్టాలని మంత్రిగా ఉన్న సాలార్‌జంగ్ సంస్థానానికి తాఖీదు పంపించాడు. ఈ సంగతి ఎట్లాగో గుండేరావు హర్కారే దృష్టికి వచ్చింది. ఆయన లెక్కలన్నీ తీసి, అదివరకు కట్టినవి తీసేసి – చివరికి మూడువందలు మాత్రమే కట్టవలసి ఉన్నాయని తేల్చి చెప్పినాడట. ఈ విషయం తెలుసుకున్న సాలార్‌జంగ్ గుండేరావును గౌరవంగా హైదరాబాదులో జరిగిన ఒక విందు కార్యక్రమానికి ఆహ్వానించాడట.అక్కడ స్వయంగా సాలార్‌జంగ్ గుండేరావును అభినందిస్తూ – యధాలాపంగా ''నీలాంటి పండితుడు మా మతంలో చేరితే మా మతానికెంతో వన్నె కల్గుతుది'' అని ప్రలోభపెట్టాడట. వెంటనే హర్కారే వినయంగా ''ఇంకో మతం నుంచి మీ మతంలోనికి వచ్చేవాళ్ల వల్లనే మీ మతం వన్నెకెక్కడం నాకు తృప్తి కల్గించడం లేదు'' అని సున్నితంగా సమాధానమిచ్చాడట.

గుండేరావు ధైర్యశాలి అంటానికి ఒక సంఘటనను తప్పక వివరించాలి. భారత ప్రభుత్వం టంగుటూరి ప్రకాశం పంతులు గారిని బంధించడానికి సన్నాహాలు చేసింది. పోలీసుల కన్నుగప్పి ప్రకాశంగారు ఒక నాల్గురోజుల కోసం గద్వాల సంస్థానానికి వచ్చాడు. మూరువేషంలో ఉన్న ప్రకాశంగారికి గుండేరావు తన ఇంట్లో నాల్గురోజులు ఆతిథ్యమిచ్చి, ఆ నాల్గురోజుల్లో ఆయన కూర్చొనగల్గినరీతిలో ఒక బలమైన వెదురుబుట్ట తయారుచేయించి – తద్వారా కండపుష్టిగల సేవలకుతో మోయించి, ప్రకాశం గారిని రహస్యస్థావరానికి చేర్చినాడట. ఈసంఘటనను హర్కారే గారు నాకు వివరించినప్పుడే కాదు, దీన్ని రాస్తున్నప్పుడు కూడా నా ఒళ్లు జలదరించింది.గుండేరావు బలమైన వ్యక్తి. ఆయన ఆకారం ఒక కొండను తలపిస్తుంది. లేదా ఏనుగును తలపిస్తుంది లేదా గుమ్మడికాయను గుర్తుకు తెస్తుంది. అరబ్బులతో ముష్టి యుద్ధం చేసిన సాహసి. ఉదయం, సాయంత్రం ధ్యానానికి ప్రాధాన్యం ఇచ్చినట్లే వ్యాయామానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినాడు. ముష్టిఘాతాలతో ఆయన శరీరం గట్టిపడింది.

హర్కారే గద్వాలలో ఉన్నప్పుడు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే అధ్యయనశీలియై అనేకానేక పరీక్షలు రాసి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. తీరిక దొరికితేచాలు ఏ కావ్యాన్నో లేదా ఏ శాస్త్రాన్నో చదవాలన్న కోరిక ఆయనది. మద్రాసు విశ్వవిద్యాలయం నిర్వహించిన న్యాయశిరోమణి, సాహిత్యశిరోమణి పరీక్షలలోను, ధర్మశాస్త్రంలోను, తులనాత్మక సాహిత్యంలోను నిర్వహించిన పి.ఓ.ఎల్. పరీక్షలందును హర్కారే తన ప్రతిభను చూపించి విజయాన్ని సాధించాడు. న్యాయశాస్త్రంలో నిష్ణాతుడైన గుండేరావుకు న్యాయశాస్త్రానికి కేంద్రమైన 'నవద్వీప్'లోని పండితపరిషత్తు 'వాచస్పతి' పట్టాన్ని ఇచ్చి గౌరవించింది. అయోధ్య, బెల్గాం పట్టణాల్లోని ప్రతిష్ఠాత్మకమైన పండితసభ గుండేరావుకు 'విద్యాభూషణ' బిరుదం ఇచ్చి గౌరవించింది.

గుండేరావు కేవలం పండితుడేకాడు. గొప్ప రచయిత కూడా. ఆయన రచనలు వెలుగులోకి వస్తే మరాఠీ, తెలుగు, సంస్కృతం, ఆంగ్లభాషలలో ఆయన చేసిన కృషి ప్రపంచానికి తెలుస్తుంది. కాని చాలమటుకు అవి మరుగునపడి ఉన్నాయి. ఐతే ఆయన చేసిన అనువాదాలు సంస్కృత పండితులనే ఆశ్చర్యపరచినవి. ఒక తెలుగువాడు ఆంగ్లం నుండో హిందీ నుండో, సంస్కృతం నుండో తెలుగులోకి అనువదిస్తే ఎంతో గొప్ప. కాని గుండేరావు అద్భుతమైన అనువాద కౌశల్యానికి ఆయన సంస్కృతానువాదాలే గట్టి నిదర్శనం. సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి పింగళిసూరని కళాపూర్ణోదయాన్ని సంస్కృతంలో అనువదించగా, గుండేరావుగారు 'ప్రభావతీ ప్రద్యుమ్నం'ను సంస్కృతంలోకి అనువదించాడు. ఇదొక అద్భుతమైన రచన. గుండేరావుగారి ఈ అనువాదం వారి చివరిదశలో జరిగింది. ఆ సమయంలోనే నేను వారికి అంతేవాసిని కావడం నా అదృష్టం.

గుండేరావు సంస్కృత అనువాద రచనలు మహత్తరమైనవి. ఆయనకు ఆంగ్లం మంచినీళ్లప్రాయమైంది. తెలుగుభాష – క్షీరసదృశం కాగా సంస్కృతం అమృతాయమానమైంది. ఆంగ్ల రచనలను సంస్కృతంలోకి అనువదించడమంటే ఆయనకు చాలా సరదా! ఎంతో గొప్ప పండితుడైనప్పటికీ సారళ్యానికి, శిల్పానికి ప్రాధాన్యం ఇచ్చిన మహానుభావు డాయన! థామస్‌గ్రే రచించిన 'ఎలిజీ' గోల్డ్‌స్మిత్ 'ట్రావెలర్' 'డిజర్టెడ్ విలేజ్ వర్డ్స్‌వర్త్ రచించిన 'ఇంటిమేషన్ టు ఇమ్మోర్టాలిటీ' షేక్స్పియర్ నాటకాలైన 'హేమ్‌లెట్', 'ది మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్' మొదలైన వాటికి గుండేరావు చేసిన సంస్కృతకొవ్యాను వాదాలు విశిష్టమైనవి. ఆ మహాపండితుడు ఫారసీలోని 'మన్నవీ షరీఫ్', అరబ్బీలోని 'ఖురానే షరీఫ్' మొదలైన మతగ్రంథాలను సంస్కృతంలోకి తీసికొని వచ్చాడు. ఇంత అనువాదాలు మరెవరూ చేయలేదని చెప్పవచ్చు.గుండేరావు అంటే భాషాకోవిదుడు. ఏ భాషనైనా ఇట్లే నేర్చుకొని, భాషించగల నేర్పరి. అంతేకాదు ఆ భాషలలో పాండిత్యాన్ని సంపాదించి వివిధ భాషల వారికి అనువాదాల ద్వారా ఆదర్శ పండితుడయ్యాడు.

ఇతనికి విద్యాభూషణ్ అనే బిరుదు ఉంది. ఇంగ్లిష్ కవి గోల్డ్‌స్మిత్ రాసిన ట్రావెలర్‌కు సంస్కృత పద్యానువాదం చేశారు. థామస్ గ్రే రాసిన ఎలిజీ, గోల్డ్ స్మిత్ రాసిన The Deserted Village, వర్డ్స్ వర్త్ రాసిన ఇంటిమేషన్స్ ఆఫ్ ఇమ్మోర్టాలిటీ, పార్సీ భాషలో మన్నవీ షరీఫ్, బాబా బెహర్ కావ్యం, అరబ్బీలోని ఖురానే షరీఫ్, షేక్‌స్పియర్ నాటకాలు హేమ్లెట్, ది మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్ తెలుగులో ప్రభావతి ప్రద్యుమ్నం మొదలైన గ్రంథాలను సంస్కృత పద్యానువాదం చేశారు.-యాజ్ఞవల్క్య స్మృతి మితాక్షరను ఖురానే మితాక్షర పేరిట అనువదించారు. యాస్కుని నిరుక్తమును కొంతవరకు తెనిగించారు. మరాఠీ సాహిత్య చరిత్రను తెలుగులో అనువదించారు. ఈశ, కౌన, కఠోపనిషత్తులపై కారికలు.. రాశారు. ప్రత్యయకోశము అనే పేరుతో సంస్కృత వ్యాకరణ గ్రంథం రాశారు.

-పాణిని సంస్కృత వ్యాకరణశాస్త్రం అష్టధ్యాయిని ఆధునిక విజ్ఞాన శాస్త్రాల వంటిదని ఈయన అభిప్రాయం. ఈయన రచనలు భారతి, మధురవాణి, ఎడ్యుకేషనల్ రివ్యూ, సంస్కృతం, ఇస్లామిక్ కల్చర్ మొదలైన పత్రికల్లో అచ్చయ్యాయి. మద్రాస్‌లోని కుప్పుస్వామిశాస్త్రి పరిశోధన సంస్థ, రాష్ట్రప్రభుత్వం, తెలుగు రచయితల సంఘం ఈయనను సన్మానించాయి. రాష్ట్రపతి సర్టిఫికెట్ ఆఫ్ ఆనర్‌ను పొందారు. 92వ ఏట 1979, డిసెంబర్ 3న మరణించారు.

# కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలి

26న జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మాధవి, జిల్లా కార్యదర్శి ఉపేందర్



విశ్వంభర, మహబూబాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జరిగే నిరసనలను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్పొరేట్ శక్తులే ప్రయోజనం పొందుతున్నాయని, కార్మికులకు, రైతులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం పొందడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు కార్మిక కోడ్ ల వల్ల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, ఎనిమిది గంటల పని దినం, ట్రేడ్ యూనియన్ హక్కులు అగమ్య గోచరంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే బీజేపీ పాలిత ప్రాంతాలలో కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను రద్దుచేసి పన్నెండు గంటల పని దినాన్ని అమలులోకి తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు మద్దతు ధర, వ్యవసాయ ఖర్చుకు యాభై శాతం అదనంగా జోడించి అమలు చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కార్మిక, కర్షకులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం ఇరవై ఆరు వేల రూపాయలు, పెన్షన్ పది వేల రూపాయలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటికరణ ఆపాలని, స్కీం వర్కర్ల, వివిధ రంగాల కార్మికుల, రైతుల, శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా జిల్లాలో మండల, గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగే నిరసన ప్రదర్శనలో వివిధ వర్గాల ప్రజానికం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, దుండి వీరన్న, పోతుగంటి మల్లయ్య, ద్వారా స్నేహబిందు, బెస్త సంపూర్ణ, జల్లే జయరాజు, వల్లాల వెంకన్న, దాసరి మల్లేశం, జమ్ముల శ్రీను, కొండా ఉప్పలయ్య, వెలిశాల సుధాకర్, వెన్ను మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు



విశ్వంభర, ఖమ్మం: ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు పోజర్ల ప్రభాకర్ నివాసానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ తాతా మధు తదితర ప్రముఖులు శుక్రవారం మధ్యాహ్నం వెళ్లి తల్లిదండ్రులు పెద్ద వీరభద్రయ్య,ఇంద్రమ్మ,భార్య అనురాధ, కుమారుడు వేదవ్యాస్,శ్రీజలను పరామర్శించి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,కొండబాల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, రాకేష్ రెడ్డి,బచ్చు విజయ్ కుమార్,పగడాల నాగరాజు, గోసుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ శుక్రవారం మరిపెడ మండలం ధర్మారంతండా, పురుషోత్త మాయగూడెం, అబ్బాయిపాలెం,లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. రోజువారి ధాన్యం కొనుగోలు, రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ సూచనల ప్రకారం కేంద్రాలను నిర్వహించాలని, అన్ని వసతులు సౌకర్యాలు కల్పించాలని,మరిపెడ ఎంపీడీవో కార్యాలయం, మోడల్ స్కూల్, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్, చిన్న గూడూరు మండల కేంద్రంలోని సెంట్ ఆగస్టిన్ స్కూల్ లలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రికార్డుల డాటా ఎంట్రీనీ పరిశీలించారు, ఇప్పటికే శిక్షణ పొందిన డాటా ఎంట్రీ ఆపరేటర్స్ ద్వారా ఎంట్రీ జరుగుతుందని, క్షేత్రస్థాయిలో స్వీకరించిన వివరాల నమోదును ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో పురుషోత్తం, మరిపెడ తహసిల్దార్ సైదులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు తదితరులు ఉన్నారు.



భారత రాష్ట్రపతి ద్రవపది ముర్మ్ హైదరాబాద్ పర్యటన ముగించుకొని ఢిల్లీ తిరుగు ప్రయాణం లో చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా బేగంపేట్ ఎయిర్ పోర్ట్ లో వారి వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. (విశ్వంభర, ఎల్బీనగర్)

## మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



విశ్వంభర, రామన్నపేట: ఈ నెల 23న నల్లగొండలో జరగబోయే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయడం కోసం, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరంలో జరిగిన మాదిగల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ మాట్లాడుతూ, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలమైన తీర్పు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం అత్యంత దారుణమని, వర్గీకరణకు అనుకూలంగా కాంగ్రెస్ పార్టీ గతంలో తీర్మానం చేసి మేనిఫెస్టోలో పెట్టిందని, సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా ముందు వర్గీకరణ అమలు చేస్తానని, అవసరమైతే ఆర్డినెన్స్ తెచ్చి మాదిగలకు న్యాయం చేస్తానని చెప్పి, ఇప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తూ, వర్గీకరణకు అడ్డుపడుతున్న మాల సామాజిక వర్గం ప్రతినిధులపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వర్గీకరణ కోసం ఉద్యమకారులు, మాదిగ మేధావులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు, మాదిగలంతా పార్టీలకతీతంగా ఏకమై వర్గీకరణ సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈనెల 23న నల్లగొండ ఎన్జీ కాలేజ్ మైదానంలో జరగబోయే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మాదిగలందరూ భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ, శివగళ్ల ముత్యాలు, పుట్టల ముత్యాలు, నల్ల శంకరయ్య, నల్ల పరుశురాములు, నల్ల నరసింహ, నల్ల శ్రీరాములు, నల్ల మల్లేష్, శివగల కృష్ణ, చిన్న లచ్చి సైదులు, కొంగరి రాజలింగం, నల్ల భాస్కర్, నల్ల ఎల్లేష్, బంగారు గల ధనుష్, నల్ల మల్లేష్, గొల్లపల్లి రాజు, నల్ల లక్ష్మణ్, శివగళ్ళ జ్ఞానేశ్వర్, నల్ల కిరణ్, నల్లమణి తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ సేవలు వెలకట్ట లేనివి - ఆమనగల్లు ఎస్సై వెంకటేష్



విశ్వంభర, ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్సై వెంకటేష్ సందర్శించి ఆయన నియోజకవర్గంలో చేస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. అమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నడుస్తుందని శుక్రవారం 600 మందికి పైగా పరీక్షలు నిర్వహించగా దాదాపు 300 మంది వరకు కంటి అద్దాల పంపిణీ చేశామని, 20 మంది పేషంట్ల కు కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశామని తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,నరేందర్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,చంద్ర శేఖర్,మల్లయ్య, తెలిపారు.

## అపరిచితులతో లైంగిక సంపర్కం ప్రమాదం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్



విశ్వంభర, మహబూబాబాద్: అపరిచితులతో లైంగిక సంపర్కం ప్రమాదమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ అన్నారు. పూర్ణ సురక్ష కేంద్రం ద్వారా హెచ్ఐవీ మరియు సుఖ వ్యాధులకు సంబంధించిన సేవలు అన్ని ఒకేచోట ఉచితంగా లభిస్తాయని అంతేకాకుండా కన్సల్టేషన్ చికిత్స ఇతర సంబంధిత సేవలు కూడా ఉచితంగా అందుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక లయన్స్ క్లబ్ లో జరిగిన అన్ని శాఖల సమన్వయ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ హెచ్ఐవీ లేదా సుఖవ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నవారు లేదా హెచ్ఐవీ నెగటివ్ గా ఉన్నప్పటికీ హెచ్ఐవీ లేదా లైంగిక సుఖ వ్యాధులు దారి తీసే ప్రమాదకర ప్రవర్తన పద్ధతులు పాటించేవారు. ఈ వ్యాధుల బారిన పడకుండా నెగటివ్ గానే ఉండేందుకు అవసరమైన సేవలు అందించడమే సంపూర్ణ సురక్ష కేంద్రాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ చట్టం ప్రకారము హెచ్ఐవీ సోకిన లేదా ప్రభావితమైన వ్యక్తి పట్ల వివక్ష చూపడం లేదా తప్పుగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమని ఒకవేళ ఎవరితోనైనా అలా ప్రవర్తిస్తే ఆ వ్యక్తికి కనీసం మూడు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుందని దీంతోపాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధించవచ్చునని లేదా రెండు శిక్షలు కూడా విధించవచ్చునని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ఇప్పటినుండి హెచ్ఐవీ స్క్రీనింగ్ అవసరమైన వారికి చేయవలసి ఉంటుందని దాని కచ్చితత్వం కోసం సంపూర్ణ సురక్ష కేంద్రానికి తీసుకువచ్చి నిర్ధారించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రవణ్ కుమార్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నితీష్, ఏ ఆర్ టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేందర్, డైక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుమతి, హెచ్ఐవీ ఎయిడ్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ రమేష్ కౌన్సిలర్ రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సర్వోదయ యూత్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వై ఆర్ జీకే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, టీ హబ్ మేనేజర్ అనురాధ, జిల్లా టీవీ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ శ్వేత అశోకు లింక్ వర్కర్లు ల్యాబ్ టెక్నీషియన్లు డయాలసిస్ సెంటర్ టెక్నీషియన్లు, గవర్నమెంట్ నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, ఇన్చార్జి డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



విశ్వంభర, రామన్నపేట: స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, రామన్నపేట శాసనసభ స్థానానికి మూడు పర్యాయాలు శాసనసభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి ఐదవ వర్ధంతి సందర్భంగా రామన్నపేట భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జోహార్లు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, గుర్రం యాదగిరి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిరెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కమ్యూనిస్టు పార్టీ నాయకుడని, ఈ ప్రాంత ప్రజలకు అనేక సేవలు అందించాలని, రామన్నపేట నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, రైతుల, వ్యవసాయ కూలీలు సామాన్య ప్రజలకు సేవలు అందించిన నాయకుడు యాదగిరి రెడ్డి అని కొనియాడారు.

## అనంతుల సురేందర్ రెడ్డి కూతురు రిసెప్షన్ కు హాజరైన ప్రముఖులు



విశ్వంభర, నాగోల్: కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి రెండో కూతురు జాన్వి రిసెప్షన్ యశ్వంత్ రెడ్డి తో నగరంలోని ఓ కన్వెన్షన్లో ఘనంగా నిర్వహించారు. ఈ రిసెప్షన్ వేడుకలకు టీపీసీసీ క్యాంపేనింగ్ కమిటి ఛైర్మన్ మాజీఎంపీ మధుయాష్కిగౌడ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి ఇతర ప్రముకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మీ పిల్లల కోసం మొక్కలు నాటండి

హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ప్రజా హృదయం స్వచ్ఛంధ సేవా సంస్థ ఆద్వర్యంలో కొరవి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూల మొక్కలు, షో మొక్కలు పంపిణి చేశారు. హరిత మిత్ర అవార్డు గ్రహీత మొక్కల సంరక్షకులు దైద వెంకన్న మాట్లాడుతూ అంతరించి పోతున్న అడవులు, చెరువులు, పక్షులు, ఎర్రలు, నత్త గువ్వలు, అరుద్ర పురుగులు, వానపాములు ఇలా కొన్ని లక్షల కోట్ల క్రిములు అంతరించాయని అన్నారు. ఈ లాంటి వైపరీత్యాల నుంచి మానవులు రక్షించలాంటే ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు.

## స్నేహితుల స్మారకార్థం రక్తదాన శిబిరం



విశ్వంభర,కడ్తాల్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించిన తుప్పరి రాజు, సిద్దిగారి మహేష్ ల జ్ఞాపకం గా వారి స్నేహితులు ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ ప్రారంభించారు. అనంతరం ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శిబిరాన్ని సందర్శించి రాజు మహేష్ ఇద్దరు మంచి స్నేహితులని వారి స్నేహానికి గుర్తుగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి తమ స్నేహభావాన్ని చాటిన స్నేహితులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నరసింహ, జాంగిర్, కృష్ణ, అంజి, రాంచందర్ నాయక్, అశోక్, శ్రీను, రాజా, శ్రీకాంత్ శివ రాజశేఖర్ పాల్గొన్నారు.

## వి.యం.హెూంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కోరిన పూర్వ విద్యార్థుల సంఘం



విశ్వంభర, ఎల్బీనగర్: అనాథ పిల్లలకు పదవతరగతి తర్వాత చదవడానికి హాస్టల్ తో కూడిన ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ వి.యం.హెూం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వి.యంహెూం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు పదవతరగతి వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వి.యం.హెూం లో చదువుతున్నా, హెూం నుంచి అర్థాంతరంగా బయటకు పంపడంతో అనాథ పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. ఇంటర్ కళాశాల లేక చదువులు మధ్యలో ఆపేసి కార్మికులుగా మారడం ఆలనాపాలనా లేకుండా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గతంలో వి.యం.హెూం పరిరక్షణకు కృషి చేసిన కోదండరాం ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్లి పరిష్కారించాలని కోరారు. వి.యం.హెూం లో పర్మినెంట్ టీచర్ ఒక్కరే ఉండటంతో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారిందని,విద్యా ప్రమాణాలు ఉంటడం లేదని వెంటనే పర్మినెంట్ టీచర్లను నియమించాలని కోరారు. వి.యం.హెూం ఎగ్జిక్యూటివ్ కమిటీలో పూర్వ విద్యార్థుల ప్రాతినిధ్యం ఉంటే అనాథ పిల్లలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కాంట్రాక్టు టీచర్ల నియమాకాలలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు. వి.యం.హెూం లో వృత్తి విద్యా కోర్సులు వెంటనే ప్రారంభించేలా చుడాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వి.యం. హెూం పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు కేతావత్ సాగర్, భాస్కర్, గణేష్,విఠల్, మల్లేష్, అశోక్ తో పాటు టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లె వినయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.వి.రంగారెడ్డి, కొత్త రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏటిఎస్ అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్ పదవ వార్షికోత్సవానికి అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్



విశ్వంభర, హైదరాబాద్ : మణికొండలోని ఏటిఎస్ అట్టివో టెక్నాలజీ సొల్యూషన్స్ పదవ వార్షికోత్సవాల సందర్భంగా ముఖ్య అతిధిగా అడిషనల్ ఎస్పీ తేజావత్ రాందాస్ పాల్గొని సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసారు. సంస్థ నిర్వాహకులతో కాసేపు ముచ్చటించి సంస్థ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి చేత పలు వెబ్ సైట్స్ ను ప్రారంభింపజేశారు.

# విద్యా వ్యవస్థ బలోపేతం కోసం చర్యలు

## రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ



విశ్వంభర, భూపాలపల్లి: విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణ లోని అన్ని జిల్లాలలో చర్చా వేదికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర విద్యా విధానంపై ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాల ప్రజలతో చర్చా, సూచనలు మరియు సలహాల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా కమిషన్ పదవీ బాధ్యతలు చేపట్టి రెండు నెలలు అయిందని, ఇప్పటి వరకు దాదాపు 70 సమావేశాలు నిర్వహించామని తెలిపారు. టీచర్స్, లెక్చరర్స్, యూనివర్సిటీ ఫ్యాకల్టీలతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటనలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనల్లో ప్రభుత్వ పాఠశాలలో పాటు కేంద్రీయ విద్యాలయాలు, యూనివర్సిటీలు, కార్పొరేట్ స్కూల్స్, కాలేజెస్ పర్యటిస్తున్న ట్లు తెలిపారు. పర్యటనల ముఖ్య ఉద్దేశం ఈ రోజు విద్యా పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, గత పాలకులు చేసినటువంటి అరాచకాలు వలన విద్యా వ్యవస్థ దెబ్బతిందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలు విద్యా విధానం నాశనమైందని తెలిపారు. దేశంలో ప్రతి రెండు మూడు సంవత్సరాలకు చేసే సర్వేలలో 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మొత్తం పరిశీలించగా మన రాష్ట్రం యొక్క ర్యాంకు విద్యా విధానంలో 32 స్థానంలో ఉందని తెలిపారు. దాన్ని బట్టి మన విద్యా వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిన క్రమంలో భాగంగా ఏ విధంగా విధాన పరమైన నిర్ణయాలు చేస్తే బాగుంటుంది, విధానాలు అమలు చేయాలో క్షేత్రస్థాయిలో పర్యటించి విధివిధానాలు రూపొందించాలని విద్యా కమిషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కమిషన్ చాలా సీరియస్ గా స్టడీ చేస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థ యొక్క పనితీరును పక్క రాష్ట్రాలు, విదేశాల్లో కూడా పర్యటిస్తూ అధ్యయనం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కేరళ, ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాలలో పర్యటిస్తూ విద్యను ఏ విధంగా బలోపేతం చేస్తే బాగుంటుందని సీరియస్ గా స్టడీ చేసి ప్రభుత్వానికి ఒక పాలసీ అందజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ విధంగా చర్చా వేదిక నిర్వహించడం వల్ల మీ యొక్క సలహాలు, సూచనలు అభిప్రాయాలను కూడా పరిగమణలోకి తీసుకొని ఒక మంచి విద్యా పాలసీ రూపకల్పంలో మీరందరూ భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఫీడ్ బ్యాక్ లో మీరిచ్చిన సలహాలు సూచనలు విద్యావ్యవస్థకు ఆయుధాలని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో గద్వాల జిల్లా చాలా వెనుకబడి ఉందని, అందుకనే అక్కడ నుండే ఈ చర్చా వేదికలు ప్రారంభించామని, తరువాత స్థానాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అందుకనే వెనుకబడిన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలలో ఇలాంటి చర్చా వేదిక నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ మీరు మాట్లాడొచ్చే మాట్లాడకూడదు అని కాదని ఒక మంచి పాలసీ రూపకల్పనలో మీరు భాగస్వాములు అవుతున్నారని అన్నారు. ప్రభుత్వపరంగా మీరు ఎంప్లాయిస్ అయినా పర్వాలేదు, ప్రభుత్వ టీచర్స్ అయినా పర్వాలేదు సలహాలు సూచనలు అందజేయాలని సూచించారు. నాణ్యమైన విద్యా విధానం అమలుకు మీరిచ్చే సలహాలు సూచనలు చాలా అమూల్యమైన వని తెలిపారు. ఇలాంటి చర్చా వేదుకలు నిర్వహణ వల్ల మంచి మంచి ఐడియాలు వస్తాయని తద్వారా ఒక మంచి పాలసీ రూపకల్పనకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. చర్చ కొచ్చిన ప్రతి అంశాన్ని నమోదు చేసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర మీ తరపున మాట్లాడేందుకు మాకు అవకాశం కల్పించారని ఆయన తెలిపారు. మీ యొక్క అందరి, సలహాలు సూచనలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు ఇదొక అవకాశమని వచ్చునందుకు ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో విద్యావ్యవస్థలో ప్రీ ప్రైమరీ విద్య నుండి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య బోధన, నైపుణ్య మైన శిక్షణ, ఉపాధి కల్పన కోసం అందరికీ జీవితకాల అభ్యాసనాన్ని ప్రోత్సహించి విద్యలో నూతన సంస్కరణలు తీసుకురావడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులకు అధ్యాపకులకు, మండల విద్యాశాఖ అధికారులకు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు, విద్యార్థులకు స్వాగతం పలికారు.

## కుల గణన సర్వే డేటా ఎంట్రీ పై ఆపరేటర్లకు శిక్షణ



విశ్వంభర, భూపాలపల్లి: సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల గణన సర్వే పై భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో పలిమెల మరియు మహాదేవపూర్ మండలాల కంప్యూటర్ ఆపరేటర్లకు మరియు ఎన్యుమరేటర్ కం ఆపరేటర్లకు భూపాలపల్లి ఎంపీ ఎస్ఓ శివకృష్ణ ఆన్లైన్ డాటా ఎంట్రీ పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాదేవపూర్ ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆపరేటర్ వారికి కేటాయించిన డాటా ఎంట్రీ సెంటర్లో ప్రతిరోజు సుమారుగా 25 సర్వే ఫారములు నమోదు చేయాల్సి ఉంటుందని, డాటా నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని అంతే కాకుండా డాటా నమోదు సమయంలో సంబంధిత ఎన్యుమరేటర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఆపరేటర్ ప్రక్కన ఉండి తప్పులు లేకుండా డాటా నమోదు చేయించాలని సూచించారు. ఇట్టి శిక్షణ కార్యక్రమంలో మహదేవపూర్ ఎంపీడీవో కే.వెంకటేశ్వర్లు, ఎంపీఓ ప్రసాద్ , పలిమెల మండల ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్, తహసిల్దార్ ఎస్ డి సర్వర్, సూపర్వైజర్ ఆఫీసర్లు, ఎన్యుమరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ఆర్ ఎస్ పీ ఫౌండేషన్ వ్యాస రచన పోటీలు



విశ్వంభర, వెల్దండ: నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండల కేంద్రంలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పోలే అశోక్ దొబ్బల భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని ప్రపంచంలో జరుగుతున్న శాంతి సాంకేతక విప్లవం ఏమిటి, ప్రజల జీవనోపాధిని ఎలా ప్రభావితం చేస్తుంది, 2050 నాటికి మీరు ఎలా జీవిస్తారు అనే అంశాల పైన ఫౌండేషన్ సభ్యులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అదే విధంగా ప్రవీణ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా కల్వకుర్తి లయన్స్ క్లబ్ దగ్గర రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, స్వాతి, పిఈటి రవీందర్, ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా శ్రీశైల స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ కుటుంబ సమేతంగా శుక్రవారం రోజున శ్రీశైలంలోని భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖఃసంతోషాలతో ఉండాలని భ్రమ రాంబిక మల్లిఖార్జున స్వామి వారిని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## రజకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### - సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



విశ్వంభర, శంషాబాద్: రజక వృత్తి దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం తెలంగాణ రజక వృత్తి దారుల సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమితి సమావేశం శంషాబాద్ ఎల్ఐటి హెూటల్ యందు బి. నర్సింహా అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి పాలమాకుల జంగయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ రంగారెడ్డి లో నిర్మాణ పరంగా క్షేత్ర స్థాయినుండి బలోపేతం చేసి రజక సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు రూపొందించుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను కలిసి పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ ప్రధాన డిమాండ్లైన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రజక వృత్తిదారుడికి రూ.4000 పింఛను మంజూరు చేయాలని అన్నారు. జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించాలని, విద్యాపరంగా ఉపాధి పరంగా రిజర్వేషన్లు సీట్లు పెంచాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్తు 250 యూనిట్ల నుంచి 500 యూనిట్లకు పెంచాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో పగిళ్ల జోజి, కృష్ణ, నరసింహ, నిరంజన్,దిడ్డి వెంకన్న, అక్కిన పెల్లి జంగన్న, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా పగిళ్ల జోజీ ని,కో కన్వీనర్ గా కేతరాజు నరసింహను ఎన్నుకోవడం జరిగింది.

## అమరేశ్వర ఆలయంలో హనుమాన్ విగ్రహం దగ్ధం



విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా అంబటిపల్లి గ్రామంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. గ్రామంలోని హనుమాన్ విగ్రహం దగ్ధంకావడం ఊరంతా ఉలిక్కి పడేలా చేసింది. గర్భగుడిలోని విగ్రహం దగ్ధమవడం అంతు చిక్కని మిస్టరీగా మారింది.. విగ్రహం మంటల్లో కాలిపోవడం దుష్టశక్తుల పనా..? లేక ప్రమాద వశాత్తూ మంటలు చెలరేగాయా..? అనే అనుమానాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి..తమకు అండ అనుకున్న హనుమయ్య విగ్రహం దగ్ధం కావడం ఊరికి అరిష్టమని ఆ గ్రామస్తులంతా ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామం లో జరిగింది. గ్రామంలోని అమరేశ్వర ఆలయ ప్రాంగణంలో హనుమాన్ విగ్రహం ఉంది. ఏం జరిగిందో తెలియదు గానీ, గురువారం సాయంత్రం హనుమాన్ విగ్రహం వద్ద మంటలు చెలరేగాయి. హనుమాన్ విగ్రహానికి మొత్తం మంటలు వ్యాపించాయి. హనుమాన్ విగ్రహం అగ్నికి ఆహుతి అవుతుండడం గమనించిన స్థానికులు నీళ్లు పోసి మంటలు ఆర్పారు. కానీ మంటలు ఎలా చెలరేగాయి..? విగ్రహం పై ఎలా మంటలు వ్యాపించాయి.అనేది ఎవరికి అంతు చిక్కడం లేదు. హనుమాన్ విగ్రహం మంటల్లో కాలిపోవడం ఊరికి అరిష్టమని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పోలీసులకు సమాచారం అందించిన గ్రామస్తులు ఆలయం వద్ద సమావేశమై సమిష్టి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఏం జరుగుతుందో అని ఆందోళన ఊరందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. సంఘటన స్థలాన్ని కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, మహాదేవపూర్ సీఐ పూర్ణచంద్రరావు, మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ పరిశీలించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని ప్రజలు భక్తులు ఎటువంటి ఆందోళనలకు గురికా వద్దని వారు సూచించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### పాల్గొన్న చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్ భరత్




విశ్వంభర, చేవెళ్ల: చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పామేనా భీమ్ భరత్ శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. షాబాద్ మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన బైండ్ల రమేష్ కు సీఎం రిలీఫ్ చెక్కు అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ రెడ్డి, బందయ్య, నర్సింలు, రామచంద్రయ్య, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వసతి గృహాలలో విద్య, వైద్యం, శానిటేషన్, భోజన వసతిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మండల ప్రత్యేక అధికారులు నిత్యం వసతి గృహాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



విశ్వంభర, మహబూబాబాద్: శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, అన్ని వసతి గృహాల ఇన్చార్జిలతో వసతి గృహాల నిర్వహణపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే.వీర బ్రహ్మచారితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలను ప్రతినిత్యం సందర్శిస్తూ జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఉన్న 126 సంక్షేమ గృహాలు లో క్రమం తప్పకుండా జరిగే తనిఖీలు నిర్వహించాలని, చలికాలం దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్య, వైద్యం, సానిటేషన్, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించాలని సూచించారు. హాస్టల్లో రాత్రి వేళల్లో విద్యుత్ నిరంతరం ఉండే విధంగా చూడాలని, పాములు, విష పురుగులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులలో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వంటశాలలో సిబ్బంది పరిశుభ్రంగా ఉండే విధంగా సంబంధిత వార్డెన్లు చూసుకోవాలన్నారు. స్నానాల గదులు, డైనింగ్ హాల్, స్టడీరూమ్స్, మరుగుదొడ్లు, పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మండలాల ప్రత్యేక అధికారులు వసతి గృహాల తనిఖీ ఇతర అభివృద్ధి పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, డీ ఆర్ డీ ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం,డీసీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, రౌండ్ వాటర్ డీడీ వేముల సురేష్, డీహెచ్ఓ మరియన్న, డీ ఏ ఓ విజయనిర్మల, డీటీడబ్ల్యుఓ సైదా, మండలాల ప్రత్యేక అధికారులందరూ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి: ఆమనగల్లు ఎంఈఓ పాండు



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగలు ఎంఈఓ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందించాలని, ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాల ఎంఈఓ అన్నారు. డిసెంబర్ 4 వ తేదిన నేషనల్ అచీవ్మెంట్ టెస్ట్ తుది పరీక్ష ను నిర్వహించాలని, అనుమతి లేనిదే ఉపాధ్యాయులు పాఠశాలలకు గైర్హాజరు కాకూడదని, విద్యార్థుల సంఖ్య ను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో అన్ని రకాల రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి రామలక్ష్మి, శ్రీమతి పద్మ ప్రధానోపాధ్యాయులు, సాయికుమార్, షైక్ అహ్మద్, కిషన్ పాల్గొన్నారు.

## సంబరాలు కాదు... స్కాలర్షిప్స్ కావాలి

### పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి: పీడీఎస్‌యూ



విశ్వంభర, మలక్ పేట్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ)గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మలక్ పేట బాలికల జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, పీ ఓ డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అనసూయ, పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం పది నెలలు గడుస్తున్నా నేటికీ విద్యారంగ సమస్యల మీద దృష్టి పెట్టకపోవడం సరైనది కాదన్నారు. విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన జాప్యం చేస్తుందన్నారు. దీనితో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ విద్యాసంస్థల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,గౌతమ్, రహీం, పీ ఓ డబ్ల్యు జిల్లా నాయకులు నవ్య,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## మా రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే బీఎల్ఆర్



విశ్వంభర,నల్గొండ జిల్లా: నల్గొండ జిలాకేంద్రంలో దిశ కమిటీ ఛైర్మన్ నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్యామల కిరణ్ కుమార్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ బాలు నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అన్ని విభాగాల జిల్లా ఉన్నత అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ మన మిర్యాలగూడ రైస్ మిల్లులకు ఆసియా ఖండంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. అందుచేత జిల్లా నలుమూలల నుంచి రైతులు ధాన్యం అమ్ముకోవడానికి మిర్యాలగూడ కి అధికంగా విచ్చేస్తుంటారు. దాని మూలాన రైతులు గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారు. కావున రైతులు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు, ధాన్యం ఎండబెట్టుకునేందుకు సెంటర్స్ ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని, ధాన్యం నిల్వ, ధాన్యం ఎండబెట్టుకునేందుకు సెంటర్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరడం జరిగింది.

## బాలికలకు సెల్ఫ్ ప్రొటెక్షన్ కరాటే ట్రైనింగ్ క్లాసులు



విశ్వంభర, జగిత్యాల: జగిత్యాల జిల్లా విట్టంపేట గ్రామం జడ్ పీ హెచ్ ఎస్ పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర సర్వశిక్ష అభియాన్, రాణి లక్ష్మిబాయి ఆత్మరక్షణ ప్రశిక్షన్ క్రింద బాలికలకు కరాటే ఆత్మరక్షణ విద్య మూడు నెలల శిక్షణ కాలంలో బాగంగా ప్రధానోపాధ్యాయులు భుమాచారీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్ మాస్టర్ పర్యవేక్షణలో ప్రారంభించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినా కరాటే ఆత్మరక్షణ శిక్షణ బాలికలకు తనను తాను రక్షించుకోవడానికి దోహదపడుతుందని ఇలాంటి కరాటే ఆత్మరక్షణ లాంటి విద్యను విద్యార్థినులంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భుమాచారి, ఉపాధ్యాయ బృందం జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్, కరాటే మాస్టర్లు విశ్వ తేజ, విష్వంత్ లు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



విశ్వంభర, నాగారం: నాగారం మండల కేంద్రం నకు చెందిన ఎలుక కృపాకర్ కు మోకాలి శస్త్ర చికిత్స కాగా హాస్పిటల్ లో ముఖ్యమంత్రి సహాయానిది నుండి నాగారం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు జాజుల వీరయ్య విజ్ఞప్తి మేరకు మంత్రి కోమటిరెడ్డి సిఫారసు ద్వారా ముఖ్యమంత్రి సహాయనిది నుండి ఎలుక కృపాకర్ కు రూ.35,000లు మంజూరి కాగా శుక్రవారం అట్టి చెక్ ను స్వయంగా కృపాకర్ ఇంటిదగ్గర అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆనంతుల వెంకటయ్య, ఎలుక సుందరయ్య, జాజుల సావిత్ర, జాజుల యోహాను, కన్నెబోయిన బిక్షం, ఎలుక శ్రీను, అక్కేనపెల్లి వెంకన్న, పేరం సత్తయ్య, ఎలుక కృష్ణ పాల్గొన్నారు.

## సుర సముద్రం చెరువులో చేప పిల్లల విడుదల



విశ్వంభర, ఆమనగల్లు: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల కేంద్రంలోని సుర సముద్రం చెరువులో మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ ఛైర్మన్ దుర్గయ్య తో కలిసి ఎంపీడీవో మాధురి, కమిషనర్ వసంత చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం చెరువు కట్ట మీద వెలసిన మైసమ్మ దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చెరువు కింద ఉన్న గ్రామాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కట్ట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు ముక్తాల వెంకటయ్య ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎర్రవోలు యాదయ్య నాయకులు చిన్న వెంకటయ్య, మహేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



విశ్వంభర, కడ్తాల్: కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండా కు చెందిన జర్పుల లక్ష్మణ్ అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న జర్పుల రాధాకృష్ణ ట్రస్ట్ ఛైర్మన్, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ట్రస్ట్ ద్వారా 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ శారదా పాండు, మాజీ వార్డ్ సభ్యులు శ్రీను నాయక్, భీమన్ నాయక్, నాయకులు పాండు, కిషన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



గుజరాత్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (జీపీసీసీ) మాజీ అధ్యక్షులు, గుజరాత్ అసెంబ్లీ కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత అంక్లావ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అమిత్ చావ్డాని శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి (విశ్వంభర, హైదరాబాద్)

## ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాలతో

# ఆర్టీసీ బస్సు పునఃప్రారంభం



విశ్వంభర, మేడిపల్లి: మేడిపల్లి మండలం రాజలింగంపేట మారుమూల గ్రామంగా ఉండడం వల్ల చాలా కాలం నుండి ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదు రాజలింగంపేట గ్రామస్తులు వేరే ప్రాంతాలకు బస్సులో వెళ్లాలంటే ఇరు ప్రక్కల ఉన్న గంభీర్ పూర్, గోవిందారం గ్రామానికి వెళ్లి బస్సు ప్రయాణం చేయవలసి వచ్చేది. కొన్ని సంవత్సరాల క్రితం నుండి రాజలింగంపేట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించినా అది ఎప్పుడు వస్తుందో, రాదో అనే అయోమయంలో గ్రామస్తులు ఉండేవారు. తరువాత ఆ బస్సు సౌకర్యం కూడా పూర్తిగా బంద్ కావడంతో గ్రామస్తులకు మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన సందర్భంలో మండల అధ్యక్షులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, సీనియర్ నాయకులు నీరేటి మల్లేశం, రాజలింగంపేట గ్రామ ప్రజలు తెలపడం జరిగింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే చర్య తీసుకుని కోరుట్ల డిపో నుండి రోజుకు నాలుగు సార్లు బస్సు వచ్చే విధంగా ఆర్టీసీ బస్సును పునః ప్రారంభింపజేశారు. శుక్రవారం మొదటిసారిగా గ్రామానికి వచ్చిన బస్సుకు గ్రామ ప్రజలు పూజలు చేసి పండగ వాతావరణాన్ని కల్పించుకొని సంతోషం వ్యక్తం చేశారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యం ఎంతైనా అవసరమని నీరేటి మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. బతుకమ్మ ఘాటును సౌకర్యవంతంగా ఉండేలా మరమ్మత్తులు చేయించిన ఎమ్మెల్యే ఆది శీనివాసుకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని కాంగ్రెస్ నాయకులు ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీరేటి మల్లేశం, గుగ్గిళ్ళ గంగారం, బండపల్లి సంజీవ్, తోకల గంగ నరసయ్య, దేశవేని లక్ష్మీరాజం, శివ నూరి నారాయణ, కొండ రాజయ్య(సీపీఐ నాయకులు) సుంకపాక రాజు, సుంకపాక మధు, నేరెళ్ల సత్తయ్య, నేరెళ్ల గంగాధర్, జడల నడిపి గంగరాజం, శంకర్, మురళీ దాసరి గణేష్ తదితరులు పాల్గొనడం జరిగింది. డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సు రాకపోకల ఈ విధంగా ఉన్నాయని కోరుట్ల నుండి ఉదయం 6:50, 08:50. మధ్యాహ్నం 2:40 సాయంత్రం 6:20 రాజలింగంపేట నుండి ఉదయం 08:00, 09:50, మధ్యాహ్నం 3:40 సాయంత్రం 07:20 వివరించారు.

# సూరారం విద్యార్థులకు ప్రథమ బహుమతి



విశ్వంభర, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ లో ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగం నుండి జిల్లా పరిషత్ హైస్కూల్ సూరారం, విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ తెలుగు మీడియం నుండి కాళేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అదేవిదంగా ప్రైవేట్ విభాగం నుండి గ్రీన్ వుడ్ హైస్కూల్ మహాదేవపూర్ జిల్లాస్థాయికి విద్యార్థులు ఎంపికయ్యారు. విజేతలకు ముఖ్య అతిథిగా వచ్చిన మహాదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రామచందర్ రావు జ్ఞాపికలు మరియు ప్రశంసా పత్రాలు బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమం చెకుముకి మండల కన్వీనర్ బి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. విశిష్ట అతిథి మండల విద్యాధికారి బి ప్రకాష్ బాబు మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలు మనిషిని ఉన్మాదిగా మారుస్తున్నాయని వాటిని నిర్మూలిస్తే విజ్ఞాన ప్రసారం సులువవుతుంది అని అన్నారు. జిల్లా కన్వీనర్ బోట్ల సాంబయ్య మాట్లాడుతూ విద్యార్థి దశలో ఎందుకు ఎలా ఏమిటి అనే విధానంలో చదువుకుంటే శాస్త్రీయ వైఖరి అలవడి అభివృద్ధి చెందుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలుర ప్రధానోపాధ్యాయులు బి రాజిరెడ్డి, బాలికల ప్రధానోపాధ్యాయురాలు పి సరిత మరియు ఉపాధ్యాయులు సూరారం నుండి వెంకటేశ్వర్లు, అంబటపల్లి నుండి రంగారావు, బొమ్మాపూర్ నుండి భాస్కర్, రాజబాబు, బాలికల స్కూల్ నుండి మధు, కాళేశ్వరం నుండి రాజేందర్, కేజీబీవీ నుండి పిజిక్స్ మేడం, ఇంకా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగింది. ఈ సంస్థ సమాజంలో విస్తరించి ఉన్న మూఢ నమ్మకాల్ని రూపుమాపడమే ధ్యేయంగా నిర్విరామంగా ముందుకు పోతుంది. నేటి పోటీలలో జిల్లా స్థాయికి ఎంపికైన పాఠశాలలు 28 నవంబర్ 2024న భూపాలపల్లిలో జరగబోయే జిల్లా టాలెంట్ టెస్ట్ లో పాల్గొని మహాదేవపూర్ మండల సత్తా చాటాలని పలువురు అభినందనలు తెలియజేశారు.

## బీసీలను రాజకీయ చైతన్యం చేసి

# ఎస్సీ, ఎస్టీ, బీసీల రాజ్యం తెస్తాం



విశ్వంభర, షాద్ నగర్: షాద్ నగర్ నియోజక వర్గంలోని యాదాద్రి హోటల్ లో శుక్రవారం బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, నందిగామ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సేన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ, నడికూడ రఘునాథ్ యాదవ్ రావటం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్యేశించి వారు మాట్లాడుతూ బీసీలు ఇంకా ఎన్నాళ్ళు జండా మోసే కాడ ఉండాలని, జండా మోసే దగ్గర నుండి జండా ఎగరవేసే కాడికి తీసుకురావాల్సిన బాధ్యత మనదే అని వారు అన్నారు. బీసీలను రాజకీయ చైతన్యం చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ల రాజ్యం తేవాలని వారు అన్నారు. అసలు రిజర్వేషన్లు ఉండాల్సింది అగ్రవర్ణాలకని వారి జనాభా ఎంతో వారి వాటా వారికి ఇచ్చి మిగిలింది అంత బీసీ, ఎస్సీ, ఎస్టీ లు పంచుకోవాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. శుక్రవారం బీసీ సేన ఫరూక్ నగర్ మండల నూతన కమిటీ ని వేయడం జరిగిందని తెలిపారు. అధ్యక్షులుగా కుమ్మరి మల్లేష్ ఉపాధ్యక్షులుగా సాయి కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, సహా కార్యదర్శి గా పోలేమోని శివ కుమార్, కోశాధికారీ చక్కటి లింగంని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సేన నాయకులు శ్రీశైలం శివ రాజు మహేష్ రాజేష్ కిట్టు శ్రీను బాలు నర్సింహా జన చైతన్య సమితి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రొత్తగా ఓటరు నమోదు కొరకు శని,ఆదివారాలు స్పెషల్ క్యాంపెయిన్ : నాగారం తహశీల్దార్ బ్రహ్మయ్య

విశ్వంభర, నాగారం : కొత్తగా ఓటర్ నమోదు కొరకు శని, ఆదివారం రెండు రోజులు ప్రతి గ్రామంలో స్పెషల్ క్యాంపియన్ ఉంటుందని స్థానిక తహశీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. క్యాంపియన్ తేదీలు 23 నవంబర్ 2024, 24 నవంబర్ 2024. శనివారం మరియు ఆదివారం రెండు రోజులు ఎస్.ఎస్.ఆర్. 2025 స్పెషల్ క్యాంపెయిన్ దే ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించ వలసి ఉంటుంది. కనుక ఆయా గ్రామాల బి.ఎల్.ఓ లు అందరు ఓటర్ల జాబితా మరియు ఫారం 6, 7, 8, దరఖాస్తుల యుక్తము గా సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండి సాయంత్రం వరకు రెండు రోజులు ఉండి దరఖాస్తులు స్వీకరించగలరని వయోజనులందరూ దరఖాస్తు చేసుకొని దరఖాస్తు ఫారాలను బి.ఎల్.ఓ లకు అందజేయన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన అవసరం - సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్




విశ్వంభర, సరూర్ నగర్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవలసిన అవసరం ఎంతో ఉందని సైబర్ క్రైం రాచకొండ డీసీపీ అరవింద్ అన్నారు. ఎల్బీనగర్ నారాయణ స్కూల్, దిల్ సుఖ్ నగర్ జోన్ దిల్ సుఖ్ నగర్ కు చెందిన నారాయణ విద్యాసంస్థల 11 బ్రాంచ్ ల స్పోర్ట్స్ లీగ్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా సైబర్ క్రైం రాచకొండ డీసీపీ అరవింద్, సీఐ జలందర్ రెడ్డి, నారాయణ గ్రూప్ స్కూల్స్ జి ఏం గోపాల్ రెడ్డి, ఏ జి ఏం హేమెంబర్, ఆర్ ఐ రవి ప్రసాద్ లు హాజరై క్రీడా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ అరవింద్ విద్యార్థులను ఉదేశించి మాట్లాడుతూ యువ భారత్ వికాసానికి శారీరక, మానసిక విజ్ఞాన సామర్థ్యలను పెంపొదించాలని అన్నారు. ప్రస్తుతం సమాజం లో సోషల్ మీడియా ఇంటర్నెట్ వాడకం పెరగడం వల్ల ఉపయోగం తో పాటు సైబర్ నేరాలు కూడా అధికంగా జరుతున్నాయి. పిల్లలు పెద్దలు అందరు ఈ విషయం లో అప్రమత్తం గా ఉండాలాన్నారు. స్పోర్ట్స్ లీగ్ లో కబడ్డీ,కోకో, చెస్, క్యారామ్స్, రనింగ్ రేస్ వంటి క్రీడాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీ శారద, ఏవో రాదా, పీఈటి శివ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గుళ్లో లింగాన్ని అపహరించిన దుండగులు

### దుండగులను పట్టుకొని శిక్షించాలని హిందూ సమాజం ధర్నా



విశ్వంభర, షాద్ నగర్: షాద్ నగర్, ఫరూక్ నగర్ జంట గ్రామాలుగా ప్రసిద్ధి చెందిన ఫరూక్ నగర్ లో అతి ప్రసిద్ధి చెందిన పురాతనమైన బసవన్న దేవాలయంలో నిన్న అర్థరాత్రి గుడి కాంపౌండ్ లో ఉన్న లింగాన్ని గుర్తు తెలియని దుండగులు మాయం చేశారు. గుళ్లో లింగం లేదు ఎవరో ఎత్తుకెళ్లారని తెలిసిన వెంటనే హిందూ సమాజ రక్షకులు దేవాలయం వద్దకు చేరుకొని తమ నిరసన తెలుపుతూ దుండగులను పట్టుకొని శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ మధ్యకాలంలో కేవలం హిందూ దేవాలయాలనే టార్గెట్ చేసుకొని విగ్రహాలను ధ్వంసం చేయడం చాలా ఆలోచించదగ్గ విషయమని, దీనిపై ప్రభుత్వం, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి వీలైనంత తొందరగా దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించి మరొకసారి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితులలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ విజయకుమార్, ఎస్సైలు బలరాం, సుశీల మరియు పోలీసులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శంషాబాద్ డీసీపీ రాంకుమార్ కూడా సంఘటన స్థలాన్ని సందర్శించారు.

## శివలింగాన్ని ధ్వంసం చేసిన గుర్తు తెలియని దుండగులు ఫరూక్ నగర్ ఆలయంలో ఘటన



విశ్వంభర, షాద్ నగర్: శివాలయంలో శివలింగాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం కలకలం రేపుతుంది. జానంపేట(ఫరూక్ నగర్)గా పిలవబడుచున్న వివేకానంద కాలనీలో ఉన్న శివాలయంలో బసవన్న శివాని గుడిలో శివ లింగాన్ని కూల్చడమే కాకుండా కనిపించకుండా చేశారు గుర్తు తెలియని దుండగులు. ఆలయంలో శివలింగం ధ్వంసం కావడంపై స్థానికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివలింగాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎవరైనా గుప్త నిధుల కోసం చేశారా లేక దేవాలయాలను ధ్వంసం చేసే ఆలోచనతో చేశారా అనేది పోలీసుల ఎంక్వైరీలో తేలాల్సి ఉంది. శివలింగం ధ్వంసమైన ఘటనపై పోలీసులు స్పందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పట్టణ సీఐ, ఎస్ఐ లు త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

## దూసుకొస్తున్న హైడ్రా బుల్డోజర్స్

# కబ్జాదారుల గుండెల్లో గుబులు



విశ్వంభర, పోచారం: అక్రమ నిర్మాణాలు కూల్చివేసేందుకు హైడ్రా మరోసారి సిద్ధమవుతోంది. గత మూడు నెలల క్రితం నగరంలో కూల్చివేతలు చేపట్టిన హైడ్రా ప్రస్తుతం సైలెంట్ అయింది. హైకోర్టు నుంచి కొంత వ్యతిరేకత రావటంతో పకడ్బందీగా కూల్చివేతలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగా హై పవర్తో రంగంలోకి దిగబోతుంది. పార్కులు, రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం చెరువులు, కుంటల, ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్స్ పనులు నడుస్తుండగా పార్కులు, రోడ్లు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సిద్ధమైంది. అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు రెడీ అయింది. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ మీరలంకుంట ను శుక్రవారం హైడ్రా అధికారులు పరిశీలించారు. ఈ మేరకు హైడ్రా అధికారుల బృందం మీర్కాన్ కుంటను పరిశీలించి వెళ్ళింది. అక్రమ కబ్జాదారుల గుండెల్లో ఎక్కడి నుంచి బుల్డోజర్స్ దూసుకు వస్తాయని ఆందోళన మొదలైంది.

## సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి




విశ్వంభర, ఎల్బీనగర్: కొత్తపేట డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో వున్నటువంటి సమస్యలపైన జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని కలిసి వినతి పత్రాన్ని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోడి పవన్ కుమార్ అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ భరత్ నగర్ ఫేస్ 1, మారుతి నగర్ స్వేత గార్డెన్స్ ఎదురుగా రోడ్డు, ఓల్డ్ మారుతి నగర్ గురు మందిర్ రోడ్డు మొత్తం పాడైపోయాయని కాలనీ ప్రజలు నడవలేని స్థితిలో ఉన్నారని తెలియజేశారు. వెంటనే నూతన సీసీ రోడ్డును మంజూరు చేయాలని కోరారు. కొత్తపేట డివిజన్ పరిదిలో వున్నటువంటి కాలనీలలో విద్యుత్ దీపాల కొరత ఎక్కువగా వున్నాయని వెంటనే వాటిపైన చర్యలు తీసుకోవాలని కోరారు. జోనల్ కమిషనర్ వెంటనే స్పందించి సమస్యలపై చర్యలు తీసుకుంటామని త్వరలో డివిజన్ లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటామని అన్నారు.

## పాఠశాలలు, వసతిగృహాలు తనిఖీ



విశ్వంభర, మహబూబాబాద్: గౌరవ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఐ.ఏ.ఎస్. ఆదేశాల ప్రకారం శుక్రవారం నెల్లికుదురు మండల కేంద్రంలోని అంగన్వాడి స్కూల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతిగృహాలు తనిఖీ తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ స్కూల్, అంగన్వాడి స్కూల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలు తనిఖీ చేసి మెరుగైన ఫలితాల కోసం నిరంతరం మంచి విద్యను అందించాలని టీచర్లను మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న కోరారు. పాటశాల ల చుట్టూ పరిశుభ్రత ఉండే విధంగా చూడాలని, వేడి ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని కోరారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థులకు మండల వైద్యాధికారి డాక్టర్ నందనా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్నందనా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాలరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉపేందర్, కస్తూర్బా గాంధీ స్కూల్ ప్రిన్సిపాల్ సుమలత, వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



జానంపేట బసవన్న గుళ్లో శివ లింగం మాయంపై ధర్నా నిర్వహిస్తున్న హిందూ వాహిని సభ్యులు, బీజేపీ శ్రేణులు (విశ్వంభర, షాద్ నగర్)



ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర మహాసభల వాల్పోస్టర్ ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా కోర్టు లో బార్ అసోసియేషన్ హాల్లో జిల్లా బార్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, ఐఏఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.వి.ఎల్. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. రాములు, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ డి. జయ శ్రీనివాస్, ఐఏఎల్ నాయకులు బి లక్ష్మయ్య, ఎస్ నాగేశ్వరరావు, జక్కుల వెంకటేశ్వర్లు, ఆర్బి రామారావు, శరత్, ఆకుల వెంకట రాములు, తదితరులు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. (విశ్వంభర, ఎల్బీ నగర్)

## సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించిన కౌన్సిలర్ దంపతులు



విశ్వంభర, షాద్ నగర్: కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం 18వ వార్డు కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని గాంధీ నగర్ కాలనీ బీఆర్ఎస్ యువ నాయకుడు అభిలాష్ తెలిపారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం లో పాల్గొన్న అభిలాష్ ను శాలువ తో కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్ సత్కరించారు. కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్ కు అభిలాష్ కృతజ్ఞతలు తెలియచేశాడు. చిన్నగా ఉన్న హనుమాన్ దేవాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్న యుగంధర్ దంపతులకు ఆంజనేయస్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని అభిలాష్ ఆకాంక్షించాడు.

## సీఎం రేవంత్ సొంత ఊర్లో మాజీ సర్పంచ్ ఆత్మహత్య



విశ్వంభర, కల్వకుర్తి: సీఎం రేవంత్ సొంత ఊర్లో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కారణం సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్రదర్స్ అని సూసైడ్ లేఖ రాసీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డి పల్లి లో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య కలకలం రేపింది.. ఓ ఢిల్లీ ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చాడనే నేపంతో గత కొన్నాళ్లుగా సీఎం బ్రదర్స్ అనుచరులు తీవ్రంగా వేధిస్తున్నారు.వేధింపులకు తాళలేక శుక్రవారం నాడు ఆత్మహత్యకు సాయి రెడ్డి పాల్పడ్డాడు. తన చావుకు కారణం సీఎం బ్రదర్స్ అని సూసైడ్ లేఖలో పేర్కొన్న సాయిరెడ్డి. మృత దేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



విశ్వంభర, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ కాటారం మండలంలోని కొత్తపల్లి, ఏఎంసీ కాటారం మరియు రేకులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను రైతుల నుండి ఎఫ్ ఏ క్యూ వచ్చిన ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దని ఆదేశించారు. కొనుగోలు చేసిన దాన్యం ట్యాగ్ చేయబడిన రైస్ మిల్స్‌కు తక్షణమే తరలించాలని ఆదేశించారు.అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఈ సూచనలను పక్కాగా పాటించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్ల నిర్వహణ, ట్రక్ షీట్స్, ప్యాడి క్లీనింగ్ యంత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలి

### - భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



విశ్వంభర, భూపాలపల్లి: సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారులను, తహసీల్దార్లను, ఎంపీడీఓలను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం నుండి వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే అంశంపై మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలకు సరఫరా అవుతున్న బియ్యం, సరుకుల నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వేడి నీటి సదుపాయం కల్పించాలన్నారు. వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్.ఓ ప్లాంట్లు పనితీరును పరిశీలించాలని సురక్షిత మంచినీరు అందించాలని సూచించారు. పప్పులు, ఇతర దినుసులు, ఇతర సరఫరా సామగ్రి నాణ్యతను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. వారానికి కనీసం మూడు సార్లు వసతి గృహాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ఆహార నాణ్యతను పరిశీలించే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. అంగన్ వాడి కేంద్రాలు,మధ్యాహ్న భోజన సౌకర్యాలు కూడా తనిఖీ చేయాలని అన్నారు. ఏదేని నాణ్యతలో లోపించి విద్యార్థులు ఇబ్బందులు పడితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అన్ని వసతి గృహాలును మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు తనిఖీలు నిర్వహించి సోమవారం నాటికి సమగ్ర నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ఈడీఎం నివేదికలు సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


# గీతంలో న్యూక్లియర్ మాగ్నెటిక్ రెసొనెన్స్‌పై కార్యశాల




విశ్వంభర, సంగారెడ్డి: సంగారెడ్డి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఫార్మాస్యూటికల్, బయోమెడికల్ అప్లికేషన్స్ కోసం చిన్న మాలిక్యూల్స్ యొక్క న్యూక్లియర్ మాగ్నెటిక్ రెసొనెన్స్ (ఎంఎన్ఆర్)'పై మూడు రోజుల వర్క్ షాపును డిసెంబర్ 12 నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. మూర్తి పేరిట గీతంలో నెలకొల్పిన అధునాతన అనలిటికల్ ఇన్ స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీపై బహుళ విభాగ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యశాలలో పాల్గొనేవారికి ఎన్ఎంఆర్ స్పెక్ట్రో స్కోపీలో అవసరమైన జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ముఖ్యంగా చిన్న అణువులు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఏపీఐలు), మలినాలు, శరీర ద్రవాలలోని బయోమార్కర్ల నిర్మాణాత్మక లక్షణాలపై దృష్టి సారిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిష్టాత్మక విద్యా-పరిశోధనా సంస్థల నుంచి ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొని తమ అనుభవం, నైపుణ్యాలను సదస్యులకు వివరించనున్నారు. లక్నోలోని బయోమెడికల్ పరిశోధనా కేంద్రం ప్రొఫెసర్ నీరజ్ సిన్హా, ప్రొఫెసర్ దినేష్ కుమార్, హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన డాక్టర్ ఏవీఎస్ శర్మ, డాక్టర్ జి.జితేందర్ రెడ్డి, నైపర్ ప్రొఫెసర్ రాజేష్ సొంటి తదితరులు ముఖ్య వక్తలుగా పాల్గొననున్నారు. దీనిని యువ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థుల కోసం రూపొందించారు. ఈ కార్యశాలలో పాల్గొనేవారు అత్యాధునిక 500 మెగాహెర్జ్ ఎన్ఎంఆర్ స్పెక్ట్రోమీటర్ తో శిక్షణ, స్పెక్ట్రల్ ప్రాసెసింగ్ లో విలువైన అనుభవాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది. పరిమిత సంఖ్యలో (కేవలం 30 మందికి) మాత్రమే ఈ కార్యశాలలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే, వారు చేపట్టిన పరిశోధన ఆధారంగా, ఎంపిక చేసిన వారిని అనుతించనున్నారు. ఇతర వివరాల కోసం 7259 88 5177, 9951 286 720ను సంప్రదించాలని, లేదా salla2@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలన్నారు.

# ప్రమాదవశాత్తూ హనుమాన్ విగ్రహం దగ్ధం

### ప్రాథమిక విచారణలో పోలీసుల వెల్లడి




విశ్వంభర, మహదేవ్ పూర్: భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలంలోని అంబటిపల్లి గ్రామంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో అమరేశ్వర ఆలయంలోని హనుమాన్ విగ్రహంకు మంటలు అంటుకున్నాయని వచ్చిన సమాచారం ఆధారంగా కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, మహదేవ్ పూర్ సీఐ రామచందర్ రావు, మహాదేవ్‌పూర్ ఎస్సై పవన్ కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి అంబటిపల్లి గ్రామస్తులను, ఆలయ కమిటీ ఛైర్మన్ సభ్యులను, ఆలయ పూజారిని విచారించగా కార్తీక మాసం సందర్భంగా కుజదోష పూజను నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు భక్తులు హనుమాన్ విగ్రహానికి చందనం మరియు నూనె పూసి తర్వాత ఎందు కుడుకలలో నూనె పోసి దీపం వెలిగించి హనుమాన్ విగ్రహం పాదాల వద్ద పెట్టి వెళ్ళారు. తర్వాత పూజారి కూడా ఇంటికి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు హనుమాన్ పాదాల వద్ద పెట్టిన కుడుకలోని దీపం అంటుకొని విగ్రహానికి గల చందనం మరియు నూనెల వల్ల మంటలు చెలరేగాయని ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. కాబట్టి ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలను ప్రచారం చేయవద్దని, నమ్మవద్దని కాటారం ఎస్డీపీఓ రామ్మోహన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో పూర్తి సమాచారం నిమిత్తం దర్యాప్తు చేయడం జరుగుతుంది. అలాగే ఇట్టి విషయంలో ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఆయన అన్నారు.

# ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల పాత్ర కీలకం



విశ్వంభర,రంగారెడ్డి జిల్లా కోర్టు : విశ్వహిందూ పరిషత్ విధి ప్రకోష్ట లీగల్ సెల్, రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "ప్రజాస్వామ్యంలో న్యాయవాదుల పాత్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ బి శివ శంకర్ రావు, స్పీకర్ గా రిటైర్డ్ ప్రొఫెసర్ హిందూ కాలేజ్ హర్యానా, డాక్టర్ సురేందర్ కుమార్ జాయిన్, అతిథిగా బి శివ ప్రసాద్, బార్ కౌన్సిల్ మెంబర్ గోకుల్ రామారావు, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, సెక్రటరీ గులగారి కృష్ణ పాల్గొని వారి అమూల్యమైన సందేశాన్ని అందించారు. కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర జాతీయ అధికర ప్రతినిధి రావినుతల శశిధర్, విధి ప్రకోష్ట లీగల్ సెల్ ప్రాంత కన్వీనర్ టి జస్వంత్, ప్రాంత కో కన్వీనర్ వనం శ్రీకాంత్, పల్ల రాధికా శర్మ, వట్టికూటి అంజయ్య గౌడ్ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటి ప్రసిడెంట శ్రీనాథ్, డైరెక్టర్ బాచి రెడ్డి శాయి రెడ్డి, రంగ ప్రవీణ్ కుమార్, కుమార్, అరవింద్ రెడ్డి, పరమేశ్వర్, శ్రీకర్, నాగేశ్వర్ మొదలగు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఈనెల 27, 28న కరీంనగర్ పాదయాత్రకు తరలిరావాలి

### - ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగయ్య మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఈనెల 27, 28 తేదీలలో కరీంనగర్ లో చేపడుతున్న పాదయాత్రను ఉద్యమకారులంతా పాల్గొని విజయవంతం చేయాలని, బొడ్డుపల్లి లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజమైన ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు తక్షణమే ఇచ్చి, ఉద్యమాకారులకు 250 చదరపు గజాల స్థలము, 25 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్, ఉద్యమ నాయకులు డాక్టర్ నకిరేకంటి అశోక్ కుమార్, ఎండి ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రంక్ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### - ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



విశ్వంభర, ఎల్బీనగర్: రాచకాలువ సర్వే త్వరగా పూర్తి చేసి వచ్చే వర్షాకాలం లోపు ట్రంక్ లైన్ పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. శుక్రవారం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ శివారు కాలనీల డ్రైనేజీ అవుట్ లెట్ కోసం తన కార్యాలయంలో ఎల్.బి.నగర్ జోన్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్, టౌన్ ప్లానింగ్ ఏ.సీ.పీ.శ్యామ్సాన్ లతో తన కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ట్రంక్ లైన్ కోసం మలివిడత దాదాపు రూ. 2 కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని, కాంట్రాక్టర్ కూడా ట్రంక్ లైన్ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారు. రాచకాలువ మొత్తం సర్వే చేయించి,యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.రాచకాలువ సర్వే త్వరగా పూర్తి చేసి వచ్చే వర్షాకాలం లోపు ట్రంక్ లైన్ పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భారాస పార్టీ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,ఇరిగేషన్ అధికారులు శుక్లాజ,సతీష్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నేరుగా విత్తే వరి సాగుపై క్షేత్రస్థాయి పరిశీలన



విశ్వంభర, త్రిపురారం: తక్కువ నీటి సాంద్రతతో ఎక్కువ దిగుబడి నివ్వడంతో పాటు కూలీల కొలతలు అధిగమించే నేరుగా వరి విత్తే పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించాలని వరి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి అన్నారు. హైదరాబాదులోని రాజేంద్రనగర్ కేంద్రంగా పనిచేసే భారతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల బృందం నల్గొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలో జిల్లాలో వరి పరిశోధన స్థానం,భారతీయ స్టేట్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న నేరుగా వరి విత్తే పద్ధతి ద్వారా సాగవుతున్న వరి పంటలను మండలంలోని నీలాయిగూడెం, సత్యనారాయణపురం గ్రామాలలో సందర్శించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పద్ధతి వల్ల వారికి కలిగిన ప్రయోజనాలు, అధునాతనమైన శాస్త్ర సాంకేతికతతో పాటు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అందిస్తున్న శిక్షణ, పంట సాగులో మెలకువలు, సూచనలు సలహాలను తమకు ఎంత ఉపయుక్తంగా ఉంటుందని రైతులు కంచి సోమయ్య, రాగం మల్లయ్య, ప్రసాద్ లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ అర్పిత, కేవీకే కార్యక్రమాల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు చంద్రశేఖర్,శ్రీనివాస్, అజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ జన్మదిన వేడుకలు




విశ్వంభర, హనుమకొండ: హనుమకొండ జిల్లా లోని 55వ డివిజన్ భీమారంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అట్టికం రవీందర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్యస్ నాయకులు సంగాల విక్టరీబాబు మాట్లాడుతూ దాస్యం వినయ్ భాస్కర్ కు బీఆర్ఎస్ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో రైతులకు ప్రజలకు ఎంతో మేలు చేశారని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని, కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ వృద్ధాప్య పింఛన్లు ఇలాంటివి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిందని తెలిపారు. రానున్న రోజుల్లో కేసీఆర్ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు వస్తారని ప్రజలు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతల లక్ష్మణ్ యాదవ్,పోగుల రమేష్,నాతి సమ్మయ్య రాయి కంటి సురేష్, గుంజే సాయికుమార్,పోరెడ్డి శ్రీనివాస్,సంగాల సరోజన,బేతల్లి యాకయ్య, నమ్మిండ్ల రవి,బూర రాంరాజ్,బూర కిట్టు,ఉప్పు ప్రభాకర్,ఉప్పు రమేష్,దేవర సమ్మయ్య,మెరుగోత్తు రఘు,జక్కుల శెంతన్,గడ్డం భగత్,గాదే మహిపాల్,పల్లపు రవికుమార్,కొండేటి హరీష్, ఫెరోజ్ బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామి రెండవ హుండీ లెక్కింపు



విశ్వంభర, మహబూబ్ నగర్ జిల్లా అమ్మాపురం గ్రామం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాల పురస్కరించుకొని రెండో హుండీని లెక్కింపు చేశారు. 22,78,896 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి మధనేశ్వర్ రెడ్డి, ఆలయ ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ రెండవ హుండీ లెక్కింపులో పాలక మండలి సభ్యులు భాస్కరాచారి, భారతమ్మ, కమలాకర్, శ్రీధర్ రెడ్డి, శేఖర్, గోపాల్, చక్రవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, ఎం రాములు, కురుమూర్తి, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాలకు నోముల భగత్‌కు ఆహ్వానం



విశ్వంభర, రామన్నపేట: అఖిల భారత యాదవ మహాసభ రామన్నపేట మండల కమిటీ తరుపున నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ ను వారి నివాసంలో కలిసి, సదర్ ఉత్సవాలకు మర్యాదపూర్వకంగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల యాదవ సంఘం ఉపాధ్యక్షులు కల్లూరి నాగేష్ యాదవ్, అధికార ప్రతినిధి పోచ బొయిన మల్లేశం యాదవ్, నాయకులు గోగు మల్లేష్ యాదవ్, గోగు హరిప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్‌లో యోగాసన పోటీలు

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన టీవైఎస్ఏ



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడాపోటీల్లో యోగాసన పోటీలను చేర్చినందుకు తెలంగాణ రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ (టీవైఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో వారు శుక్రవారం ఆమెను కలిశారు. వారి వెంట యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ (ఆర్గనైజింగ్ యోగ) రామ్ రెడ్డి , రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ (టెక్నికల్) తోట సతీష్, డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ ఉన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ రావు మాట్లాడుతూ డిసెంబర్ లో నిర్వహించే సీఎం కప్ పోటీల్లో యోగాను చేర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో యోగాసన పోటీలు ఉంటాయన్నారు. ప్రస్తుతం యోగ అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోందని, ఖేలో ఇండియా, ఖేలో ఇండియా ఉమెన్, నేషనల్ గేమ్స్, యూత్ గేమ్స్, ఏషియన్ పోటీలో కూడా యోగా పోటీలు నిర్వహిస్తున్నారని నందనం కృపాకర్ అన్నారు. దీంతో క్రీడాకారులకు అనేక అవకాశాలు లభిస్తున్నాయని, విద్యా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని ఆయన తెలిపారు.

## జిల్లా కోర్టులో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్

### ప్రారంభించిన న్యాయమూర్తులు సురేష్, తిరుపతి



విశ్వంభర, మహబూబాబాద్: తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా వైద్య శాఖ సహకారంతో మహబూబాబాద్ జిల్లా కోర్టులో ప్రధమ చికిత్స కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కోర్టుకు వచ్చిన కక్షిదారులలో మహిళలు, వృద్ధులు, పిల్లలు అత్యవసర పరిస్థితులలో ఏదైనా వైద్య సహాయం కావలసి వస్తే వినియోగించుకునేందుకు అనుగుణంగా ప్రధమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ పర్యటన



విశ్వంభర, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, చింతల్ బస్తి ధవాఖాన, మరియు (యూ పి హెచ్ సి) మార్క్స్ నగర్ ను డాక్టర్ సుదీరా అడిషనల్ డైరెక్టర్ (పీహెచ్ఓ) డాక్టర్ జి. గాయత్రి దేవి (జిల్లా వైద్యాధికారి) సంగారెడ్డి మరియు డాక్టర్ అలేఖ్య అసిస్టెంట్ ప్రొఫెసర్, జి. జి. హెచ్. సంగారెడ్డి మరియు డాక్టర్ శశాంక్ దేశ్ పాండే (డి ఐ ఓ) పర్యటించడం జరిగినది. ఈ కార్యక్రమం లో డ్రగ్ స్టోర్ లో జిల్లా కి మంజూరీ అయిన, మరియు కావలసిన మందుల వివరాలు, జిల్లా లోని ప్రభుత్వ ఆసుపత్రులకు మందుల పంపిణీ గురించి అడిగి తెలుసుకొన్నారు. పేషంట్లకు అవసరమయ్యే మందులు వాటి పంపిణీ ఎలా జరుగుతుందో తెలుసుకున్నారు. మరియు మందులు బద్రపర్చడానికి కావలిసిన జాగ్రత్తలు ఎలా తీసుకొంటున్నారో అడిగి తెలుసు కొన్నారు. (యు పి హెచ్ సి)మార్క్స్ నగర్ ను సందర్శించి అక్కడ వైద్య బృందం తో పేషంట్ల యొక్క వివరాలు, కావలిసిన అవసరాల గురించి అడిగి తెలుసుకొన్నారు. చింతల్ బస్తి ధవాఖాన లో వైద్య బృందం తో మాట్లాడి ఆసుపత్రి కి సంబందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో

# నూతన మార్కెట్ ను నిర్మిస్తాం

### మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఉదయ్ కుమార్



విశ్వంభర, అబ్దుల్లా పూర్ మెట్: అంతర్జాతీయ ప్రమాణాలతో కోహెడ లోని పండ్ల మార్కెట్ ను నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు ఉదయ్ కుమార్ అన్నారు. శుక్రవారం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి పాలకవర్గం, సంబంధిత అధికారులతో కలిసి కొహెడ లో చేపట్టబోయే మార్కెట్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ నూతన మార్కెట్ నిర్మాణ డీపీఆర్ ను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫేజ్-1 క్రింద చేపట్టే నిర్మాణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొహెడ లో మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నదని, అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మాణం చేపడతామని అన్నారు. రైతులకు ఉపయోగపడేవిధంగా అన్ని రకాల సదుపాయాలతో నిర్మాణం ఉంటుందని అన్నారు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద మార్కెట్ హబ్ గా ఉండేవిధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అదేవిధంగా సమీకృత మార్కెట్ కూడ నిర్మిస్తామని అన్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం ద్వార మంచి ఎగుమతులు దిగుమతులు జరుగుతాయని అన్నారు. త్వరలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం ఉంటుందని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ బాస్కర చారి, మార్కెట్ డైరక్టర్లు జైపాల్ రెడ్డి, అంజయ్య, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గణేష్ నాయక్, బండి మధుసూదన్ రావు, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, అధికారులు రాష్ట్ర మార్కెటింగ్ అదనపు సంచాలకులు లక్ష్మణుడు, ప్రాంతీయ సంచాలకులు మల్లేశం, జిల్లా మార్కెటింగ్ అధికారి రియాజ్, ఎస్ ఈ లక్ష్మణ్ గౌడ్, డిఈ రవీందర్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చిలుక నరసింహ రెడ్డి, హర్ష, విజయ్, మురళీ పాల్గొన్నారు.

## రానున్న రోజుల్లో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి శ్రీకారం

### ఎమ్మార్పీఎస్ మేడిపల్లి మండల కమిటీ ఎన్నిక



విశ్వంభర, మేడిపల్లి: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల నిర్మాణ కమిటీ ఇంచార్జి జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జి నక్క సతీష్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సంఘం భవనంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు దుమల గంగారాం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్ మాదిగ హాజరై మాట్లాడుతూ మాన్యశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలో జరిగినటువంటి ఉమ్మడిగా జిల్లా సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయంలో భాగంగా రానున్న రోజుల్లో ఎమ్మార్పీఎస్ ని బలోపేతం చేసి మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికి మేడిపల్లి మండల పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల అధ్యక్షునిగా చెప్యాల రాజేష్, గౌరవాధ్యక్షులుగా ధోనిపాల శంకర్, అధికార ప్రతినిధిగా చిట్యాల రాజేందర్, ఉపాధ్యక్షులుగా పోడేటి సామ్యూల్, ప్రధాన కార్యదర్శిగా మకిలి సురేష్, సంయుక్త కార్యదర్శిగా దుమ్మ శ్రీనివాస్, ఎంఎస్పీ మండల ఇన్చార్జిగా అంతడుపుల విజయ్ కుమార్ తో 10మంది సభ్యులతో కమిటీని ఎన్నుకొని నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్, పాల్గొన్నారు. వీరితోపాటు పాలెపు రమేష్, మాకిలి ఆనంద్, ధోని పాల రాకేష్, ఈదుల ప్రణయ్, పాలెపు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ వ్యవస్థ ఇక నిలబడదు

- త్వరలోనే కూలిపోతుందని చెపుతున్న అధ్యయనాలు
- సేకరణ నన్నపురాజ్ రవిరాజ్

**అందుకు గల కారణాలు:** అతి తెలివి, గర్వము, డబ్బులు ఉన్నాయనే అహంకారం. చిన్న తప్పులను కూడా భరించలేని అసహనం. ఓర్పు లేకపోవడం. పిల్లలు, పెద్దలు కూర్చొని మనస్పూర్తిగా మాట్లాడుకోలేకపోవడం. ఎక్కువ సమయం టీవీ, ఫోన్లు, ఇతర ఇంటర్ నెట్ కార్యక్రమాలలో మునిగిపోవడం. (ఎక్కడో ఉన్న సినిమా హీరో, హీరోయిన్లు ఏం తిన్నారో, ఏం చేస్తున్నారో చెప్పగలరు కానీ, ఇంట్లో ఏం జరుగుతుందో తెలియదు). చిన్న విషయాలకు అలిగి, స్వంత వారితో కూడా దూరంగా ఉండటం. ఎవరో ఒకరి నోటి దురుసుతనం వల్ల, కోపం వల్ల కుటుంబం అంతా చెదిరిపోవడం. ఆర్థిక విషయాలలో ఇంటి పెద్దల సలహా తీసుకోకపోవడం. భార్యాభర్తలు, తలితండ్రులు తరుచు గొడవలు పడుతుండడంతో పిల్లలు పెళ్లి అంటే భయం కలుగుతుంది. పెళ్లి వద్దనుకునే స్థితికి వచ్చేశారు. మనిషికి మరో మనిషంటే గిట్టనితనం. పెత్తనం కోసం పోరాటం. ఒంటరితనం ఇష్టపడుతున్నారు. మధ్యవర్తిత్వం నడిపేవారు లేరు. ఎవరిష్టానికి వారన్నారు. మంచి చెప్పినా నచ్చటం లేదు. కుటుంబ నిర్వహణ అనేది గొప్ప కళ, అది తెలియకపోవడం మరో కారణం. మానవ సంబంధాలు, సున్నితత్వం మరచిపోయి, మొరటు వ్యవహారం వచ్చేసింది. భార్యాభర్తలు కలిసి కుటుంబాన్ని నడపడం మర్చిపోయారు. "నేను", "నేనే", " నేను చెపితే చేయాలి" అనే ధోరణి ప్రబలిపోయింది. సోషల్ మీడియాలో జరిగిందే నిజం, ఇంట్లో జరిగేది ఒక డ్రామా అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. ఎవరైనా మరణిస్తే ఒక ఆకర్షణీయమైన మెసేజ్ పెట్టేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇండ్లకు వెళ్లి పలకరించడం లేదు. మోయడానికి కూడా నలుగురు వచ్చే పరిస్థితి లేదు. ప్రజలంతా ఎవరికి వారే అన్నట్లు, నిర్లిప్తంగా ఉండిపోతున్నారు. ప్రక్కనే గొడవలు అవుతున్నా చూస్తూ వెళుతున్నారు తప్ప, ఆపే ప్రయత్నం చేయని పరిస్థితి. ఇదే పరిస్థితి కొనసాగితే, అతి త్వరలో కుటుంబ వ్యవస్థే కాదు, అసలు మానవ సంబంధాలు కూడా తెగిపోతాయి అనడం అతిశయోక్తి కాదు...

## ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం,

# వాటర్, శానిటేషన్ సమావేశం



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో శుక్రవారం డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు అధ్యక్షతన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం, వాటర్, శానిటేషన్, సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి వాటర్ శానిటేషన్ మిషన్ సమావేశం నిర్వహించడం జరిగిందని, జిల్లాలోని గ్రామపంచాయతీలు, అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల వినియోగించుకోవాలని, ప్రతి గ్రామపంచాయతీ నుండి మరుగుదొడ్ల నిర్వహణలో ఉన్న ఉత్తమ టాయిలెట్స్ ను గుర్తించి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను డిసెంబర్ 10 వరకు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, మన మరుగుదొడ్లు- మన ఆత్మగౌరవం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో ఉత్తమ సానిటేషన్ వర్కర్లను గుర్తించి సన్మానించడం జరిగింది. నూతనంగా మరుగుదొడ్లు నిర్మించుకునే వారికి అనుమతి పత్రాలను మంజూరు చేయడం జరిగింది. అనంతరం మరుగుదొడ్ల నిర్వహణ పరిశుభ్రత పై ప్రత్యేక వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, డీపీఓ హరిప్రసాద్, డీ ఆర్ డీ ఓ, ఎస్బీఎం కన్సల్టెంట్ శ్రావణ్, రవికుమార్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన మోడల్ విద్యార్థులు

విశ్వంభర, డిండి: డిండి మండల కేంద్రంలో స్థానిక తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కె.రాఘవి, ఎస్ .శ్రేష్ట, బి.అభినయశ్రీ, ఈ నెల 1న హాలియా లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పాల్గొని గెలుపొంది రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23,24,25 తేదిలలో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ నిర్వహించే పోటీలలో పాల్గొననున్నారు అని కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు,నారాయణ రెడ్డి, శ్యాం సుందర్,బిక్షయ్య, సుశీల, రమాదేవి, వ్యాయామ, ఉపాధ్యాయుడు,ఏ.రవి,సోమయ్య, కృష్ణ, బాలు, రవి, శ్రీను, జ్యోతి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## సిజేరియన్లు వద్దు నార్మల్ డెలివరీలే ముద్దు

### ఎంపీడీవో కుసుమ మాధురి, ప్రత్యేక అధికారి ఆదిలక్ష్మి



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాదిరి, ప్రత్యేక అధికారి ఆదిలక్ష్మి ఆమనగల్లు మున్సిపాలిటీలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తనిఖీలు చేపట్టారు. మొదటగా సుర సముద్రం చెరువులో చేపలు వదిలారు అనంతరం స్థానిక పీ హెచ్ సీ ని సందర్శించారు. వైద్యులు ఆక్సిజన్ సిలిండర్స్ రీఫిలింగ్,నేబలైజర్స్, పల్స్ అక్టోమీటర్స్, సమకూర్చాలని కోరగా అవసరమైన ఫండ్ ను హాస్పిటల్ డెవలప్మెంట్ అథారిటీ ఫండ్ నుంచి ప్రత్యేక అధికారి మంజూరు చేశారు. అనంతరం మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ఎక్కువగా తేమ లేకుండా వడ్లు తీసుకురావాలని రైతులకు సూచించి గన్ని బ్యాగులు, మ్యాట్లు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో మెడికల్ అధికారులు ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తల తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. మహిళా శిశు సంక్షేమం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు సిజేరియన్ లేకుండా నార్మల్ డెలివరీ అయ్యేటట్టు చూడాలని ఆంటీబయాటిక్స్ వాడకుండా రోగులకు సంబంధించి సంబంధించిన పలు విషయాలపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు మంజుల, పరీక్షిత్, తిరుపతిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరి రెడ్డి వర్ధంతి



విశ్వంభర, ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరి రెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం నవాబు పరిపాలనపై తిరుగుబాటు జెండా ఎగరవేశారని విశాల్ మాట తూటలతో అగ్నిజ్వాలలై ఎగిసిపడిన యుద్ధ కిరీటం గుర్రం యాదగిరి రెడ్డి అని అట్లాస్ సైకిల్ నుంచి ఆరంభమైన ఆయన జీవితం అసెంబ్లీ మెట్ల దాకా కొనసాగిందని నిజాయితీకి నిలువుటద్దమై జనాల మధ్యలో జననాయకుడిగా ఎదిగారు గుర్రం యాదగిరి రెడ్డి. ఎరుపుతోనే మెరుపు ఉంది పోరాడే సాహస సమరశక్తి ఉంది అని గుర్రం భాషించే వాడు. గమనం గమ్యం ఘర్షణ కిరణాలను అధిగమించి నిజాంపై నిప్పులు చెరిగి, కాసిం రజిని దుర్మార్గ పాలనను ఎదిరించి ఎర్రని జెండా ఎగరవేశారు. సుద్దాల యుద్ధయోధుడు గుర్రం యాదగిరి రెడ్డి ప్రజలల్లో అగ్నికేరటమై నిలిచాడు. ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టాసుఖాలను గమన్నిస్తూ ఆదర్శంగా జీవనాన్ని గడుపుతూ ఎలాంటి ఆస్తులు పాస్తులు సంపాదించుకోకుండా నేటి తరానికి మార్గదర్శిగా నిలిచారు. 13వ ఏటా తెలంగాణ సాయుధ పోరాటానికి ఆకర్షితుడై బాల సంఘంలో చేరారు. 75 ఏళ్ల పాటు కమ్యూనిస్టు పార్టీలో వివిధ పదవులు పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు తెలుగు దేశం పార్టీ మిత్రపక్షంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు యాదగిరి రెడ్డి. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారు. నియోజకవర్గం పరిధిలో సాగు,తాగునీరు విద్యుత్, గ్రామీణ రహదారులు వంటి అభివృద్ధికి కార్యక్రమాలు చేసి ప్రజాదారణ పొందాడు. రాష్ట్రంలో పత్తి రైతుల కొరకు అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్మించి రాష్ట్రంలోనే పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం పై ఒత్తిడి తేవడానికి ప్రయత్నం చేశారు. అప్పట్లోనే 1952 సంవత్సరములో స్థానికుడైన జాలిగామ శేషగిరిరావుపై జాకీర్దారుపై పోరాటాలు చేసి ఆనాడే 560 ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత గుర్రం యాదగిరి రెడ్డికి దక్కింది. స్వగ్రామంలో సుద్దాలలో పశువుల కొరకు వైద్యం చేసేందుకు వైద్యశాలను, విద్యుత్ సబ్ స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఏర్పాటు కు పాటుపడ్డాడు. మోత్కూర్ బికేరు వాగుపై వంతెన అమలు కొరకు అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించారు. మూసినదిపై వంతెన నిర్మాణం ఈయన హయాంలోనే నిర్మించడం జరిగింది. నియోజకవర్గం పరిధిలో అనేక గ్రామాలలో పేదలకు సొంత ఇల్లు నిర్మాణం రహదారుల నిర్మాణం చెరువులను విద్యాసంస్థలను అభివృద్ధి చేశారు. ఆయన చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు ఈ నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కొరకు ప్రజా సంఘాల అభివృద్ధి కొరకు నిత్యం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉండేవాడు. వారు 22 నవంబర్ 2020 తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన నిస్వార్థ సేవకుడు ప్రజానాయకుడు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ మండల పార్టీ కార్యదర్శి గాదె గాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, సీనియర్ నాయకులు బీరకాయల మల్లేష్, జీలకపల్లి గణేష్, బీరకాయల మధు, మారబోయిన దేవరాజు, మారబోయిన బాల నర్సయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి విజేతలు



విశ్వంభర, డిండి: డిండి మండల కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెక్ ముఖి మండల స్థాయి పోటీలు జడ్పిహెచ్ఎస్ డిండి ప్రాజెక్టు మండలం గుండ్లపల్లి యందు నిర్వహించడం జరిగింది. దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాలు ప్రధానోపాధ్యాయులు పాపి రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. ఇందులో జడ్పీ స్థాయిలో విజేతలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. మరియు రెసిడెన్సియల్ స్థాయిలో, టీజీ ఎంఎస్ విద్యార్థులు,హర్ష వర్ధన్ రెడ్డి, సిరి,భగవంత్ జిల్లాకు ఎంపిక కావడం జరిగింది. ఎంపికైన విద్యార్థులందరికీఅభినందనలు. యాదయ్య ఆంగ్లం ఉపాధ్యాయులు బహుమతులను డొనేట్ చేశారు ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని , అదేవిధంగా దేశాన్ని సైన్స్ వైపు, ప్రగతి వైపు నడిపించాలని, మూఢనమ్మకాలను నమ్మకూడదని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు పాపిరెడ్డి,యాదయ్య, ఆంజనేయులు, సత్యనారాయణ, సుజాత, అనిత,చెన్నయ్య, సందీప్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వెల్త్తీ, హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్

- ఇదే 'స్వర్ణాంధ్ర 2047' నినాదం
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



విశ్వంభర, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభ లో 'స్వర్ణాంధ్ర2047' డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'వెల్దీ, హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.
"వైసీపీ ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు.
1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి.
2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు"అని చంద్రబాబు అన్నారు.



## షర్మిలపై అసత్య ప్రచారం చేసేదెవరో ప్రజలందరికీ తెలుసు: బాలకృష్ణ

**గన్నవరం** : అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆ సమయంలో మీడియాతో మాట్లాడిన ఆయన... ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై తప్పుడు ప్రచారం చేసేదెవరో ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని వారే పట్టించుకోనప్పుడు నేను ఎందుకు పట్టించుకోవాలంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.
ఇదిలా ఉంటే... నటుడు ప్రభాస్‌తో తనకు ఎలాంటి రిలేషన్ లేదని తాజాగా మరోసారి షర్మిల స్పష్టం చేశారు. తన పిల్లలపై ప్రమాణపూర్వకంగా ప్రభాస్ ఎవరో తనకు తెలియదని అన్నారు. తనపై బాలకృష్ణ ఇంటి నుంచే తప్పుడు ప్రచారం జరిగిందని జగన్ చెప్పారని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
అలాగే, వైసీపీ వాళ్లు అసెంబ్లీకి హాజరు కాకుండా మనుషులను పెట్టుకున్నారంటూ బాలయ్య ఎద్దేవా చేశారు. ఇవాళ కూడా వాళ్లు అసెంబ్లీకి రాకుంటే బాగుంటుందని తెలిపారు.

## తిరుమలలో కల్తీ నెయ్యి కేసు.. సిట్ దర్యాప్తు ప్రారంభం



**విశ్వంభర, తిరుపతి:** తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ బృందం దర్యాప్తు ప్రారంభించింది. తిరుపతి, తిరుమలలో పర్యటించనున్న ఈ బృందం పూర్తిస్థాయి విచారణ చేపట్టనుంది. సిట్ కోసం తిరుపతి భూదేవి కాంప్లెక్స్‌లో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేశారు. సిట్ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి విచారణ చేయనున్నారు. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌తో పాటు తిరుమలలో లడ్డూ పోటు, విక్రయ కేంద్రాలు, ముడిసరకు పరిశీలించనున్నారు. లడ్డూ తయారీలో పాల్గొనే శ్రీవైష్ణవులను ప్రశ్నించే అవకాశముందని సమాచారం. విచారణ అనంతరం సీబీఐ డైరెక్టర్‌కు సిట్ బృందం నివేదిక ఇవ్వనుంది.

## మీరు క్షమార్హులు కారు

### పోసానిపై టాలీవుడ్ నిర్మాత సంచలన వ్యాఖ్యలు



**అమరావతి:** ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇకపై ఏ పార్టీని తిట్టనని, ఏ పార్టీని పొగడనని ఆయన అన్నారు. తన కుటుంబానికి తగిన సమయం ఇవ్వలేకపోతున్నానని... అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. మరోవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులపై గతంలో పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ కారణంగా ఆయనపై పలు చోట్ల పోలీస్ కేసులు నమోదయ్యాయి. ఆయనను అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఇంతలోనే పోసాని నుంచి కీలక ప్రకటన వెలువడటం గమనార్హం.
మరోవైపు పోసాని నిర్ణయంపై టాలీవుడ్ నిర్మాత ఎస్కేఎన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా అంటూ మీరు నటించే ముందు... తమ అభిమాన నాయకుడి గురించి, వారి ఇంట్లోని పసి పిల్లల గురించి మాట్లాడిన సంస్కార హీనమైన, నీచమైన మాటలకు చింతిస్తున్నానని లేదా క్షమించండని అడిగి ఉంటే... మీ మాటలను నమ్మాలనిపించేదని అన్నారు. మీరేదో పొరపాటున ఒకసారి మాట్లాడిన వ్యక్తి కాదని మండిపడ్డారు. ఎన్నోసార్లు చాలా నీచంగా మాట్లాడారని దుయ్యబట్టారు.
అభిమానుల మనసును మీరు ఎంతో బాధ పెట్టారని ఎస్కేఎన్ అన్నారు. ఛీ ఇవేం మాటలు అంటూ అందరూ చెవులు మూసుకునేలా చేశారని మండిపడ్డారు. ఎవరి కుటుంబాలైనా, ఎవరి పిల్లలైనా ఒక్కటేనని చెప్పారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని... కానీ వ్యక్తిగతంగా దిగజారిపోయి కుటుంబాల మీద కామెంట్స్ చేసిన మీలాంటి వాళ్లు ఏ మాత్రం క్షమార్హులు కారని అన్నారు.

## ఆలింగనం చేసుకున్న పవన్ కల్యాణ్, బొత్స

**అమరావతి :** ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలో ఈరోజు ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆలింగనం చేసుకున్నారు. అసెంబ్లీ వెలుపల కారు ఎక్కేందుకు పవన్ వస్తుండటాన్ని చూసిన వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పక్కకు వెళ్లిపోయారు.
అదే సమయంలో బొత్స... పవన్ కు నమస్కారం చేశారు. బొత్స స్పందనను చూసిన పవన్ ఆయనకు ఎదురెళ్లారు. బొత్స కూడా పవన్ వద్దకు వచ్చి ఆయనను ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ మర్యాదపూర్వకంగా కరచాలనం చేసుకుని వెళ్లిపోయారు.



## ఏపీకి రావాల్సిన ప్రాజెక్టులపై చర్చించండి

### ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం



**విశ్వంభర, అమరావతి:** ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎంపీలతో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ భేటీ ముగిసింది. ఏపీకి రావాల్సిన ప్రాజెక్టులపై కేంద్రంతో చర్చిస్తామని ఎంపీలు స్పష్టం చేశారు. చంద్రబాబు ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. 2047 విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని ఎంపీలు తేల్చి చెప్పారు. 2047 విజన్ డాక్యుమెంట్‌కు కేంద్ర సహకారం అవసరమన్నారు. పార్లమెంట్ సమావేశాలను ఒక వేదికగా వాడుకొని ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో జగన్ ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారని మండిపడ్డారు. ఏపీకి రావాల్సిన పెట్టుబడులు జగన్ చర్యల వల్ల పక్క రాష్ట్రాలకు వెళ్లాయని పేర్కొన్నారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ తీసుకొస్తామని తెలిపారు.
ఏపీకి పెట్టుబడులు ఎలా తీసుకురావాలనేదానిపై ఒక డాక్యుమెంట్ తో ముందుకు వెళ్తున్నామన్నారు. సెకి ఒప్పందంపై అన్ని కోణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని వివరించారు. న్యాయనిపుణుల సలహాకు అనుగుణంగా ప్రభుత్వం వెళ్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విచారణ చేపట్టవచ్చా అనే కోణాన్ని సీఎం పరిశీలిస్తున్నారని నేతలు వెల్లడించారు. ఏపీ ఎంత అప్పుల ఊబిలో ఉంది అనేది గత సమావేశాల్లో పార్లమెంట్ దృష్టికి తీసుకువెళ్లామని పలువురు నేతలు స్పష్టంచేశారు. ఏపీకి ముఖ్యమైన ప్రాజెక్టు పోలవరమని.. పోలవరానికి నిధులు తీసుకొచ్చి ముందుకు తీసుకు వెళ్తున్నామన్నారు. అమరావతిని ముందుకు తీసుకువెళ్తామని తేల్చి చెప్పారు. కూటమికి ఉన్న 21మంది ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో సమయానుకూలంగా స్పందిస్తామన్నారు.

## 'వారు వెంటనే క్షమాపణ చెప్పాలి'

- ఖర్గే, రాహుల్‌కు రూ.100కోట్ల పరువునష్టం నోటీసులు
- పంపిన బీజేపీ నేత వినోద్ తావ్డే



**ఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , అగ్రనేత రాహుల్ గాంధీకి శుక్రవారం రూ.100 కోట్ల పరువునష్టం నోటీసులు అందాయి. తనపై చేసిన ఆరోపణలకు గానూ బీజేపీ నేత వినోద్ తావ్డే వాటిని పంపారు. ఆ నోటీసుల్లో వారితో పాటు సుప్రియా శ్రీనేట్ పేరు కూడా ఉంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని గంటల ముందు అధికార, ప్రతిపక్షాల మధ్య హైడ్రామా నడిచిన సంగతి తెలిసిందే. పాల్‌ఘర్ జిల్లాలోని విరార్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్‌లో భాజపా నేతలు డబ్బులు పంచుతున్నారని అప్పుడు ప్రాంతీయ బహుజన్ వికాస్ అఘాడీ పార్టీ ఆరోపించింది. నాలసోపరా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి రాజన్ నాయక్‌కు ఓటు వేయాలని కోరుతూ బీజేపీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి వినోద్ తావ్డే , మరికొందరు నాయకులు ప్రజలకు డబ్బు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొంది.దానికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. "ఎన్నికలను ప్రభావితం చేయడానికి బీజేపీ డబ్బులు పంచుతోంది. పార్టీ అధినేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. వీరిపై ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలి" అంటూ రాసుకొచ్చింది. అయితే ఆరోపణలను బీజేపీ, తావ్డే ఖండించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేతలకు నేడు పరువునష్టం నోటీసులు అందాయి. "ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను.. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అలాంటి చర్యలకు ఎన్నడూ పాల్పడలేదు. ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నేతలు నా పరువుకు భంగం కలిగించాలని అనుకున్నారు. పార్టీని దెబ్బ తీయాలనుకున్నారు. వారు నాకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి. లేకపోతే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాలి. అందుకోసమే ఈ నోటీసులు పంపాను" అని తావ్డే మీడియాకు వెల్లడించారు.

## 8 కీలక బిల్లులకు ఏపీ శాసనమండలి ఆమోదం




**విశ్వంభర, అమరావతి:** ఇప్పటికే శాసనసభలో ఆమోదం పొందిన 8 కీలక బిల్లులకు శుక్రవారం శాసనమండలి ఆమోదం తెలిపింది. విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని కేంద్ర పౌరవిమానయాన శాఖను కోరుతూ మండలి తీర్మానం చేసింది. కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన అనంతరం శాసనమండలి నిరవధిక వాయిదా పడింది.

### మండలిలో ఆమోదం పొందిన బిల్లులివే..


* చెత్తపన్ను విధిస్తూ గత ప్రభుత్వం చేసిన చట్టం రద్దు.
* లోకాయుక్త సవరణ బిల్లు 2024
* గూడ్స్ అండ్ సర్వీసెస్ సవరణ బిల్లు 2024
* ఏపీలో సహజవాయు వినియోగంపై జీఎస్టీ పన్నును తగ్గిస్తూ జీఎస్టీ సవరణ బిల్లు
* ఏపీ హిందూ ధార్మిక, మత సంస్థలు దేవాదాయ చట్ట సవరణ బిల్లు
* ఏపీ మౌలిక సదుపాయాలు న్యాయపరమైన పారదర్శకత జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు బిల్లు
* ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 2024 రద్దు
* పీడీ యాక్ట్ సవరణ బిల్లు 2024

## గుంటూరులో తుపాకీ మిస్‌ఫైర్..

### ఏఆర్ కానిస్టేబుల్ మృతి

**గుంటూరు :** తుపాకీ మిస్‌ఫైర్ అయి ఏఆర్ కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన గుంటూరులో శుక్రవారం చోటు చేసుకుంది. తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. ఇది గమనించి వెంటనే స్పందించిన తోటి సిబ్బంది శ్రీనివాస్‌ను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు.

## 'ప్రభాస్ తో అఫైర్' ప్రచారంపై మరోసారి క్లారిటీ ఇచ్చిన షర్మిల




**అమరావతి :** టాలీవుడ్ హీరో ప్రభాస్ తో తనకు ఎలాంటి సంబంధం లేదని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల మరోసారి స్పష్టం చేశారు. ఆయనతో తనకు సంబంధం ఉందంటూ అప్పట్లో ప్రచారం జరిగితే తన పిల్లలపై ఒట్టు వేసి చెప్పానని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా ఇదే చెబుతున్నానని వివరించారు. తనపై ఈ దుష్ప్రచారం చేసిన వీడియోలు హీరో బాలకృష్ణ బిల్డింగ్ నుంచే సోషల్ మీడియాలో అప్ లోడ్ అయినట్లు గతంలో జగన్ ఆరోపించారని గుర్తుచేశారు. మరి చెల్లెలిపై ప్రేమ ఉంటే ఐదేళ్లు ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు ఏం చర్యలు తీసుకున్నారని జగన్ ను షర్మిల నిలదీశారు.
తనపై దుష్ప్రచారం జరిగిందని, అది బాలకృష్ణ ఇంటి నుంచే జరిగిందని తెలిసిన తర్వాత ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. అధికారం చేతిలో ఉన్నప్పటికీ బాలకృష్ణపై విచారణ ఎందుకు జరిపించలేదని షర్మిల అన్నారు. చివరకు తన సొంత చెల్లెలిపై దుష్ప్రచారం చేస్తున్న వీడియో కూడా తన ప్రయోజనాల కోసం వాడుకున్నాడంటూ జగన్ పై షర్మిల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈమేరకు హైదరాబాద్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఈ వ్యాఖ్యలు చేశారు.

## శ్రీశైలంలో భక్తులకు ఉచిత బస్సు ప్రారంభం..!

**విశ్వంభర, శ్రీశైలం:** శ్రీశైల మహాక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం శుక్రవారం సాయంత్రం నుంచి ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభించింది. వారాంతపు సెలవుల తోపాటు పర్వ దినాల్లో అధిక సంఖ్యలో శ్రీశైల క్షేత్రానికి భక్తులు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థమై వారాంతపు రోజుల్లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం రెండు గంటల వరకూ గణేశ్ సదన్ నుంచి అన్నప్రసాద భవనం మీదుగా క్యూ కాంప్లెక్స్ వరకూ భక్తులు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఈ ఉచిత బస్సు సర్వీసు ప్రారంభోత్సవంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం నరసింహారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఐ/సీ) పీ చంద్రశేఖర శర్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఢిల్లీ ప్రవేశ మార్గాలపై నిఘా ఉంచండి

### వాయుకాలుష్య తీవ్రత కొనసాగుతూనే ఉంది

### కాలుష్య నిరోధక నాలుగో దశ చర్యలు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయి.. వెల్లడించిన సుప్రీం

**ఢిల్లీ:** దేశరాజధానిలో వాయుకాలుష్య తీవ్రత కొనసాగుతూనే ఉంది. దీంతో కాలుష్య నిరోధక నాలుగో దశ చర్యలు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని సుప్రీం కోర్టు వెల్లడించింది. నిత్యావసరేతర వస్తువులు తీసుకొచ్చే ట్రక్కులు నగరంలోకి ప్రవేశించకుండా పోలీసు బలగాలను మోహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేయాలంటే 113 ప్రవేశ మార్గాల వద్ద నిఘా తప్పనిసరిగా ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. జీఆర్ఏపీIV ఆంక్షలు సడలించాలా? వద్దా? అన్న విషయంపై వచ్చే వారం సమీక్షిస్తామని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం తెలిపింది.

## భారత స్కార్పియన్ శ్రేణి జలాంతర్గామిని ఢీకొన్న చేపల వేట నౌక..!



**ఢిల్లీ:** భారత నౌకాదళానికి చెందిన స్కార్పియన్ శ్రేణి జలాంతర్గామి భారీ ప్రమాదానికి గురైంది. గోవా తీరానికి 70 నాటికల్ మైళ్ల దూరంలో నౌకాదళ సబ్‌మెరైన్‌ను చేపల వేట పడవ మారథోమా ఢీకొంది. ఈ విషయాన్ని శుక్రవారం రక్షణశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో పడవలో 13 మంది ఉన్నారు. వీరిలో 11 మందిని రక్షించినట్లు భారత నౌకాదళం పేర్కొంది. మరో ఇద్దరు ఆచూకీ గల్లంతైంది. నౌకాదళ ప్రతినిధి ఈ విషయాన్ని వెల్లడించారు. వీరి కోసం కూడా గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన అదనపు సామగ్రిని రప్పించారు. ఈ ప్రాంతం మొత్తాన్ని కోస్ట్‌గార్డ్ ఆధీనంలోకి తీసుకొని.. నౌకల మార్గాలను మళ్లించింది. జలాంతర్గామికి ఏమేరకు నష్టం జరిగిందనే విషయం వెల్లడి కాలేదు.గోవా వద్ద ప్రమాదానికి గురైంది స్కార్పియన్ శ్రేణికి చెందిన అత్యాధునిక జలాంతర్గామిగా భావిస్తున్నారు. నౌకాదళంలో వివిధ రకాల మిషన్లను చేపట్టే సామర్థ్యం దీని సొంతం. యాంటీ సర్ఫేస్ వార్ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ కోసం దీనిని తయారు చేశారు. అత్యాధునిక శబ్ద నియంత్రణ టెక్నాలజీతో దీనిని తయారు చేశారు.

## సీఎం సొంతూర్లో దారుణ పరిస్థితికి నిదర్శనమిది: హరీశ్‌రావు

**నాగర్‌కర్నూల్ :** కొండారెడ్డి పల్లె గ్రామ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు పాల్పడడం కలచివేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత గ్రామంలో ఉన్న దారుణ పరిస్థితికి సాయిరెడ్డి ఆత్మహత్య నిదర్శనం అని ఆయన అన్నారు.
రేవంత్.. నీ సొంత గ్రామ మాజీ సర్పంచ్ ఆత్మహత్య ఉసిగొల్పిన వాళ్లపై చట్టరీత్యా చర్యలకు సిద్ధమా..? మీ అన్నదమ్ముళ్ల అరాచకాలు శృతి మించాయనడానికి ఇది నిదర్శనం కాదా..? సాయిరెడ్డి మృతికి కారణమైన మీ అన్నదమ్ముళ్లపై చట్టరీత్యా హత్యా నేరం పెట్టాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.





## అదరగొట్టిన తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి

**విశ్వంభర, క్రిడావిభాగం :** ఆస్ట్రేలియా పర్యటనలో అరంగేట్రం ఏ క్రికెటర్‌కు అయినా మర్చిపోలేని అనుభవం. పేస్‌తో వణికించే కంగారూ బౌలింగ్ దళాన్ని ఎదుర్కొని రెండంకెల స్కోర్ చేసినా సంతృప్తి చెందాల్సిందే. అలాంటిది జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులో నిలబడడం.. ప్రపంచ స్థాయి పేస్ దళాన్ని కకావికలం చేస్తూ పరుగులు సాధించడమంటే మాటలు కాదు. కానీ, తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి అరంగేట్రం టెస్టులో.. అది కూడా ఆసీస్ గడ్డపై ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడి టీమిండియా టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఒకప్పుడు వీవీఎస్ లక్ష్మణ్ కంగారూ నేలపై కదం తొక్కితే.. ఇప్పుడు నేనున్నానంటూ నితీశ్ రెచ్చిపోయి ఆడాడు. కాన్పూర్ వేదికగా టీ20ల్లో అరంగేట్రం చేసిన తెలుగు కుర్రాడు నితీశ్‌కు పెర్త్ టెస్టులో అనూహ్యంగా చోటు దక్కింది. పేస్ ఆల్‌రౌండర్ అయిన అతడు తన రాకను ఘనంగా చాటుతూ 41 పరుగుల విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ధాటికి స్టార్ ఆటగాళ్లు డగౌట్ చేరిన వేళ క్రీజులోకి వచ్చిన నితీశ్ పట్టుదలతో ఆకట్టుకున్నాడు. రిషభ్ పంత్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. జట్టు స్కోర్ 150 వచ్చేంత వరకూ కంగారూ పేసర్లను దీటుగా ఎదుర్కొన్న అతడు కమిన్స్ ఓవర్లో చివరి వికెట్‌గా ఔటయ్యాడు. నితీశ్ గనుక పోరాడకుంటే టీమిండియా అంతకంటే తక్కువకే ఆలౌటయ్యేది. స్క్వాడ్‌లోని పలువురిని కాదని తనకు అవకాశం ఇచ్చిన కోచ్, కెప్టెన్‌ల నమ్మకాన్ని నితీశ్ నిజం చేశాడు.

## బీహార్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్




**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరుగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌తో పాటు పారా గేమ్స్‌కు బీహార్ ఆతిథ్యమివ్వనుంది. ఈ విషయాన్ని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఒలింపిక్స్ తరహాలో యూత్‌గేమ్స్ ముగిసిన 1015 రోజుల్లో పారాగేమ్స్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది పారా గేమ్స్‌కు బీహార్ వేదికైంది. దీనికి తోడు ఈ మధ్య కాలంలో బీహార్.. పలు ప్రతిష్ఠాత్మక క్రీడా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహిస్తున్నది. రాజ్‌గిర్ వేదికగా తాజాగా ముగిసిన ఏషియన్ హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత మహిళల జట్టు విజేతగా నిలిచింది. ప్రధాన స్పోర్ట్స్ ఈవెంట్లను నిర్వహించడంలో ఈ మధ్య కాలంలో బీహార్ కీలకంగా వ్యవహరిస్తుందని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా అన్నారు.

## సోనీ టీవీకి ఆసియా కప్ మీడియా హక్కులు




**విశ్వంభర, క్రిడావిభాగం :** ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ మీడియా హక్కులను సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా సొంతం చేసుకుంది. ఎనిమిదేండ్ల కాలానికి సోనీ టీవీ మీడియా హక్కులు దక్కించుకుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆసియా క్రికెట్ కౌన్సిల్ వెల్లడించింది. 2024 నుంచి 2031 వరకూ సోనీ నెట్‌వర్క్ ఆసియా కప్ ప్రసార మాధ్యమంగా వ్యవహరించనుందని ఏసీసీ తెలిపింది. తద్వారా గతంలో కంటే 70 శాతం అదనపు ఆదాయం ఏసీసీకి సమకూరనుంది.

ఆసియా కప్ మీడియా హక్కుల కోసం దుబాయ్‌లో గతవారం జరిగిన బిడ్డింగ్ ప్రక్రియలో జియో స్టార్, సోనీ నెట్‌వర్క్‌లు పోటీపడ్డాయి. చివరకు జియో స్టార్ వైదొలిగింది. దాంతో, సోనీ నెట్‌వర్క్ మాత్రమే బిడ్డింగ్‌లో నిలిచింది. రూ.14 వేల కోట్ల కనీస ధరకు ఆసియా కప్ మీడియా హక్కుల్ని సోనీ సంస్థ హస్తగతం చేసుకుంది.

'పురుషుల, మహిళల ఆసియా కప్ మ్యాచులతో పాటు పురుషుల, మహిళల అండర్ 19 ఆసియా కప్ ప్రసార హక్కుల్నీ సోనీ టీవీకి కట్టబెట్టాం. మహిళల, పురుషుల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ పోటీలు కూడా సోనీ నెట్‌వర్క్‌లో టెలికాస్ట్ కానున్నాయి. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చరిత్రలో ఈ ఒప్పందం ఓ మైలురాయి. ఆసియా దేశాల్లోని యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీసేందుకు ఈ టోర్నీ ఎంతగానో ఉపయోగపడుతోంది. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా మా మీడియా భాగస్వామిగా మారడంతో అభిమానులకు ప్రపంచస్థాయి మ్యాచ్‌ల అనుభూతిని కలిగిస్తామనే నమ్మకం మాకుంది' అని ఆసియా క్రికెట్ కౌన్సిల్ వివరించింది.

# ఆసీస్ టాపార్డర్‌ను బెంబేలెత్తించిన బుమ్రా





**విశ్వంభర, క్రిడావిభాగం :** పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా నిప్పులు చెరుగుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ టాపార్డర్‌ను బెంబేలెత్తించాడు. ఈ క్రమంలోనే ఆసీస్ స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (0)ను బుమ్రా తొలి బంతికే ఔట్ చేసి, అతడిని పెవిలియన్ పంపాడు. దీంతో బుమ్రా సౌతాఫ్రికా లెజెండరీ బౌలర్ డెల్ స్టెయిన్ రికార్డును సమం చేశాడు. టెస్టుల్లో స్టీవ్ స్మిత్‌ను గోల్డెన్ (తొలి బంతికే ఔట్ అవ్వడం) డకౌట్ చేసిన రెండో బౌలర్‌గా అరుదైన ఘనత సాధించాడు.

ఇప్పటివరకు డెల్ స్టెయిన్ మాత్రమే స్మిత్‌ను గోల్డెన్ డకౌట్ చేశాడు. గెబెర్హా వేదికగా 2014లో ఆసీస్ సౌతాఫ్రికా మ్యాచ్‌లో స్మిత్ టెస్టుల్లో తొలిసారి గోల్డెన్ డకౌట్ అయ్యాడు. ఆ మ్యాచ్‌లో అతడిని స్టెయిన్ పెవిలియన్‌కు పంపాడు. అప్పట్నుంచి స్మిత్ టెస్టుల్లో ఎప్పుడు కూడా ఎదుర్కొన్న తొలి బంతికే ఔట్ అవ్వలేదు. దాదాపు ఓ దశాబ్దం తర్వాత స్మిత్‌ను బుమ్రా గోల్డెన్ డకౌట్ చేసి కెరీర్‌లో అరుదైన ఘనత అందుకున్నాడు.

కాగా, స్మిత్ సుదీర్ఘమైన తన టెస్టు కెరీర్‌లో 196 ఇన్నింగ్స్‌ల్లో బరిలో దిగగా అందులో 11సార్లు మాత్రమే పరుగులు చేయకుండా (డకౌట్) ఔట్ అయ్యాడు. అందులో ఎదుర్కొన్న తొలి బంతికే పెవిలియన్ చేరడం (గోల్డెన్ డకౌట్) ఇది రెండోసారి మాత్రమే. ఇక స్వదేశంలో స్మిత్‌కు ఇది తొలి గోల్డెన్ డకౌట్. ఇక ఈ మ్యాచ్‌లో బుమ్రా చెలరేగిపోయాడు. బుల్లెట్ లాంటి బంతులు సంధిస్తూ, తొలి నుంచే ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టాడు. ఈ క్రమంలో మూడో ఓవర్‌లోనే భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. అరంగేట్ర కుర్రాడు నథన్ స్వీనే (10 పరుగులు)ను ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేశాడు. ఆ తర్వాత ఏడో ఓవర్లో వరుసగా రెండు వికెట్లు దక్కించుకున్నాడు. నాలుగో బంతికి మరో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (8 పరుగులు)ను ఔట్ చేయగా, తర్వాతి బంతికి క్రీజులోకి వచ్చిన స్మిత్ (0)ను పెవిలియన్‌కు చేర్చాడు. ఆఖరి సెషన్‌లో బుమ్రా కెప్టెన్ కమిన్స్ (3) వికెట్ దక్కించుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసేసరికి ఆసీస్ 677 స్కోర్‌తో ఉంది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులకు ఆలౌటైంది.

# బెంగాల్‌పై తెలుగు టైటాన్స్ అద్భుత విజయం



**విశ్వంభర, క్రిడావిభాగం :** ప్రోకబడ్డీ లీగ్ సీజన్ 11లో తెలుగు టైటాన్స్ అదిరే ప్రదర్శన చేస్తోంది. విజయాల్లో మరో హ్యాట్రిక్ సాధించింది. నొయిడా వేదికగా గురువారం బెంగాల్ వారియర్స్‌తో జరిగిన ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో 3129 పాయింట్లతో నెగ్గింది. మొత్తంగా ఈ సీజన్‌లో ఆడిన 12 మ్యాచ్‌ల్లో ఎనిమిదింట్లో గెలిచి 42 పాయింట్లతో టేబుల్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. హర్యానా స్టీలర్స్ 9 విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది.

మ్యాచ్ ఆరంభం నుంచే తెలుగు టైటాన్స్ దూకుడు ప్రదర్శించింది. బెంగాల్ వారియర్స్‌ను ఒకసారి ఆలౌట్ చేసి తొలి అర్ధభాగంలో 199 తేడాతో భారీ ఆధిక్యాన్ని సాధించింది. అయితే సెకండ్ హాఫ్‌లో టైటాన్స్ అదే జోరును ప్రదర్శించలేకపోయింది. ప్రత్యర్థి రైడర్ల ముందు నిలవలేక ఒకసారి ఆలౌట్ అయ్యింది. కానీ ఫస్టాఫ్‌లో ఉన్న ఆధిక్యంతో అంతిమంగా మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

తెలుగు టైటాన్స్‌లో స్టాండ్‌బై కెప్టెన్ విజయ్ మాలిక్ 14 పాయింట్లతో సత్తాచాటాడు. గాయంతో పవన్ సెహ్రావత్ గత మూడు మ్యాచ్‌లకు దూరమైన విషయం తెలిసిందే. బెంగాల్ వారియర్స్ జట్టులో ప్రణయ్ రాణే 9 పాయింట్లు సాధించాడు. కాగా, నొయిడా వేదికగా గురువారం జరిగిన మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌పై హర్యానా స్టీలర్స్ 3226తో విజయం సాధించింది.

ఆరంభం నుంచే బెంగళూరుపై హర్యానా ఆధిపత్యం చెలాయించింది. ఫస్టాఫ్‌ను 2112తో ముగించింది. సెకండ్ హాఫ్‌లో బెంగళూరు పుంజుకున్నప్పటికీ, వాళ్ల పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. హర్యానా స్టీలర్స్‌లో వినయ్ రైడర్ 12 పాయింట్లు సాధించాడు. బెంగళూరు బుల్స్‌లో అక్షిత్ (7 పాయింట్లు) టాప్ స్కోరర్. కాగా, నొయిడా వేదికగా శుక్రవారం రాత్రి 8 గంటలకు తమిళ్ తలైవాస్ వర్సెస్ యూపీ యోధాస్, రాత్రి 9 గంటలకు జైపూర్ పింక్ పాంథర్స్ వర్సెస్ దబాంగ్ ఢిల్లీ మ్యాచ్‌లు జరగనున్నాయి.

# సెహ్వాగ్ కొడుకు డబుల్ సెంచరీ!



**విశ్వంభర, క్రిడావిభాగం :** టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ విధంసకర బ్యాటింగ్‌తో దుమ్మురేపాడు. తండ్రి తరహాలోనే దూకుడైన ఆటతో డబుల్ సెంచరీ సాధించాడు. ప్రతిష్టాత్మక అండర్ 19 క్రికెట్ టోర్నీ కూచ్ బెహార్ ట్రోఫీలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్యవీర్ సెహ్వాగ్.. మేఘాలయతో జరుగుతున్న మ్యాచ్‌లో ఈ ఫీట్ అందుకున్నాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ ఆటను గుర్తు చేసేలా 229 బంతుల్లోనే 34 ఫోర్లు, 2 సిక్సర్లతో 200 పరుగులు చేశాడు.

షిల్లాంగ్ మైదానం వేదికగా బుధవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ.. ఆర్యవీర్ విధ్వంసకర ద్విశతకంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లకు 468 పరుగులు చేసింది. ప్రస్తుతం ఢిల్లీ 208 పరుగుల ఆధిక్యంలో ఉంది. మరో ఓపెనర్ అర్ణవ్ ఎస్ బుగ్గాతో కలిసి ఆర్యవీర్ తొలి వికెట్‌కు 180 పరుగులు జోడించాడు. ఆర్యవీర్(200 బ్యాటింగ్)తో పాటు ధన్యా నక్రా(98 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లోనే ఆర్యవీర్.. వీనూ మన్కడ్ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్యవీర్ 49 పరుగులతో ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

తన బాటలోనే నడవాలని ఆర్యవీర్‌ను ఎప్పుడూ ఒత్తిడి చేయలేదని సెహ్వాగ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. తనకిష్టమైన రంగం ఎంచుకునేలా ప్రోత్సహించానని తెలిపాడు. 'నా పిల్లల ఇద్దరిలో మరో వీరేంద్ర సెహ్వాగ్‌ను చూడాలనుకోలేదు. వారు మరో విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా మహేంద్ర సింగ్ ధోనీ కావచ్చు. కానీ వారు క్రికెటర్లుగా మారాల్సిన అవసరం లేదు.

వాళ్ల కెరీర్‌ను వాళ్లు స్వేచ్ఛగా ఎంచుకోవాలి. అందుకు మేం సాధ్యమైనంత సాయం చేస్తాం. చివరకు వాళ్లు మంచి మనుషులుగా ఉండాలి. అదే మా కోరిక.'అని సెహ్వాగ్ ఓ ఇంటర్వ్యూలో తమ పిల్లల గురించి చెప్పుకొచ్చాడు.

15 ఏళ్ల తన కొడుకు ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసేందుకు తెగ కష్టపడుతున్నాడని సెహ్వాగ్ తెలిపాడు. 'కుర్రాళ్లకు ఐపీఎల్ మంచి ప్లాట్‌ఫామ్. గతంలో రంజీ ట్రోఫీ ప్రదర్శనలను ఎవరూ పెద్దగా గుర్తించేవారు కాదు. దాంతో భారత జట్టులో అవకాశాలు దక్కేవి కాదు. కానీ ఇప్పుడు ఐపీఎల్‌లో సత్తా చాటితే, నైపుణ్యాలను ప్రదర్శిస్తే వెంటనే భారత జట్టు తరఫున ఆడే అవకాశాన్ని అందుకుంటావు. ఇదంతా ఐపీఎల్ క్రెడిట్. చిన్నరాష్ట్రాలకు చెందిన పిల్లలు కూడా క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకోవడానికి ఐపీఎల్ ప్రధాన కారణం.'అని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు.



## ఐపీఎల్ ఈ సారి ముందుగానే

**విశ్వంభర, క్రిడావిభాగం :** క్రికెట్ లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న ఐపీఎల్ సీజన్ ఈ సారి కాస్త త్వరగానే అలరించనుంది. ఏటా ఏప్రిల్‌లో పలకరించే ఈ లీగ్ ఈ సారి మార్చిలోనే ప్రారంభం కానుంది. పలు క్రీడా ఛానళ్ల నివేదిక ప్రకారం మార్చి 14 నుంచి మే 25 వరకు 2025 సీజన్ పోటీలు జరగనున్నాయట. ఇక ఐపీఎల్ 2026 ఎడిషన్ మార్చి 15 నుంచి మే 31 వరకు, అలాగే ఐపీఎల్ 2027 సీజన్ మార్చి 14 నుంచి మే 30 వరకు జరుగుతాయంటూ పలు కథనాలు ప్రచురితమవుతున్నాయి. అయితే, వీటిపై ఐపీఎల్ కమిటీ లేదా బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఐపీఎల్ మాక్ వేలం రూ. 8.5 కోట్లకు అశ్విన్‌ను ఏ జట్టు తీసుకుందంటే?

మరోవైపు సౌదీ అరేబియా వేదికగా రెండు రోజుల్లో ప్రతిష్టాత్మక ఐపీఎల్ మెగా వేలం జరగనుంది. ఈ ఆక్షన్‌లో శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, చాహల్ వంటి భారత స్టార్లు ఉన్నారు. అయితే గత ఏడాది వరకు రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన అశ్విన్‌ను ఆ ఫ్రాంచైజీ ఈ సారి రిటైన్ చేసుకోలేదు. దీంతో ఈ స్టార్ స్పిన్నర్‌ను ఏ జట్టు తీసుకుంటుందో అన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో తనకు తానుగా ఓ ఫ్రాంచైజీకి అమ్ముడైనట్లు అశ్విన్ పేర్కొన్నాడు. అయితే, ఇదంతా మాక్ వేలంలో కావడం గమనార్హం.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అశ్విన్ దాని ద్వారా పలు క్రికెట్ విషయాలపై స్పందిస్తుంటాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో డిబేట్‌లూ కూడా పెడుతుంటాడు. ఆసీస్‌తో తొలి టెస్టుకు ముందు షేర్ చేసిన వీడియోలో అశ్విన్ ఈ మాక్ వేలం నిర్వహించాడు. అందులో అతడ్ని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తీసుకున్నట్లు వెల్లడించాడు. రూ.8.5 కోట్లకు సీఎస్కేకు అమ్ముడైనట్లు తెలిపాడు.

ఇక అశ్విన్ 2009 నుంచి 2015 వరకు చెన్నై జట్టుకే ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత రైజింగ్ పుణె జట్టులోనూ ఆడాడు. 2017లో గాయం కారణంగా క్రికెట్‌కు దూరమైన అతడు, ఆ తర్వాత పంజాబ్ కింగ్స్‌కు వెళ్లిపోయాడు. 2018లో కెప్టెన్‌గానూ బాధ్యతలు చేపట్టాడు. దిల్లీకి వెళ్లిన అశ్విన్ గత మూడు సీజన్లు రాజస్థాన్ జట్టుకు ఆడా ఆడాడు.

## థర్డ్ అంపైర్ ఘోర తప్పిదం.. అతను నాటౌట్: మాజీ క్రికెటర్లు

**విశ్వంభర, క్రిడావిభాగం :** ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో శుక్రవారం ప్రారంభమైన తొలి టెస్టులో టీమిండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ వివాదాస్పద రీతిలో ఔటయ్యాడు. అతను ఔటైన విధానంపై సోషల్ మీడియా వేదికగా దుమారం రేగుతోంది. థర్డ్ అంపైర్ ఘోర తప్పిదంతోనే టీమిండియా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పలువురు భారత మాజీ క్రికెటర్లు సైతం థర్డ్ అంపైర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముమ్మాటికి థర్డ్ అంపైర్ తప్పిదమేనని అభిప్రాయపడ్డారు.

అసలేం జరిగిందంటే..?

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ చేసింది. రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉండటంతో రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. పిచ్ నుంచి లభించిన సహకారంతో ఆసీస్ బౌలర్లు చెలరేగడంతో భారత్ ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. ఓ వైపు వికెట్లు పడ్డా మరోవైపు రాహుల్ తన జిడ్డు బ్యాటింగ్‌తో క్రీజులో పాతుకుపోయే ప్రయత్నం చేశాడు.

74 బంతులాడి మూడు ఫోర్లతో 26 పరుగులతో క్రీజులో సెట్ అయ్యాడు. బంతిని అద్భుతంగా డిఫెన్స్ చేస్తూ ఆసీస్ బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచాడు. అయితే మిచెల్ స్టార్క్ వేసిన 23వ ఓవర్ రెండో బంతిని రాహుల్ ఆఫ్ సైడ్ ఆడే ప్రయత్నం చేశాడు. కానీ బంతిని అంచనా వేయడంతో రాహుల్ విఫలమయ్యాడు.

క్లారిటీ లేకున్నా..

దాంతో బ్యాట్‌ను మిస్సైన బంతి కీపర్ చేతిలో పడగా.. ఆసీస్ ఆటగాళ్లు గట్టిగా అరిచారు. ఫీల్డ్ అంపైర్ నాటౌటివ్వగా.. ఆసీస్ రివ్యూ తీసుకుంది. రిప్లేలో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పష్టత లేదు. అదే సమయంలో బ్యాట్.. ప్యాడ్‌ను తాకడంతో అల్ట్రా ఎడ్జ్‌లో స్పైక్స్ వచ్చాయి.

దాంతో ఫీల్డ్ అంపైర్ ఔటిచ్చాడు. ఈ నిర్ణయంపై కేఎల్ రాహుల్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ మైదానం వీడాడు. అయితే క్లారిటీ లేనప్పుడు ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికి కట్టుబడాల్సిందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. టీమిండియా మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా థర్డ్ అంపైర్‌ది తెలివి తక్కువ నిర్ణయమని ట్వీట్ చేశాడు.




# 95వేల డాలర్లకు మార్క్‌ను దాటిన బిట్‌కాయిన్




విశ్వంభర, బిజినెస్: అమెరికా తదుపరి అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన తర్వాత క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. చరిత్రలోనే తొలిసారి గురువారం 95 వేల డాలర్ల మార్క్‌ను దాటింది. త్వరలోనే లక్ష డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ క్రిప్టోకరెన్సీకి సంబంధించిన అనుకూలమైన విధానాలను తీసుకొస్తారనే నమ్మకంతోనే బిట్‌కాయిన్ విలువ రికార్డ్ స్థాయిలో పెరగడానికి ప్రధాన కారణమని నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా ట్రంప్ ఎన్నికల ప్రచారంలో అమెరికాను క్రిప్టోకరెన్సీ రాజధానిగా చేస్తామని హామీ ఇచ్చారు. ట్రంప్ అధ్యక్షుడిగా విజయం సాధించిన దగ్గర నుంచి వ్యాపారవేత్తలు పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో బిట్‌కాయిన్ విలువ సుమారు 40శాతం మేర పెరిగింది. బిట్‌కాయిన్‌ను 2008లో రూపొందించారు. అయితే దీని సృష్టికర్త ఎవరు అనేది ఇంత వరకు స్పష్టత లేదు. 2009 సతోషి నకమోటో పేరుతో చలామణిలోకి తీసుకొచ్చారు. దీంతో సతోషి నకమోటోనే సృష్టికర్తగా అందరూ భావిస్తున్నారు. అయితే వ్యక్తి లేదా గ్రూపు అనేది అప్పటి నుంచి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల 'మనీ ఎలక్ట్రిక్: బిట్‌కాయిన్ మిస్టరీ' పేరిట హెచ్‌బీఓ ఓ డ్యాకుమెంటరీ తీసింది. దానిలో కెనడాకు చెందిన పీటర్ టోడ్డ్ అనే సాఫ్ట్‌వేర్ తొలిసారిగా దీనిని తయారు చేసినట్లు చూపించారు.

2018 ఆగస్టు 18న bitcoin.org అనే డొమైన్‌తో రిజిస్టర్ అయింది. 2009 జనవరి 3న బిట్‌కాయిన్ నెట్ వర్క్‌ను రూపొందించి మైనింగ్‌ను ప్రారంభించారు. హెరాల్డ్ థామస్ ఫినే అనే సాఫ్ట్‌వేర్ డెవలపర్ ద్వారా మొట్టమొదటిగా 10 బిట్ కాయిన్ల లావాదేవీలు జరిగాయి. 2012లో వెయ్యి మందికి పైగా వ్యాపారులు బిట్‌కాయిన్‌ను పేమెంట్‌గా అంగీకరిస్తున్నట్లు బిట్‌కాయిన్ పేమెంట్ సర్వీస్ ప్రొవైడ్ బిట్ పే తెలిపింది. 2013లో ఒకే నెలలో 1 మిలియన్ డాలర్ల(భారత కరెన్సీలో సుమారు రూ.7.25 కోట్లు) విలువైన లావాదేవీలు జరిగాయి.

## భారీగా పుంజుకుంటున్న స్టాక్ మార్కెట్లు



**ముంబాయి:** స్టాక్ మార్కెట్లు భారీ లాభాల బాట పట్టాయి. సెన్సెక్స్ 1,700 పాయింట్లకు పైగా పెరిగి 78,925కు ఎగబాకింది. నిఫ్టీ 500 పాయింట్లకు పైగా లాభంతో 23,875 పాయింట్ల వద్ద దూసుకెళ్తోంది. అయితే ఇవాళ(శుక్రవారం) ఉదయం 10 గంటలకు సెన్సెక్స్ 338 పాయింట్ల లాభంతో 77,494.08 వద్ద ట్రేడయ్యింది. నిన్న (గురువారం) నాడు సెన్సెక్స్ 400 పాయింట్లు పతనం కాగా నేడు పుంజుకుంటోంది. గురువారం రోజు భారీగా పడిపోయిన దేశీయ మార్కెట్లు ఇవాళ పుంజుకుంటున్నాయి. దిగ్గజ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై వచ్చిన లంచం ఆరోపణల నేపథ్యంలో నిన్న మార్కెట్లు కుప్పకూలాయి. దీంతో అదానీ గ్రూప్ షేర్లతోపాటు, మదుపరులకు చెందిన రూ.6లక్షల కోట్ల సందప నిన్న ఒక్కరోజే ఆవిరైపోయింది. అయితే ఇవాళ అంతే వేగంగా స్టాక్ మార్కెట్ పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే నిన్న అంతలా పడిపోయిన స్టాక్ మార్కెట్లు పుంజుకోవడానికి అంతర్జాతీయ మార్కెట్లు మంచి ఊపు మీద ఉండడమే కారణం అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నవంబర్ నెలకు సంబంధించి అమెరికాకు చెందిన నిరుద్యోగ డేటా వెలువడింది. దీంతో ఒక్కసారిగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. నవంబర్ నెలలో అమెరికా దేశం ఉద్యోగాల్లో మెరుగైన వృద్ధి సాధించడమే దీనికి కారణం. కొంతకాలంగా వరస నష్టాలతో ప్రధాన కంపెనీల షేర్లు పతనం అయ్యాయి. అయితే పడిపోయిన ధరల వద్ద ఆయా కంపెనీ షేర్లను మదుపరులు కొనేందుకు ఆసక్తి చూపడంతో బ్లూచిప్ స్టాక్స్ డిమాండ్ పెరిగింది. దీనికి ఐసీఐసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్బీఐ వంటి షేర్లు సపోర్ట్‌గా నిలిచాయి. అలాగే బ్యాంకింగ్ స్టాక్స్‌లోనూ కొనుగోళ్లకు మద్దతు కనిపిస్తోంది. దీంతో అమెరికాతోపాటు భారతీయ స్టాక్ మార్కెట్లు నేడు పుంజుకున్నాయి.



# "కిల్లర్" నుంచి హీరో క్యారెక్టర్ ఫస్ట్ లుక్ విడుదల

శుక్ర, మాటరాని మౌనమిది, ఏ మాస్టర్ పీస్ వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఏయూ అండ్ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. "కిల్లర్" పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ నుంచి శుక్రవారం పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. "కిల్లర్" మూవీలో పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ కొత్తగా ఉండి ఆకట్టుకుంటోంది. చేతిలో రివాల్వర్ తో పూర్వాజ్ కనిపిస్తున్నారు. రిలీజ్ చేస్తున్న ప్రతి పోస్టర్ తో "కిల్లర్" మూవీ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలో జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు టెక్నికల్ టీమ్ సినిమాటోగ్రఫీ - జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ - అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, వీఎఫ్ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్ - మెర్జ్ ఎక్స్ఆర్, పీఆర్ఓ - జీఎస్ కే మీడియా (సురేష్ - శ్రీనివాస్), బ్యానర్స్ - థింక్, సినిమా, మెర్జ్ ఎక్స్ఆర్, ఏయు అండ్ ఐ. నిర్మాతలు - పూర్వాజ్, ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి. పూర్వాజ్ రచన దర్శకత్వం వహిస్తున్నారు.

# పెళ్లి పనులు వాళ్లే చూసుకుంటామన్నారు

## నాగచైతన్య-శోభిత వెడ్డింగ్‌పై నాగార్జున అప్‌డేట్

నటుడు అక్కినేని నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల త్వరలో వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్న విషయం తెలిసిందే. వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ జంట వివాహ బంధంతో ఒక్కటి కాబోతోంది. ఇప్పటికే పెళ్లి పనులు జోరు అందుకున్నాయి. ఇక ఈ పెళ్లి వేడుక గురించి నాగార్జున తాజాగా ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. వివాహం చాలా సింపుల్‌గా చేస్తున్నట్లు తెలిపారు. చైతూ కోరిక మేరకు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సినీ ప్రముఖులు మొత్తం 300 మందిని మాత్రమే ఈ వివాహ వేడుకకు ఆహ్వానించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. స్టూడియోలో వేసిన అందమైన సెట్‌లో ఈ జంట ఒక్కటి కాబోతున్నారని హర్షం వ్యక్తం చేశారు. పెళ్లి పనులు కూడా వారిద్దరే దగ్గరుండి చూసుకుంటున్నట్లు తెలిపారు. నాగచైతన్య-శోభిత వివాహానికి అన్నపూర్ణ స్టూడియోస్ వేదిక కావడం తనకెంతో ఆనందంగా ఉందని, ఇది కేవలం స్టూడియో మాత్రమే కాదన్న నాగ్.. తమ కుటుంబ వారసత్వంలో ఒక భాగమని పేర్కొన్నారు. ఈ స్టూడియోస్ తన నాన్నగారు అక్కినేని నాగేశ్వరరావుకి ఎంతో ఇష్టమైన ప్రదేశం అని చెప్పారు. పెళ్లిని చాలా సింపుల్‌గా చేయాలని చైతూ కోరినట్లు నాగార్జున పేర్కొన్నారు. సంప్రదాయ తెలుగు పద్ధతిలో పెళ్లి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఇక పెళ్లి తర్వాత జరిగే రిసెప్షన్‌కు సంబంధించిన వివరాలు అతి త్వరలోనే తెలియజేస్తామని నాగార్జున పేర్కొన్నారు.





# నవంబరు 28న రోటి కపడా రొమాన్స్ గ్రాండ్ విడుదల

హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. తొలుత ఈ చిత్రాన్ని నవంబరు 22న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి అన్ని సన్నాహాలు చేసుకున్నారు మేకర్స్. అయితే ఓ మంచి చిత్రం చిత్రం అందరూ థియేటర్స్‌లో ఎంజాయ్ చేయాలనే సంకల్పంతో, థియేటర్స్ దొరకని కారణంగా చిత్రాన్ని ఈ నెల 28న మాసివ్ గ్రాండ్ రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా, నేటి యూత్‌ను ఆకట్టుకునే అంశాలుతో రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని ఈ నెల 28న విడుదల చేస్తున్నాం. ఈ నెల 22 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమైన నగరాల్లో పెయిడ్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నాం. ఇటీవల కొంత మంది సగటు ప్రేక్షకులకు, యూత్‌కు సినిమాను ప్రదర్శించాం. అందరికి నుంచి చాలా మంచి స్పందన వస్తోంది. బుధవారం మీడియాకు వేసిన షోకు కూడా మంచి స్పందన వస్తోంది. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీని చూడలేదు అని వాళ్లు ప్రశంసిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఓ మంచి చిత్రం అందరికి చేరువ కావాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని ఈ నెల 28న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం. ముఖ్యంగా ఆల్‌రెడీ ఈ చిత్రానికి క్రిటిక్స్ నుండి మంచి రివ్యూలు వస్తున్నాయి. దీంతో మా చిత్ర విజయంపై మరింత నమ్మకం పెరిగింది. తప్పకుండా ఈ చిత్రం 2024లో విడుదలైన చిత్రాల్లో ఉత్తమ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా నిలుస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

# కన్నప్ప నుంచి గంభీరంగా మహాదేవ శాస్త్రి పోస్టర్


డ్రీం ప్రాజెక్ట్‌గా విష్ణు మంచు భారీ ఎత్తున రూపొందిస్తున్న చిత్రం కన్నప్ప. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్ కేటాయించి డా.మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అన్ని అప్ డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పాయి. ఈ క్రమంలోనే టాలీవుడ్ దిగ్గజం మోహన్ బాబు 50 ఏళ్ల నట ప్రస్థానంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కన్నప్ప నుంచి మంచు మోహన్ బాబు లుక్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ద్వారా కన్నప్ప సినిమాలో మహాదేవ శాస్త్రిగా మోహన్ బాబు కనిపించనున్నారని స్పష్టం చేశారు. ఈ పోస్టర్ లో.. మహాదేవ శాస్త్రిగా మోహన్ బాబు గంభీరమైన లుక్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే పోస్టర్స్, టీజర్ మూవీపై అంచనాలు పెంచగా, తాజాగా వదిలిన మోహన్ బాబు పోస్టర్ బజ్ క్రియేట్ చేసింది. సినిమాలో ఈ క్యారెక్టర్ ఏ రేంజ్ లో ఉండనుందా? అనే క్యూరియాసిటీ నెలకొల్పింది. కన్నప్ప ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుందని, భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించబోతున్నామని ఇప్పటికే మోహన్ బాబు చెప్పారు. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే ఈ సినిమా తీశాం అని మోహన్ బాబు అన్నారు. ఈ సినిమాలో మోహన్ బాబు మనవడు, మంచు విష్ణు తనయుడు అవ్రామ్ సినీ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఓ వైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు కన్నప్ప సినిమాపై బజ్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు మేకర్స్. మోహన్ బాబు నటిస్తూ నిర్మిస్తున్న ఈ సినిమాపై జనాల్లో చర్చలు నడుస్తున్నాయి. ఈ మూవీ టాలీవుడ్ లో ఓ మైలురాయి అవుతుందని చెప్పుకుంటున్నారు.





# తారక్‌తో జతకట్టనున్న శ్రద్ధాకపూర్!

స్త్రీ2 సినిమా ద్వారా రూ.650 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టి టాప్ రేంజ్ లో ఉన్న శ్రద్ధాకపూర్ జూనియర్ ఎన్టీఆర్ - హృతిక్ రోషన్ కాంబినేషన్ లో వస్తున్న వార్2 సినిమాలో ఐటం సాంగ్ చేసేందుకు ఒప్పుకుంది. ఈ సినిమాకు దర్శకుడు అయాన్ ముఖర్జీ. తారక్, హృతిక్, శ్రద్ధాకపూర్ చేత మంచి మాస్ స్టెప్పులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వార్త బయటకు రావడంతో అల్లు అర్జున్ అభిమానులు బాగా ఫీలవుతున్నారు. తమ హీరోతో నటించకుండా తారక్ తో నటిస్తోందంటూ వాపోతున్నారు. బహుశా ఆమె అడిగినంత పారితోషికాన్ని వారు ఇచ్చివుంటారంటున్నారు. వార్2ను రూ.250 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిస్తున్నారు. ధూమ్ 4లో రణబీర్ కపూర్ సరసన హీరోయిన్ గా శ్రద్ధ నటిస్తోంది. అలాగే మరో భారీ బడ్జెట్ మూవీ నాగిని చేస్తోంది. మరోవైపు తారక్ వార్ 2 షూటింగ్ పూర్తిచేసిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నాడు. ఆగస్టు 14న వార్ 2 విడుదలవుతుంది. డిసెంబరు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్ లో తారక్ పాల్గొంటాడు. దీన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో ప్రతినాయక పాత్రను అమిర్ ఖాన్ పోషించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైన అతి పెద్ద బ్లాక్ బస్టర్ న్యూస్ అవుతుందని తారక్ అభిమానులు అంటున్నారు.



# హైదరాబాద్‌లో తొలిసారిగా ఉత్సవ్ - ది స్వీట్స్ కేఫ్ & లైవ్ కిచెన్ ప్రారంభం




హైదరాబాద్ నగరంలోని బంజారా హిల్స్‌లో ఉత్సవ్ - ది స్వీట్స్ కేఫ్ & లైవ్ కిచెన్ ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథులుగా బిగ్ బాస్ ఫేమ్ మానస్ నాగులపల్లి, అమరదీప్ చౌదరి హాజరై ఘనంగా ప్రారంభించారు. కాకినాడకు చెందిన సూర్య, హైదరాబాద్‌కు చెందిన శ్రావణి అనే ఇద్దరు మిత్రులు కలిసి అతి చిన్న వయస్సులోనే తమ కాళ్ళ మీద తాము నిలబడాలి అనే ఉద్దేశంతో ఈ ఉత్సవ్ అనే లైవ్ కిచెన్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా బిగ్ బాస్ ఫేమ్ నటుడు అమర్ దీప్ చౌదరి మాట్లాడుతూ... "ముందుగా ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థాంక్స్. మీ అందరూ ఈ బిజినెస్ ని సపోర్ట్ చేయాలి అని కోరుకుంటున్నాను. నేను స్వీట్స్ ఎంతో ఇష్టపడతాను. నేను ఎక్కువగా కజ్జికాయలు ఇష్టంగా తింటాను. ఉత్సవ్ ఓపెనింగ్ ఫంక్షన్ కూడ ఒక చిన్న సినిమా ఆడియో లాంఛ్ లా చేయడం నాకు ఎంతో ఆశ్చర్యంగా అనిపిస్తుంది. మన కళ్ళ ముందే స్వీట్స్ తయారు చేసి ఇవ్వడం అనేది మరొక చెప్పుకోదగిన విషయం. చాల చిన్న వయసులోనే వీరు ఇలా ఒక బిజినెస్ మొదలు పెట్టడం అనేది నిజంగా గొప్ప విషయం. ఇలాంటి బ్రాంచ్లు ఇంకా ఎన్నో పెట్టాలి, మరింత ఎత్తుకు ఎదగాలి అని కోరుకుంటున్నాను. మానస్ నగులపల్లి మాట్లాడుతూ... " ఉత్సవ్ గురించి నేను నా స్నేహితులకు, నా సర్కిల్ లో ఉన్న వారు అందరికీ చెప్తాను. ఇక్కడ స్వీట్స్ చాల బాగున్నాయి. ఉత్సవ్ ఎంతో సక్సెస్ కావాలి. ఇటువంటి ఎన్నో బ్రాంచ్ లు స్థాపించాలి అని కోరుకుంటున్నాను." అన్నారు. సూర్య మాట్లాడుతూ... "తొలిసారిగా హైదరాబాద్ లో లైవ్ కిచెన్ పెడుతున్నాం. ప్రజలు అందరూ మా స్వీట్స్ క్వాలిటీని గమనిస్తారు అని అనుకుంటున్నాను. అందుకోసమే నేను, శ్రావణి కలిసి ఈ బిజినెస్ స్టార్ట్ చేశాం " అన్నారు.

# డిసెంబర్ 13నుంచి "హరికథ" స్ట్రీమింగ్

సరికొత్త కంటెంట్‌ను ఎప్పటికప్పుడు ఓటీటీ లవర్స్ కు అందిస్తోన్న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ "హరికథ" అనే మరో సరికొత్త వెబ్ సిరీస్ ను తీసుకొస్తోంది. హాట్ స్టార్ స్పెషల్స్ గా ఈ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ వెబ్ సిరీస్ ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. మ్యాగీ "హరికథ" సిరీస్ కు దర్శకత్వం వహిస్తున్నారు. దివి, పూజిత పొన్నాడ, రాజేంద్రప్రసాద్, శ్రీరామ్, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాధినేని, శ్రియా కొట్టం, ఉషా శ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డిసెంబర్ 13 నుంచి "హరికథ" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ రోజు "హరికథ" సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ధర్మం నశించి, అధర్మం పెరిగినప్పుడు తాను మళ్లీ పుడతానని, ధర్మాన్ని స్థాపిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు..పరశురాముడు, నరసింహుడు, వామనమూర్తి.. ఇలా శ్రీవిష్ణు అవతారాల రూపంలో ఊరిలో నేరస్తులను శిక్షిస్తుంటాడో అపరిచిత వ్యక్తి. ఆ వ్యక్తి ఎవరు ?, ఈ హత్యలు ఎందుకు చేస్తున్నాడు? అనే కోణంలో పోలీసుల ఇన్వెస్టిగేషన్ మొదలవుతుంది. ఈ విచారణలో పోలీస్ ఆఫీసర్ కు ఎదురైన ఘటనలు ఏంటి? అనేది ఆసక్తికరంగా ట్రైలర్ లో చూపించారు. నాటకాల్లో దేవుడి పాత్రలు పోషించే నటుడిగా రాజేంద్రప్రసాద్ కనిపించగా..పోలీస్ ఆఫీసర్ గా శ్రీరామ్ నటించారు. మైథాలజీ టచ్ తో ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ గా సాగిన "హరికథ" ట్రైలర్ ఆకట్టుకుంటోంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com